

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY
స్వాతి
ESTABLISHED 1984
సపరివార పత్రిక
₹2
18.9.201
B.K.S.VARM



స్వాతి
సపరివారపత్రిక
The Largest Circulated Telugu Weekly

అతడు ఈ పత్రిక్కి నిర్మాత దర్శకుడు

వారం వారం ఠంచనుగా వచ్చి పాఠకులను రంజింపచేస్తున్న మన స్వాతి... ఒక్కసారిగా.. 1249వ సంచికగా... జన్మదిన సంచికగా... అంతకన్నా విశేషంగా రజతోత్సవ సంవత్సర సంచికగా.. ఈ వారం (18.7.2008) ప్రత్యేకంగా ప్రత్యక్షమై అందరినీ చకితులను చేస్తూ... మరింత మహదానందపరుస్తూ అహో అన్పించింది.

నిజమే. సంపాదకీయంలో మీరన్నట్టుగా 'మన స్వాతికి అప్పుడే పాతిక సంవత్సరాలా!' అనిపించినా... వాస్తవానికి జరజర తిరిగే కాలంతో పాటు మన స్వాతి ఉరకలేస్తూ పరుగులే పరుగులు. ఆ పరుగు ప్రవాహంలో తోటి పత్రికలు తనను అందుకోలేనంత వేగంగా... విభిన్నంగా, మేటిగా, ధాటిగా, విశిష్టంగా, ది లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీగా ముందుకు దూసుకుపోతూ సాగిపోతూనే ఉంటుంది స్వాతి.

సంపాదకీయంలో మీరు ప్రస్తావించారు... పాతిక సంవత్సరాల పత్రిక విజయాన్ని... ఇది కేవలం పాఠకదేవుళ్ళ ఆశీస్సులు మరియు ప్రోత్సాహము వలనే అంటూ నిగర్వంగా, వినమ్రంగా తలవంచేరు.

అవును అది మీ సంస్కారం.

నిజానికి పత్రికలో అసలైన సిసలైన 'సరుకు' లేకుండా ఏ పాఠక మహాదేవుళ్ళు ఉన్నపాటున ఊరికినే పత్రికను ప్రోత్సహించేయరని నేను భావిస్తున్నాను. అంటే తెరవెనుక ఒకసారి చూస్తే... స్వాతి అఖండ విజయం వెనుక ఒకే ఒక్కడు ఉన్నాడని మనకు తోస్తుంది.

అతడు ఈ పత్రిక్కి నిర్మాత దర్శకుడు.

అతడు ఈ పత్రిక ప్రతి పేజీని మై ఫెయిర్ లేడీలా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దే ఒక అద్భుత ప్రోటోకాల్ నిపుణుడు.


అతడు పాఠకుల అభిరుచుల లోతులకెళ్ళి... విజయరహస్యాలను ఆవిష్కరించే శక్తిసంపన్నుడు.

అతడు మహాద్భుత విజయసారథి.

పూలబాసలు ఎంకికి తెలుసు...

స్వాతి విజయబాటలు అతనొక్కడికే తెలుసు.

అతడి మనోచక్షువులకు గోచరంకాని విజయరహస్యాలుండవు.



అతడు నిరంతరాన్వేషి. స్వాతే అతడు. అతడే స్వాతి.

అతడెవరో అందరికీ తెలుసు.

అతడు శ్రీ వేమూరి బలరామ్ గారు... కాదు స్వాతి బలరామ్.

అంచేత ఈ రజతోత్సవ సంవత్సర స్వాతి విజయాతి విజయం స్వాతి బలరామ్‌గారికే చెందుతుంది.

అంచేత వారికి నా హృదయపూర్వక అభినందనలు.

60 ఏళ్ళు దాటిన నాకు... 50 సంవత్సరాల మైలురాయి వద్ద మళ్ళీ స్వాతిని చూడాలనే తహతహ ఉంది. అప్పటిదాకా నేను వున్నా, లేకున్నా స్వాతిని చూడాలనే తాపత్రయం సజీవంగానే ఉంటుంది కదా.

స్వాతి వీక్లీ రజతోత్సవ సంవత్సర శుభాకాంక్షలతో

అర్వాద్ విశాఖపట్నం
1.8.2008

ముత్యాల ముచ్చట్లు



సచిత్ర వారపత్రికల
విచిత్రమైన బొమ్మలాటలతో
విచికిత్సలో పడ్డ తెలుగువారికి
సపరివారపత్రిక స్వరూపం
సద్యోయౌవనంగా సృష్టించిన
నవబ్రహ్మ బలరామ్

స్వాతి కురిసిన ఇల్లు
స్వగతాలు మాట్లాడే కళ్ళు
తాతగారికిచ్చే స్వాతి రోచస్సు
స్వాతిబిందువుకందించే యశస్సు
శ్వేతకపోతాల శాంతి రచస్సు
బలరాముని కలం, హలం, చూపించే ఉషస్సు
బామ్మకు చూపించే సత్యాన్వేషణం
పరంపరాగత సంప్రదాయ సంవీక్షణం
ఆలుమగలకందించే రసిక శృంగారం
ఆరు రుచులను వెలిగించే అబ్బురమైన అంగారం

తలగడలకింద పెట్టుకున్నా
డస్కులలో దాచుకున్నా
నెలవంక సాక్షిగా స్వాతిని చదువుకున్నా
బోరగిలపడి పక్కమీద
బొమ్మలు పసందుగా చూచుకున్నా
గుటకలు మింగినా
గుండెలకు హత్తుకున్నా
సుఖసంసారాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసినా
లేడీస్‌క్లబ్‌ను వేడివేడిగా దర్శించినా
నవలల హొయలు
కథల కమామీషులు
కలకలలాడుతూ, మిలమిలలాడుతూ
కవ్విస్తున్నా, నవ్విస్తున్నా
రాజకీయం రచ్చబండమీద కూర్చుని
రవ్వల చర్నాకోలు ఝుళిపిస్తున్నా
ఈ పరివారం
ఒక ఇంటికే పరిమితమైందా!?

దేశమే పరివారంగా మారిందా!?
ప్రపంచాన్నే పరివారంగా భావించే
ప్రజ్ఞామూర్తి బలరామ్

పూసల్లో దారంలా
పఠితల మనస్సుల్లో రాగంలా వినిపిస్తాడు
రాగ కదంబాన్ని
మాసపత్రిక ఒక మధుమాసం
వారపత్రిక ఒక హరివిల్లు
కాలచక్రం తప్పకుండా
ఈ రెండింటినీ పండించే రైతన్న
స్వాతి బలరామ్

అణువణువునా స్వాతికి అంకితమై
అడుగడుగునా స్వాతిని పోషించి
వారం వారం స్వాతిని నడిపించి
కీర్తికిరీటంలా ధరించి
తానే స్వాతై స్వాతే తానై
దేశం పట్టకుండా తిరుగుతున్న మిత్రుడు స్వాతి బలరామ్

స్వాతి ఆయన స్వాంతం
స్నేహం ఆయన చైతన్యం
మానవతే ఆయన మనస్విత
మంచి ఎక్కడున్నా మనసు విచ్చి నవ్వే మందారం బలరామ్

స్నేహితులెంత దూరంగా ఉన్నా
చేతులు చాచి రమ్మనే స్నిగ్ధమూర్తి
మాటకు మనసుకు ఉన్న మంచి సంబంధం తెలిసిన మనీషి

అందుకే
ఆ స్నేహమూర్తికి ఈ ముత్యాలసరం
ముచ్చట చెప్పటంలో ముద్దులు వోయే స్వాతి బలరామ్‌గారికి
మురిపెంతో అందిస్తున్నాను
ముత్యాల ముచ్చట్లు

డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం హైదరాబాద్
8.8.2008

‘స్వాతి’ పేరుకు నక్షత్రమైనా సూర్యుడిలా వెలుగొందుతోంది



రజతోత్సవ వేదిక మీదికి స్వాతి సపరివార పత్రిక రావడం ప్రతి తెలుగువాడికి ఆనందాన్ని కలిగించే విషయం. ‘నిన్న, మొన్న పుట్టిన స్వాతికి అప్పుడే పాతికేళ్ళా’ అన్న ప్రశ్న ఆశ్చర్యంతో కూడుకున్న సందేహాన్ని కలిగిస్తే, నూరేళ్ళకు సరిపడా శక్తి సామర్థ్యాలను పుంజుకున్న స్వాతిని చూస్తే ‘అరె! స్వాతికి పాతికేళ్ళేనా?’ అన్న మరో ప్రశ్న స్వాతి స్థాయిని చాటుతుంది.

రెండు మూడు సీరియల్స్‌తో, ఐదారు కథలతో, మూడు నాలుగు వ్యాసాలతో, సినిమా ముచ్చట్లతో రంగులు అద్దుకుంటూ వారపత్రికలు వచ్చేవి. వాటితోపాటు స్వాతి ఒకటి అని మొదట్లో అనుకున్నా ఏ వారానికి ఆ వారం స్వాతి కొత్తగా,సరికొత్తగా చిత్రవిచిత్రమైన సొబగులతో సర్వాంగ సుందరంగా రూపొందుతూ పాఠకుల హృదయాల్ని కొల్లగొట్టసాగింది.

ఒకటా, రెండా ఎన్నో కొత్త ప్రయోగాలు. సరదాకి సరదా, సమాచారానికి సమాచారం, కావల్సినంత కాలక్షేపం, వారం వారం ఎదురుచూసేంత ఉత్కంఠ- ఇలా అన్నింటి కలబోతతో- కొత్త పెళ్ళికూతురిలా ముస్తాబై వస్తున్న స్వాతి క్రమంగా ఆబాలగోపాలానికీ ప్రీతిపాత్రమైపోయింది.

సీరియల్స్‌మీద వారపత్రికలు నడిచే పద్ధతికి స్వస్తి చెప్పింది స్వాతి సపరివార పత్రికే. ఫీచర్స్‌కు పెద్దపీట వేసింది కూడా స్వాతి పత్రికే.

ఈ పత్రికలో ఉన్నంత వైవిధ్యం మరే పత్రికలోనూ ఉండదు అనే నిర్ణయానికి తెలుగు పాఠకులు రూఢిగా రావడంతో స్వాతికి తిరుగు లేకుండా పోయింది.ఏ తెలుగు వారపత్రికకూ లేనంత ఆదరణను పొందగలిగి అత్యధిక సర్క్యులేషన్ గల వారపత్రికగా స్వాతి వాడవాడల్లో, ఇంటింటా తెలుగునాట నిలిచిపోయింది.

‘స్వాతి’ పేరుకు నక్షత్రమైనా సూర్యుడిలా వెలుగొందుతోంది. చారిత్రాత్మకమైన స్వాతి విజయం ఒక్క రాత్రిలో లభించింది కాదు. దీని వెనకాల దశాబ్దాల పాటుగా కొనసాగిన, కొనసాగుతున్న అహోరాత్రాల పరిశ్రమ, అకుంఠిత దీక్ష, దృఢ సంకల్పం నిండిన వజ్రబలుడు బలరామ్ వున్నాడు. ఆయన క్రమశిక్షణే స్వాతికి శ్రీరామరక్ష అయింది. ఇప్పుడు స్వాతికి ‘మణిచందన’ తిలకం కూడా దిద్దారు.

పొలమారడం, ఆదమరిచి అశ్రద్ధ చేయడం బలరామ్‌గారి నిఘంటువులోలేదు. స్వాతిని పసిబిడ్డలా ప్రతి క్షణం కంటికి రెప్పలాగా కాస్తున్నారు.

స్వాతిశయం కాదుకాని స్వాతి వెదజల్లుతున్న సాహితీ పరిమళాలు ఎన్నో! స్వాతి వెనక దాగివున్న ముత్యం బలరామేనని తెలియనివారుండరు.

బలరామ్‌గారి కలంనుంచి జాలువారిన ‘స్వాతి చినుకులు’ తెలుగువారు మరచిపోలేరు. వినూత్నమైన రచనా సంవిధానంతో, విశిష్టమైన ఆలోచనలతో పదింబదిగా కురిసిన ఆ స్వాతి చినుకుల్లో తడిసి ఆనందంతో ముద్దకాని తెలుగువాడు ఉంటాడనుకోను.

ప్రధానమంత్రులతో, రాష్ట్రపతులతో ఆయన చేసిన విదేశీ పర్యటనలు సైతం పాఠకులను మురిపించాయి.

ఎన్నో విషయాలను అవలీలగా, పూసగుచ్చినట్లుగా చెప్పడం ఆయన స్వభావం. అయినా సరే తాను రచయితను కానని ఆయన చెప్పుకోవడం ఆయన వినయానికి సంకేతం. అదే ఆయన విజయానికీ సంకేతం!!

స్వాతి వెయ్యేళ్ళు వర్ధిల్లాలి!

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు హైదరాబాద్
15.8.2008



చదువుతూ గర్వించదగ్గ పత్రిక

ఒక పాత హిందీ సినిమాలో, మెడను రకరకాలుగా తిప్పుతూ తన ప్రేయసికి, ఒక ప్రసిద్ధ సినిమా హీరో ఈ విధంగా పాడతాడు.

"క్యా తారీఫ్ కరూ ఉస్కీ, జిస్‌నే తుమ్హే బనాయా" ఈ పాటకు అర్థం, నిన్ను సృష్టించిన వాడిని ఏమని ప్రశంసించగలను?

స్వాతి పత్రిక చేతితో పట్టుకుంటే నాకు ఎంతో ఆనందం కలిగి ఈ పాట గుర్తుకువస్తుంది. ఈ వారపత్రికని, ఇన్ని రుచులతో ఎన్నో అభి రుచులతో అన్ని వయసులవారికి, భక్తులకి, పిల్లలకి,పిల్లల్ని కన్నవారికి, చదువుకునేవారికి, చదువులు చెప్పే గురువులకి, ఎన్నని వ్రాయగలను? కాని ఒక్క ముక్కలో విజ్ఞానసర్వస్వంగా కాంతులు ప్రసరిస్తూ "స్వాతిని" తీర్చిదిద్దుతున్న ఎడిటర్ మహాశయులకు కృతజ్ఞతలు.

ఒక్కొక్క శీర్షికను విడిగా వ్రాసి, ప్రశంసించి, తృప్తిచెందాలంటే, మరో "స్వాతి" తయారవుతుంది.

స్వాతి పత్రిక, చదువుతూ గర్వించదగ్గ పత్రిక.

నా చిన్నప్పుడు, బహుశా కాంచనపల్లి కనకాంబగారు అనుకుంటాను, వ్రాసిన కవిత జ్ఞాపకం వచ్చి, ఇదే కవితను "స్వాతి" పత్రిక అక్షర రూపంలో తీర్చిదిద్దుకున్నట్లు అనిపిస్తుంది.

'దేవుడున్నాడు మనుజుల దిద్ది ప్రోవ,
ధర్మమన్నది ఉంది దారి తెలుప,
పెద్దలున్నారు తత్వంబు వెలువరింప,
కర్మభూమిని పుట్టు జిజ్ఞాసువులకు
తినుచు, తిరుగుచు, పిల్లల కనుచు,
జనులు, పశువులట్టుల చెరియింప పాడికాదు
ధర్మమున, అర్థకామములు తెగ గడించి
తుదిని, మోక్షంబు సాధింప దొడ్డ బుద్ధి'.

శ్రీమతి భానుమతి పతంజలి కౌలాలంపూర్ (మలేషియా)
22.8.2008



వ్యక్తి... సంస్థ... వ్యవస్థ... పరిశోధన

ఒక వ్యక్తి సంస్థగా మారటానికి సర్వసుఖాల్ని ధారపోయాలి. సంస్థ వ్యవస్థగా మారటానికి ఆ వ్యక్తి జీవితాన్నే త్యాగంచేయాలి. ఇది స్వాతి ఆరోహణాభివృద్ధి సూత్రం. ఒక వ్యక్తి ఒక తరంలో సాధించిన అత్యద్భుత విజయానికి ప్రతీక స్వాతి వ్యవస్థ.

ఇప్పటికే పత్రికలుండగా నేను మరో పత్రిక పెడితే నిలబడుతుందా అని బలరామ్ గారు అప్పట్లో అనుకొని ఉంటే తెలుగు పాఠకులు ఒంటరి వారయ్యేవాళ్ళు. వారి ఊహా ప్రపంచం కుంచించుకుపోయేది. ఒక అద్భుతమైన నేస్తాన్ని అందిపుచ్చుకొనేవాళ్ళు కూడా కాదు.

అరకొర నిధులతో స్వాతి సంస్థను స్థాపించిన బలరామ్ గారిలో ఎంత నమ్మకం ఉండాలి? మరెంత ధైర్యముండాలి? ఇంకెంత తెగువ, మొండితనం ఉండాలి?

అప్పటికే ఎన్నో పత్రికలుండగా, అవి విజయవంతంగా నడుస్తుండగా పాపాయిలా పత్రికా ప్రపంచంలోకి ప్రవేశించిన స్వాతిని చూసి ఎంత ధైర్యం బలరామ్ గారికి అని అనుకున్నవాళ్ళు అనుకున్నప్పుడు విన్న వాళ్ళలో నేనొకడ్ని... అయితే అప్పుడూ నేనూ ఒకటనుకున్నాను... నమ్మకం ధైర్యాన్నిస్తుంది. నీతి నిజాయితీలు ఆత్మస్థయిర్యాన్నిస్తాయి... దయ, జాలి, కరుణ భగవంతుడి ఆశీస్సులై వర్షిస్తాయి.నమ్మకం ధైర్యం, నీతినిజాయితీలు, దయ, జాలి, కరుణ, లక్ష్య శుద్ధి, అనవరతపు శ్రమ ఇవన్నీ బలరామ్ గారికి ఆయుధాలు...

వీటికి మెరుగుపూత గుండెలనిండుగా నవ్వే బలరామ్ గారి నవ్వు... గుండెలనిండుగా నవ్వే వారిలో భగవంతుడుంటాడని బాపుగారి వాక్కు. అది ముమ్మాటికి నిజం...

1253 సంచికల్ని నిత్యనూతనంగా, నిత్యాన్వేషణలో వెలువరించడం గ్రీజుపూసిన తాడుమీద నడక లాంటిదే. పాఠకులేం కోరుకుంటారో అదివ్వడం మామూలు పత్రికలు చేసే పని. పాఠకులకు ఏం ఇస్తే మేలు జరుగుతుందనేది స్వాతి స్వభావం.

1253 సంచికల్ని ఒక్కసారి తిరగేస్తే ఇప్పటికీ పనికొచ్చేవి... ఇప్పుడు చదివి ప్రయోజనం పొందగలిగేవి 95%. మిగతా 5% టైమ్ బౌండ్...

ఫిక్షన్... ఆరోగ్యం... అందం... టూరిజమ్... హాస్యం... మెదడుకు మేత... ఆర్థికశాస్త్రం... సామాజికశాస్త్రం... సెక్స్ సమస్యలు... మానసిక రుగ్మతలు... షాపింగ్... ఫ్యాషన్... ఆధ్యాత్మికం... అంతరంగం... కెరియర్... విద్య... విజయ సోపానాలు... రిచ్ అండ్ ఫేమస్ జీవన విధానాలు... అనిల్ బాల ప్రపంచం... గృహిణి చిట్కాలు... వంటావార్పులు... పరిశుభ్రత-పచ్చదనం... ఒకటేమిటి ఏది ప్రవేశపెట్టినా ముందుగా స్వాతే ప్రవేశపెడుతుంది... తరువాత అందరూ అనుకరిస్తారు. అందుకే స్వాతి ఎప్పుడూ నిరంతరాన్వేషణలోనే ఉంటుంది.

తెలుగు వార పత్రికా ప్రపంచంలో రీసర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ని సమర్థవంతంగా నడుపుతున్న సంస్థ స్వాతి ఒక్కటే...

అందుకే స్వాతి ఎప్పుడూ కొత్తగా, కళకళలాడుతూ ఉంటుంది... మిగతావి వెలవెలబోతుంటాయి.

గతంలో ఇప్పుడూ స్వాతిని మిగతా పత్రికలు పరిశీలిస్తూ ఫాలో అవుతుంటాయి. ఇప్పుడు కొత్తగా దినపత్రికలు, ఛానల్స్ కూడా స్వాతిని అనుకరించడం చూస్తుంటే స్వాతి ఎన్ని వేల అడుగుల ముందుందో ఎవరికైనా అర్థమవుతుంది. స్వాతి గడియారం ఎప్పుడూ మిగతా పత్రికల గడియారాల కంటే ఏడు గంటలు ముందుంటుంది. ఆ ఏడు గంటలు, ఏడు రోజులు కాగానే కొత్త స్వాతి మనముందుకొస్తుంది.


మిగతావన్నీ ఎప్పుడూ ఒకలాగే ఉంటాయి... శిలావిగ్రహం నవ్వులా... స్వాతి ఎప్పుడూ ఒకలా ఉండదు... ఎందుకంటే అత్యద్భుత శిల్పి బలరామ్ గారి చేతిలో ఉలికి విశ్రాంతి ఉండదు గనుక.

పాఠకుల్ని దేవుళ్ళని స్వాతి అంటే, వెంటనే ప్రేక్షకుల్ని దేవుళ్ళని అంటారు కొందరు. కొత్తగా అందామని వారికుండదు. పాతగా అనటం స్వాతికిష్టంలేదు. అందుకే స్వాతి ఈరోజు ప్రతి ఇంటి నేస్తం... ప్రతి చేతి భూషణం... ప్రతి కంటి వెలుగు...ప్రతి గృహిణి ఆత్మ...వెరసి స్వాతి ప్రతి ఒక్కరి మానసిక సహచరిణి... నాలుగు గోడల మధ్య కూర్చుని పనిచేసుకుంటున్నప్పుడు కూడా బలరామ్ గారి ఆలోచనలకుండే ప్రపంచాన్ని స్కాన్చేసే నేత్రాలు, ఎప్పుడూ అప్రమత్తంగానే ఉంటాయి.

బలరామ్గారు దేశ విదేశాల్లో ప్రధానులతో,రాష్ట్రపతులతో యాత్రలు చేస్తున్నప్పుడు ఆయన ఆత్రుతకు ఆలోచనలు మొలచి అవి స్వాతి సంస్థ చుట్టూ పహరా కాస్తుంటాయి. అందుకే స్వాతి అప్పుడు... ఇప్పుడు... మరెప్పుడైనా ముందు స్థానంలోనే ఉంటుంది.

సూర్యదేవర రామ్మోహనరావు హైదరాబాద్

29.8.2008



పాఠకులు దేవుళ్ళవుతారు-ఎలా?

స్వాతి సపరివార పత్రిక ప్రారంభించిన తొలి రోజుల్లో ఆర్టిస్టు 'జె'గార్ని నేను తరచూ కలిసేవాణ్ణి.

ఒక రోజు ఆయన, "How is Mr. Balaraman (శ్రీ బలరామ్ గార్ని, 'జె' గారు ఆప్యాయంగా ఇలానే పిలుస్తారు)?" అనడిగారు.

"ఆయనకేం తక్కువ సార్. బ్రహ్మాండంగా వున్నారు. పత్రిక, కవర్ టు కవర్ ఆక్రమించి కనిపిస్తారు. He is a giant. ఐతే ఆయన గాంభీర్యమంతా తృటిలో మాయమౌతుంది. ప్రింట్ సెక్షన్ నుంచి 'స్వాతి' ఫస్టు కాపీని ఆయనే తన ఆఫీస్‌లో మొట్టమొదట రిసీవ్ చేస్తారు. తన రెండు చేతుల్తో భక్తిగా 'స్వాతి' పత్రికను తీసుకుని కళ్ళ కద్దుకుని ఒళ్లొంచి నిలబడతారు. ఆ సమయంలో ఎంతో హంబుల్‌గా కనిపిస్తారు" అన్నాను. అందుకు 'జె' గారు,

"You see! బలరామన్ 'స్వాతి'ని దేవుడుగా పూజిస్తున్నారు. అందుకే 'స్వాతి'ని చదివే పాఠకులు, పాఠకదేవుళ్ళయ్యారు!" అన్నారు.

'జె'గారితో ఈ సబ్జెక్టుమీద డిస్కషన్ పెట్టుకుందామని,

"Ofcourse! ఐతే, నా ఉద్దేశంలో పాఠకుల్ని, పాఠకదేవుళ్ళని పిలవడంలో బిజినెస్ మోటివ్ వుందనుకుంటున్నాను సార్! పాఠకుల లాయల్టీ సంపాదించడం కూడా పర్పస్!" అన్నాను.

'జె' తన స్కెచ్చింగ్ ఆపి, నా వంక సీరియస్‌గా చూశారు.

"You are wrong! దేవుడిపై నమ్మకం వున్నవాళ్ళెవ్వరూ దేవుడితో బిజినెస్ చెయ్యరు. దేవుడు తనకి లాయల్‌గా వుండాలని అనుకోరు. In my view, Mr. Balaraman is a true devotee of God! బలరామన్, పాఠకులను దేవుళ్ళుగా భావించి, వాళ్ళకి 'స్వాతి'ద్వారా లాయల్‌గా వుండాలనే, 'స్వాతి' ఫస్టుకాపీని భక్తితో స్వీకరించి కళ్ళకద్దుకుంటున్నారు!"-అంటూ, పెయింట్ చేస్తున్న స్కెచ్‌ని పక్కనపెట్టి కళ్ళ జోడుతీసి, కళ్ళు తుడుచుకుంటూ నావైపు తిరిగారు.


సంభాషణ కొనసాగించాలని, నేను ఆయన కళ్ళల్లోకి చూస్తూ, "సార్! పాఠకులని, పాఠకదేవుళ్ళని పిలవడం ఒక extra-ordinary కాన్‌సెప్ట్! అది శ్రీ బలరామ్ గారికే తట్టింది. ఆ కాన్‌సెప్ట్ 'క్లిక్' అయింది-అంతే!!" అన్నాను. వెంటనే 'జె' గారు,

"There you are! దేవుడు, దైవభక్తికి సంబంధించిన ఎటువంటి సిన్సియర్ ప్రయత్నమైనా సరే అది 'క్లిక్' అయి తీరుతుంది. నీ కృషినీ, నీ నమ్మకాన్నీ, నువ్వు కాన్‌సెప్ట్ అనూ-మరేదైనా అను. నీకు దేవుడిమీద నమ్మకం, భక్తీవున్నాయా- అదే ముఖ్యం. That's what Mr. Balaraman is doing. He worship's SWATI and treats its Readers as Gods!" అన్నారు.

నేను మారు మాట్లాడలేదు. తమిళ పత్రికారంగంలో 'జె'గారు మకుటం లేని మహారాజు. మనకి బాపుగారంటే ఎంత అభిమానమో, తమిళ పాఠకులకి 'జె' గారంటే అంత గౌరవం. ఆ మహా చిత్రకారుడు 'జె' చెప్పింది అక్షరాల Fact!

'స్వాతి' రజతోత్సవ విప్లవం సాధించింది. యావద్భారత దేశంలోనే కాదు,ప్రపంచం యావత్తూ, తెలుగు పాఠకుడెక్కడున్నాడో,అక్కడ, అతని చేతినలంకరించి, నవరసాల నైవేద్యాన్ని వడ్డిస్తోంది. 'స్వాతి'ని తన రెండు చేతుల్తో, భక్తితో పూజించే శ్రీ వేమూరి బలరామ్‌గారు చల్లగా వుండాలని, సర్వేశ్వరుడు ఎల్లవేళలా ఆయనకి, ఆయన కుటుంబానికీ, స్వాతి ఆఫీసు పరివారానికి తోడుగా వుండాలని మనసారా ప్రార్థిస్తాను.

కార్టూనిస్ట్ జయదేవ్ చెన్నై
5.9.2008



పాఠకులకు అక్షర నైవేద్యం

ఈ సృష్టిలో ఏడు వింతలే కాదు...
ఎన్నో అద్భుతాలు... అత్యద్భుతాలు...
గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కినవి... ఎక్కనివి...

పత్రికా ప్రపంచంలో పాఠకుల హృదయం అనే గిన్నిస్‌బుక్‌లో ఓ అద్భుతం 'స్వా...తి'. నాలో రాయాలన్న కోరిక కలిగించిన కథన కుతూహలం 'స్వా...తి'.

అక్షరాలు అవే.... కానీ అక్షరాల కూర్పులో రమ్యత...
పదాలు అవే... కానీ పదాల నిట్టూర్పులో కొత్త సొబగు...
వాక్యాలు అవే... కానీ వాక్యాల క్రీడలో సరికొత్త ఆవిష్కారం...

'స్వాతి'లో ఏ ప్రయోగంచేసినా, అది పాఠక జనరంజకమైతే, ప్రయోజిత ప్రయోగమైతే... 'స్వాతి'వేదిక మీద సగర్వంగా అక్షర ప్రదర్శన మొదలవుతుంది. ఇది నాకు అనుభవైద్యం...పాఠకులకు అక్షర నైవేద్యం. హాస్యమో, సరసమో,మానవ సంబంధమో...అన్న తేడా లేకుండా ఏ రస మైనా, పాఠకులకు వైవిధ్యభరితమైతే, ఆహ్లాద చందన చర్చితమైతే ఆ అక్షరాలను ఆత్మీయంగా, సోదర సమానంగా అక్కున చేర్చుకునే ఆత్మీయ సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్‌గారు.

రచయిత రాసే ప్రతీ అక్షరాన్ని అతి పదిలంగా 'స్వాతి'లో పదిల పరుస్తారు. పాఠకుల హృదయంలో నిక్షిప్తపరుస్తారు.

'స్వాతి' పాతికేళ్ళ ప్రస్థానంలో నా రచనలు ఉండడం... అదో ప్రివిలేజ్... 'స్వాతి' రచయితలకు ఆర్థిక, హార్థిక స్థయిర్యాన్నిస్తుంది.

'స్వాతి' వేనవేల సంచికలను దాటి, లక్షల సంచికలను... కోట్లాది పాఠకులను చేరుకోవాలి.

ఒక అక్షరం... ఓ వేకువఝాము నాతో ఇలా అన్నది...
నువ్వు రాసే ప్రతీ అక్షరం 'స్వాతి' చినుకవ్వాలి.
నువ్వు రాసే ప్రతీ పదం 'స్వాతి'శయాన్ని స్పృశించాలి.
నువ్వు రాసే ప్రతీ వాక్యం 'స్వాతి' చదువరుల ముంగిట కొలువై నిలవాలి.

'స్వాతి' ఖ్యాతిని అజరామరం చేస్తోన్న వేమూరి బలరామ్ గారికి అభినందనలు.

ముచ్చర్ల రజనీ శకుంతల సికింద్రాబాద్
12.9.2008



అక్షరాల సాక్షిగా...

'స్వాతి' పాతికేళ్ళుగా పాఠకుల హృదయాంతరాల్లోకి ప్రయాణిస్తూనే వుంది. ఆహ్లాదపు మజిలీలు, ఆలోచనల స్టేషన్లు, ఆధ్యాత్మిక సెలయేళ్ళు, చిన్నారుల హిమపాతాలు దాటి చదువరులను అనుభూతి గమ్యానికి నిరంతరం చేరవేస్తూనే వుంటుంది. ఆ ప్రయాణంలో పాతికేళ్ళుగా అక్షరాల సాక్షిగా... 'స్వాతి'వనం, పాఠకుల అభిమానపు పచ్చదనంతో కళకళలాడుతూ వర్ధిల్లుతూనే వుంది.

స్వాతి సక్సెస్ ఒక్కరోజులో వచ్చిందికాదు. నిరంతర కృషి, అహరహం తపన... అక్షరాలతో భేటీ, అభిమాన పాఠకులతో మమేకం... అన్నీ కలిస్తే స్వాతి... The Largest Circulated Weekly.

విభిన్న శీర్షికలు... భావోద్వేగ కథలు... వాట్ నెక్స్‌ట్ అనిపించే సీరియల్స్... ఆధ్యాత్మికత... మహిళ... అనిల్ స్వాతి... ఇలా విభిన్న శీర్షికలు... వైవిధ్యభరిత ప్రత్యేక కథనాలు. ఏం చేసినా స్వాతి ధ్యేయం ఒక్కటే... పత్రిక కొనే పాఠకుడు... తను చెల్లించే ప్రతి పైసాకు సరిపడా అక్షర నైవేద్యం అందుకోవాలి.

ఆ నేపథ్యంలో శ్రీ వేమూరి బలరామ్‌గారు ఎప్పుడూ అలుపెరుగని బాటసారే...

సస్పెన్స్, క్రైమ్, ఆధ్యాత్మిక... ఇలా ఏ కథ రాసినా... రచయిత ఏ ప్రయోగం చేయాలన్నా ఓ వేదిక కావాలి... ఆ వేదిక స్వాతి... ఆ చేయూత బలరామ్ గారిది.

ఓ సినిమా స్టోరీ డిస్కషన్ టైమ్‌లో (స్వర్గీయ) ఓంకార్‌గారు వేమూరి బలరామ్‌గారిని శ్రీకృష్ణదేవరాయలతో పోల్చారు... అక్షరాలా అది నిజం...

ఆనాటి రాయలకాలంలో అష్టదిగ్గజాలను గౌరవించారు ఆనాటి రాయలు... కానీ, ఈనాటి స్వాతి సామ్రాజ్యంలో ఎందరో అక్షర దిగ్గజాలను గౌరవించి, ఆదరించి, అత్యధిక పారితోషికం అందించి... పాఠకుల దగ్గరకు చేరుస్తున్నారు ఈ అభినవ శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీ వేమూరి బలరామ్‌గారు పత్రికలో కనబడరు... పాఠకుల హృదయాలలో వినపడతారు... అక్షరాల్లో సాక్షాత్కరిస్తారు.

స్వాతి ప్రస్థానం మరెన్నో తరాలను అలరించాలి.

విజయార్కె సికింద్రాబాద్
19.9.2008

ఈనాటి ఈ స్వాతి ఏనాటిదో

38 సం॥గా 'స్వాతి'మాసపత్రిక,తర్వాత నవలానుబంధం,35 సం॥గా మా UK విదేశాంధ్ర వలస జీవితం, 25 సం॥గా ధారావాహికంగా వారం వారం ఎన్నో వేల మైళ్ళ దూరంలో ఉన్న మా కుటుంబాలకు 'స్వాతి' దర్శనం... కలా, నిజమా!

ప్రతివారం 'స్వాతి' చక్కగా ముస్తాబై, అన్ని అలంకరణలతో తెలుగింటి ఆడపడుచులా పలకరిస్తుంది.

'స్వాతి' పేజీలను అలరించి, అలంకరించిన కళాకారులు, రచయితలు, శ్రీ బాపు, స్వర్గీయ ఓంకార్, యండమూరి, గొల్లపూడి, మైలవరపు, తనికెళ్ళ- ఇంకా ఎందరో సాహితీప్రియులు, మా అదృష్టంకొద్దీ మా గడప తొక్కిన మిత్రులు, వీరందరితో ఖచ్చితంగా జరిగేవి 'స్వాతి' విజయం, బలరామ్‌గారి స్నేహశీలత్వం,ప్రతిభ,కార్యదీక్షతను గురించిన ముచ్చట్లే.

ఈ 'స్వాతి' శిల్పాన్ని చెక్కుతూ, సరికొత్త రూపాల్తో నగిషీలు పెట్టే శిల్పకారుడు, 'స్వాతి' చైతన్యరథానికి సూత్రధారుడు శ్రీ బలరామ్.

సెప్టెంబర్ 11, 2001లో భయానక పరిస్థితుల్లో అమెరికాలో చిక్కుకుపోయినా కుటుంబసభ్యులతోపాటు (అమ్మాజీ, మణిచందన, అనిల్ కుమార్, సత్యచౌదరి, నిత్యచౌదరి) Cardiffలో జరిగిన ద్వైవార్షిక యూరోపియన్ తెలుగు అసోసియేషన్ సమావేశాలకు ముఖ్య అతిథిగా రావటం బలరామ్‌గారి ఆత్మబలం, మాటపట్టింపు, క్రమశిక్షణకు నిదర్శనం.

ఈలాంటి వ్యక్తిత్వం, పట్టుదల 'స్వాతి'ని ఎప్పుడూ ముందుకు నడుపుతుంటాయి.

'స్వాతి' ఇన్ని అద్భుతాలను సృష్టించి, ఇంత పరిపూర్ణత సాధించిందంటే... ఇది బలరామ్‌గారి ఒక life time achievement అవుతుందా? కానేకాదు.ముందు జన్మల్లో కూడా ఆయన వేరే రూపాల్లో పత్రికా ప్రచురణ వ్యాపకం చేసి ఉంటారు, తెలుగు పాఠకుల జిజ్ఞాసను పెంచి ఉండచ్చు. ఎన్నో జన్మల కష్టఫలమే ఈనాటి 'స్వాతి' మహాయజ్ఞం, విశ్వరూపం. "ఈనాటి ఈ స్వాతి ఏనాటిదో"

డా॥ వెలగపూడి బాపూజీరావు సౌత్‌వేల్స్, యు.కె.
26.9.2008



స్వాతి పాతికేళ్ళ నేస్తం

తెలుగు ప్రజలు చేసుకున్న అదృష్టంగా పత్రికా రంగంలో ఆదినుండి నేటివరకు ఎన్నెన్నో పత్రికలు తొలినుండి తెలుగువారిని అలరిస్తున్నాయి. కాలమార్పులు సహజం కాబట్టి వాటిని తట్టుకోలేక కొన్ని చరిత్ర పుటల్లోకి జారిపోతే కొన్ని మాత్రం నిలబడగలిగాయి.

నాకు చదవడమే బాగా ఇష్టం. రాయడం కూడా ఇష్టమే కాని ఎక్కడో ఏదో చిన్న సంశయం. అప్పుడో... ఎప్పుడో ఒకటీ రెండుచోట్ల అచ్చులో నా పేరు చూసుకుని సంతోషించినా- 'రాయండి' అని నా శ్రీమతి పద్మశ్రీ పోరుబెట్టినా 'ఊఁ...' అని ఊరుకోవడమే జరుగుతోంది.

ఇదంతా ఎందుకు అని అనుకుంటే దానికో కథ వుంది- ఆ కథకు స్వాతికి లింకు వుంది. అలా నా పేరు మొట్టమొదట అచ్చులో చూసుకుని ఎగిరి గంతులేసిన జ్ఞాపకం ఇప్పటికి పాతికేళ్ళు గడిచినా పదిలంగానే వుంది. అప్పుడు నా వయసు లేతవయసే.

'స్వాతి' ప్రథమ సంచిక ఆకర్షణీయంగా 'ఖమ్మంమెట్టు' బస్‌స్టాండ్ బుక్‌స్టాల్‌లో కనిపిస్తే కొని ఆత్రంగా పత్రిక మొత్తం చదివేశా... ఆ ఊపులోనే ఆరుపైసల్తో కార్డుకొని 'ఉత్తరం' రాసి పోస్ట్ చేశా!

ఇహ చూడండి స్వాతికోసం రోజూ ఎదురుచూపే- నా ఉత్తరం స్వాతిలో వస్తుందా...రాదా? నా పేరు అచ్చులో వుంటుందా... వుండదా? ఒకటే ఆత్రం... రోజులు లెక్కెట్టుకోడం... ఎదురుచూడటం... ఎలాగైతేనేం స్వాతి వచ్చింది, ఉత్తరాల శీర్షికలో నా ఉత్తరం యథాతథంగా ప్రచురించబడింది. అలా అచ్చులో నా పేరు చూసుకోవడం 'స్వాతి'తోనే మొదలైంది. ఈనాటికీ ప్రతివారం ఒక అద్భుతం-స్వాతి-మార్పులు కోకొల్లలు-ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే వుంది. అన్నీ అభిలషణీయమైనవే, విజ్ఞాన వినోద ఆధ్యాత్మిక అందమైన ఆసక్తిదాయకాలే...

బలరామ్‌గారూ! మీ బలం స్వాతియే- మీరు నాటిన విత్తు... మొక్కై... మహావటమై... ఆంధ్రదేశం దాటి- భారత హద్దులు చెలగి- విశ్వమంతా విస్తరించాలి. భారతీయ భాషల్లో హిందీ తర్వాత 'తెలుగు'దే స్థానం- అందు 'స్వాతి'దే ప్రథమ స్థానం.

ఈ బాంధవ్యం ఇలా తరం... తరం... నిరంతరం కొనసాగాలని, 'స్వాతి' దేదీప్యమానంగా నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ...

రావులపాటి వెంకట రామారావు హైదరాబాద్
3.10.2008



రంగుల హరివిల్లు స్వాతి

స్వాతి సపరివార పత్రిక ప్రారంభించి అప్పుడే పాతికేళ్ళయిందా! ఇంకా నిన్నగాక మొన్న ప్రారంభించినట్లేవుంది.

స్వాతి ప్రారంభోత్సవ సభలో కూడా పాల్గొన్న అదృష్టం నాది.

సన్నని స్వాతివానలో ప్రారంభమైన 'స్వాతి' ఈనాడు పలు మార్పులు చేర్పులు సంతరించుకుని, నిత్యనూతనంగా ప్రవర్ధిల్లుతూ స్వాతి ముత్యాలను దేశ విదేశాలలో కురిపిస్తోంది.

ప్రారంభం నుంచి ఈనాటి వరకు వెలువడిన దాదాపు అన్ని సంచికలు చూశాననే నా నమ్మకం. తొలినాటి నుంచి సంప్రదాయాన్ని గౌరవిస్తూ, ఆధునికతను స్వాగతిస్తూ, వర్తమాన రాజకీయాలకు అద్దం పడుతూ, ఒక్కోసారి నిష్కర్షగా, నిర్మొహమాటంగా విమర్శిస్తూ అపారమైన వినియుక్త సమాచారం సాధికారంగా అందిస్తూ, పత్రికా రంగంలో అగ్రశ్రేణిలో నిలిచిన రంగురంగుల హరివిల్లు స్వాతి సపరివార పత్రిక. బాపూ బొమ్మలు స్వాతికి ప్రత్యేక ఆకర్షణ.

తెలుగులో దినపత్రికలు మినహా, మిగతా పత్రికలన్నిటి సర్క్యులేషన్ కలిపితే ఎంత వుంటుందో అంతకు పైగా స్వాతి సర్క్యులేషన్ ఉందని తెలిసినప్పుడు హృదయం ఉప్పొంగుతుంది.

స్వాతి విడుదలైన రోజున రైళ్ళలో, బస్సుల్లో, విమానాల్లో పలువురి చేతులలో స్వాతి వారపత్రిక కనిపించడం, రాష్ట్రేతర రైల్వే పుస్తకాల షాపుల్లో, విదేశాలలోని పత్రికా విక్రయకేంద్రాలలో స్వాతి పత్రిక ఒక్కటే చోటు చేసుకోవడం చూసినపుడు 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' గేయం గుర్తుకు వస్తుంది. పత్రికానిర్వహణే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా జీవిస్తున్న మీరు ధన్యులు.

డా॥ వెలగా వెంకటప్పయ్య తెనాలి
17.10.2008



స్వాతి సపరివార పత్రిక రజతోత్సవ సంబరాల అభినందనలు

మన సాంప్రదాయం ప్రకారం అరవైనాలుగు కళలు ఉన్నాయి అని చెబుతారు. ప్రతి సంచికని సర్వాంగ సుందరంగా, అత్యంత ఆకర్షణీయంగా ఎప్పటికప్పుడు వినూత్నంగానూ,విలక్షణంగానూ తీర్చి దిద్దుతూ సంవత్సరానికి అరవై నాలుగు సంచికలని (52+12) రూపొందించడం అన్నది ఆ అరవై నాలుగు కళలకీ ఏమాత్రం తీసిపోని ఫీట్!

ముప్పై ఎనిమిదేళ్ళుగా మాసపత్రిక బాధ్యతని, ఇరవై నాలుగేళ్ళుగా వారపత్రిక బాధ్యతని సవ్యసాచిలాగా నిర్వహిస్తున్న బలరామ్‌గారి ప్రస్తుత వయసు దాదాపు 62 (38+24=62) అవడం గమ్మత్తుగా అనిపిస్తుంది కాని ఇంతకాలం అంతటి బృహత్కార్యాన్ని ఒక యజ్ఞంలాగా కొనసాగిస్తూ రావడం మాత్రం ఆషామాషీ కాదు.

ఇరవై నాలుగేళ్ళ క్రితం తెలుగు వారపత్రికల పేర్లు దాదాపు ఒకేలా ఉండేవి...ఆంధ్రతో మొదలయ్యి రెండో మూడో అక్షరాల పేరు తరువాత సచిత్ర వారపత్రిక అని ముగిసేవి. ఆ ఉరవడికి స్వస్తి చెప్పి కొత్త ఒరవడి సృష్టించిన ఘనత స్వాతి సపరివార పత్రికదే!


సాధారణంగా పత్రికలలో దర్శనమిచ్చే మూస శీర్షికలకి ఎప్పుడూ స్థానమివ్వకపోవడమే బహుశా స్వాతి విజయరహస్యం అయివుండాలి అని ఓ స్టేట్‌మెంట్ ఇవ్వడం తేలికే... కాని దాన్ని ఆచరణలో పెట్టడానికి ఎన్నెన్ని ప్రయోగాలు చేయాలో ఎంతటి సృజనాత్మకత కావాలో ఎంత దృఢమైన పట్టుదల కావాలో! ఫ్లాష్‌బ్యాక్‌లో మరీ ఎక్కువరోజులు వెనక్కి వెళ్ళనక్కరలేదు... క్రితం సంవత్సరం సంచికతో ఈనాటి సంచికని పోలిస్తే తెలిసిపోతుంది... ఈ స్వల్పకాలంలోనే పత్రికలో ఎన్నెన్ని అందమైన మార్పులూ ఆకర్షణీయ మైన చేర్పులూ జరిగాయో!

మిగిలిన పత్రికలతో పోటీ సంగతి అటుంచితే స్వాతి ఎప్పటికప్పుడు తనతో తానే పోటీపడుతున్నదా అనిపిస్తుంది.

ఓ అయిదు పదేళ్ళ క్రితం స్వాతిని ఇప్పుడు తిరగేసినా మళ్ళీ కొత్తగా చదువుతున్న అనుభూతిని, చదవాలన్న ఆసక్తిని కలిగించే పేజీలు ఎన్నుంటాయో అనుభవపూర్వకంగా తెలుసుకున్నప్పుడు పత్రికా నిర్వహణ అరవైనాలుగు కళల మేళవింపు కదా అన్న భావన తప్పక కలుగుతుంది.

వ్యక్తికి బహువచనం శక్తి అని శ్రీశ్రీ అన్నారు. శక్తికి బహువచనం ఏమిటో మహాకవి చెప్పలేదు... ఆయనలాగా హృద్యంగా నిర్వచించడం కష్టం... అయితే కొన్ని ఉదాహరణలు ఇవ్వచ్చు... అందులో ఇప్పుడు మొదటగా స్ఫురించే పేరు శ్రీ బలరామ్‌గారిదే! స్వాతి తెలుగువారిని ఇలాగే చిరకాలం అలరిస్తూ ఉండాలని కోరుకుంటూ...

శ్రీ ఉదయిని హైదరాబాద్
31.10.2008



తెలుగు సాంస్కృతిక మహాసామ్రాజ్యం

శ్రీకృష్ణదేవరాయలు, ఆముక్తమాల్యద,కాకతి రుద్రమ,ఓరుగల్లు, ఆదికవి నన్నయ, గురజాడ అప్పారావు, వీరేశలింగంపంతులు, రాజమహేంద్రవరం, తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడు, బెజవాడ కనకదుర్గమ్మ, యాదగిరి శ్రీలక్ష్మీనరసింహుడు, శ్రీశైలం శ్రీ మల్లికార్జునుడు, సింహాచలం శ్రీ వరాహ నరసింహుడు, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యానారాయణుడు, గోదావరి, కృష్ణవేణి- తెలుగు సంస్కృతితో మమేకమైన ఈ ప్రాతఃస్మరణీయ నామాలతోపాటు నాకెల్లప్పుడూ స్ఫురించే మరో తెలుగు వైభవ తార్కాణం 'స్వాతి' సపరివార పత్రిక.

కోట్లాది పాఠక హృదయాలకు విస్తరించిన ఒక తెలుగు సాంస్కృతిక మహా సామ్రాజ్యం 'స్వాతి' సపరివార పత్రిక అయితే తనద్వారా తెలుగు సాహిత్యాన్నీ, సంస్కృతినీ పాతికేళ్ళుగా పరిపోషిస్తున్న 'స్వాతి' అధినాయక సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్‌గారు సాక్షాత్తు ఒక తెలుగు వల్లభుడు. శ్రీకృష్ణదేవరాయలవారు ఆముక్త మాల్యదను విరచిస్తే ఈ అభినవ కృష్ణరాయలు పాతికేళ్ళుగా వారం వారం ఒక ఆముక్త మాల్యదను వెలువరిస్తున్నారు.

'స్వాతి' కోసం బలరామ్‌గారు ఏకోన్ముఖంగా జరిపే కృషిని చూస్తుంటే ఆయన గతజన్మలో ఏ మహర్షో అయివుండవచ్చని అనిపిస్తుంది. చుట్టూ చెట్లు, పుట్టలు, అడవులు మొలకెత్తినా చెక్కుచెదరని కఠోరతపస్సు చేసే ఓ ఋషిలా చుట్టూ ఎన్ని అవకాశాలు విస్తరిస్తున్నా 'స్వాతి' వినా అన్య ప్రపంచాన్ని ఊహించని మహా తపస్వి బలరామ్‌గారు.

ఇప్పుడు తెలుగువారి ఆడపడుచు 'స్వాతి' సపరివార పత్రిక పాతిక వసంతాల ప్రాయానికి రావడంతో ఈ సాహితీ మహర్షి కొన్ని అదనపు బాధ్యతల్ని కూడా భుజాన వేసుకున్నారు. ఆమెకు వారంవారం ఇంద్రధనుస్సు నుంచి నూతన వస్త్రాలు తెచ్చి కట్టబెడుతున్నారు.

దేవతల ఉద్యానవనాల నుంచి మంత్రపుష్పాలను తెచ్చి అలంకరిస్తున్నారు. జాబిలి నుంచి బంగారు గిన్నెలతో వెన్నెలనుపట్టి తెచ్చి ఆమెకు చందన గంధాలను అందుబాటులో వుంచుతున్నారు.

కన్నబిడ్డ ఎదిగినకొద్దీ ఆమెపట్ల మరింతగా బాధ్యతను పెంచుకునే అపురూపమైన తండ్రి బలరామ్‌గారు.

'స్వాతి'కి, స్వాతి బలరామ్‌గారికి శత సహస్ర వసంతాలపాటు మహోన్నతమయిన వైభవాన్ని కొనసాగించాలని ఆ షిర్డీ సాయిబాబాని వినమ్రపూర్వకంగా వేడుకుంటున్నాను.

మాగంటి కోటేశ్వరరావు చెన్నై
7.11.2008



'స్వాతి' ముత్యం

"వారం వారం కురిసే తొలకరి వాన...ఇంద్రియ స్పందనం నుండి అతీంద్రియ నియంత్రణం వరకూ జీవితంలోని చిత్ర విచిత్ర ప్రవృత్తుల ప్రకృతి విలాసాల ప్రకరణాలను ప్రాణచైతన్యంతో చిత్రించే వివిధ ప్రక్రియల రసోల్లాసాల రంగవిన్యాసం... తెలుగువారి స్వాంతాలకు రుచుల విందు"- ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు 'స్వాతి' సపరివార పత్రికను గురించి చేసిన ప్రస్తుతి ఇది. పామరుల నుంచి పండితులదాకా ఆబాల గోపాలాన్ని అలరిస్తున్న ఆ మహా పత్రిక రజతోత్సవ వత్సరంలోకి అడుగిడింది.

వీక్లీకంటే ముందరే పుట్టిన మంత్లీ 1995లోనే సిల్వర్‌జూబ్లీ జరుపుకొని, ఇప్పుడు 39వ సంవత్సరంలో ఉంది. నాలుగు దశాబ్దాలుగా మాస పత్రిక,రెండున్నర దశాబ్దాలుగా వారపత్రిక పాఠకదేవుళ్ళ ఉత్సాహ ప్రోత్సాహాలే ఊపిరిగా...ఆదరాభిమానాలే ఆశీస్సులుగా విరాజిల్లుతున్నాయి. ప్రతి తెలుగింటి మానసపుత్రికలుగా (అనగా ఆడపడుచులుగా) ఈ జంట పత్రికలు అలరారుతున్నాయి. అటు మాసపత్రికల్లోనూ,ఇటు వార పత్రికల్లోనూ అగ్రగామిగా నిలచిన 'స్వాతి' సక్సెస్ అనితరసాధ్యమైనది... తెలుగుపత్రికారంగ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం.

National Readership Studies Council (NRSC) అధ్యయనం ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెంటికీ చెందిన సుమారు 40 లక్షల మంది పాఠకులు 'స్వాతి' పఠిస్తున్నారు. ఒక ప్రాంతీయ భాషా పత్రిక జాతీయ స్థాయిలో 300 పత్రికల్లో మూడోస్థానంలో ఉండడం సామాన్యమైన విషయంకాదు.అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తారు అసామాన్యులు... అట్టివారిలో వేమూరి బలరామ్ గారొకరు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారన్న కవి వాక్కుకు మరో గొప్ప నిదర్శనం.

ఇవ్వాళ బలరామ్‌గారు ఒక వ్యక్తి కాదు... వ్యవస్థ. ఇంతటి అభివృద్ధి ఒక్క రాత్రిలో జరిగిపోయింది కాదు. అనాయాసంగా వచ్చింది అంతకంటే కాదు. ఒక ఆశావహ దృక్పథంతో,అంకితభావంతో, అకుంఠితమైన కృషితో శిఖరాగ్రాన్ని చేరుకోగలిగారు.

ఇక దేశాధినేతలతో విదేశీపర్యటనలు చేసే అవకాశం సాధారణంగా జాతీయ స్థాయి పత్రికాప్రతినిధులకే ఉంటుంది. కానీ అరుదైన, అపురూపమైన ఆ మహదావకాశాన్ని ఒక్కసారి కాదు, పలుమార్లు దక్కించుకున్నారు స్వాతి బలరామ్‌గారు.

కాగా బలరామ్‌గారు కురిపించిన 'స్వాతి చినుకులు' జీవితానుభవ సారాలు... ఆధునిక భగవద్గీతగా అభివర్ణించవచ్చు. పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలను, ఆత్మకథలను పత్రికాముఖంగా అందిస్తున్న బలరామ్‌గారు తన విజయగాధను కూడా ఆవిష్కరిస్తే 'ఫోర్త్ ఎస్టేట్' వారందరికీ స్ఫూర్తిదాయకం కాగలదు...

బులుసు వెంకట కామేశ్వరరావు మచిలీపట్నం

14.11.2008



స్వాతి సరస్వతీ నీకు నా నమస్కారం

స్వాతి సపరివార పత్రిక అంటే ఖచ్చితానికి కొలబద్ద.ఒక్క వారమైనా ఆలస్యంగా వచ్చిన దాఖలాలు లేవు.అటువంటి స్వాతి సపరివార పత్రిక ప్రారంభించి ఖచ్చితంగా ఇప్పటికి 25 సంవత్సరాలయ్యింది.

1984 ఆగస్టులో వినాయకచవితికి ప్రారంభమైంది. తొలి సంచిక విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సందడి చేసింది. అప్పటికే స్థిరపడిపోయిన మేగజైన్లు, దినపత్రికల పాపులారిటీతో నడుస్తున్న వారపత్రికలు వున్నాయి. అయినా వైవిధ్యంతో ఎన్నెన్నో శీర్షికలు, వినోద, విజ్ఞానపూర్వక అంశాలతో మండుటెండలో మజ్జిగ నీళ్ళలా పాఠకులను సేదదీరుస్తూ అడుగులు వేస్తున్నదల్లా పరుగులు నేర్చుకుంది అందరూ ఆశ్చర్యపడేలా.

స్వల్ప వ్యవధిలో స్వాతి సపరివార పత్రిక 1990లో లక్ష కాపీల సర్క్యులేషన్‌గల ఏకైక తెలుగు వారపత్రికగా రికార్డుకెక్కింది.

తమ పాఠకుల్ని పాఠకదేవుళ్ళని పిలుచుకొంటున్న స్వాతి యాజమాన్యం పాఠకదేవుళ్ళను పూజించి గౌరవించాలని భావించింది. నాడు లక్ష కాపీల ఏకైక తెలుగు పత్రికగా పట్టంగట్టిన పాఠక మహాశయులకు లక్ష రూపాయల బహుమతిని వేలాది ప్రజలు, పాఠకుల సమక్షంలో పారదర్శకంగా అందజేశారు.

స్వాతి సమాజానికి బాధ్యత వహిస్తున్న పత్రిక. పిల్లలు, చదువుకున్న తల్లులు, కుర్రకారు, నడిమి వయసు, ముదిమి వయసులవారికి ప్రయోజనకరమైన అంశాల్ని అందిస్తుంది స్వాతి.

స్వాతి సరస్వతీ నీకు నా నమస్కారం.

ఎమ్.నాగేంద్రప్రసాద్ *తిరుపతి*
21.11.2008



'స్వాతే' సాహితీ సంస్కృతీకర్త

కాశీ వెడుతూ, గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్‌లో 'స్వాతి'ని చూశాను. 'స్వాతి'కి ఇరవై అయిదు సంవత్సరాలు నిండీ, రజతోత్సవ ఒడిలో ఉందని తెలిసి మహదానందమొందాను.

పాణిగ్రహణ శుభ సందర్భంలో 'నీ హృదయమే నా హృదయం. నా హృదయమే నీ హృదయం, నా మనస్సే నీ మనస్సు' అంటారు. ఎందుకో మీపై నాకు అలాటి పితృ, భ్రాతృ వాత్సల్యం. వాత్సల్యమనేది ప్రేమకన్నా అధికమైనదని మీరెరుగనిది కాదు. ఏ జన్మబంధిత ఆ నవ రాగమో పెనవేసుకున్నది.

నీ మనస్సే నీకు దిక్సూచి
నీ ప్రజ్ఞే నీకు ప్రగతి
నీవే ప్రఖ్యాత వార, మాస పత్రికల నిర్మాతవు
నీ 'స్వాతే' సాహితీ సంస్కృతీకర్త
వర్ధిల్లుము వెయ్యేండ్లు
సకల సౌభాగ్యముల తోడ
విస్తరించుగాక నీ కీర్తి
విశాల విశ్వమంతటి తేజోమై
శ్రీరస్తు శుభమస్తు దీర్ఘాయురస్తు
'స్వాతి' బలరాముకు సకల శుభమస్తు

ఈ అమితానంద పవిత్ర గంగానదీ నలలందు ప్రతీ క్షణమూ పునీతుడవుతూ- కాశీ విశ్వనాథుని అనుగ్రహ వీక్షణములందు ఆనంద మందుతూన్న మధుర క్షణముల్లో పుట్టిన అక్షర సమాహారమును అమ్మాజీ సమేత బలరామ్ మెడలో వేయవలెననెడి సంకల్పితుణ్ణయ్యాను.

మీ వంశాంకురం చి॥సౌ॥ మణిచందనకు, వారి వంశదీపులు చిన్నారులు సత్యా, నిత్యా చౌదరులకు శుభాశీస్సులనందిస్తూ-

గోటేటి శ్రీరామారావు మకాము : వారణాశి
5.12.2008

స్వాతి-ఒక కత్తి

నాకు చాలాకాలంగా ఒక డౌటు. 'స్వాతి' ఇంతగా పాఠకుల మనసుల్ని దోచుకుని ఎలా రంజింపజేస్తున్నదా అని... ఆలోచించగా ఆలోచించగా (ఈ మధ్య మరీ 'స్వాతి' గురించి కొంచెం ఎక్కువగా ఆలోచిస్తున్నానులెండి) ఒకటి తోచింది. అంతే... "యురేకా" అని మనసులోనే ఆనందపడిపోయాను.

సహజంగా ఒక పాఠకుడికి (ఒక భక్తుడిని అనుకుందాం) ఎంతమంది దేవుళ్ళు వుంటారు?

ముక్కోటి దేవతలని కదా ఆర్యోక్తి!

అంటే- ముక్కోటి దేవతలూ ఆ భక్తుడిని నిరంతరం కాపాడుతూ, అతని ఆలనాపాలనా చూస్తూ వుంటారు.

మరి మన 'స్వాతి'కో ఎన్ని కోట్లమంది దేవుళ్ళు! (పాఠకదేవుళ్ళని మన మాన్యశ్రీ వేమూరి బలరామ్‌గారు 'స్వాతి'కి మనల్ని ఆదినుండి అప్పగించేశారు కదండీ!) ఈ దేవుళ్ళందరూ కలిసి 'స్వాతి'ని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు, ఆదరిస్తున్నారు, అలరిస్తున్నారు. తమని 'స్వాతి'లో చూసుకుని ఈ పాఠకదేవుళ్ళు మురిసిపోతున్నారు.

'స్వాతి' తమ బిడ్డే అని ఇన్ని కోట్లమంది దేవుళ్ళు గారాబంగా పెంచుతున్నారు. పాతికేళ్ళొచ్చినా ఇంకా 'స్వాతి'ని పొత్తిళ్ళలోని పసిపాప లాగా, వటపత్రసాయిలాగా అపురూపంగా, అభిమానంగా కిందపెడితే చీమలు ఎత్తుకెళతాయి, పైన పెడితే కాకులు (లోకులు పలుకాకులు కదండీ) ఎత్తుకెళతాయి అన్నట్లు ఈ పాఠకదేవుళ్ళు తమ గుండెల్లో దాచుకుంటున్నారు, అభిమానాన్ని దోసిళ్ళతో పంచుతున్నారు.

'స్వాతి' ఒక తేనెటీగ. పాఠకులు పువ్వులవంటివారు. ఈ పువ్వులలోని మకరందాన్ని (ఆత్మీయతని) తేనెటీగ సున్నితంగా, సుకుమారంగా (పువ్వు-ఆహ్లాదకరంగా తనని తాను అర్పించుకునేలా) గ్రోలుతున్నట్లు 'స్వాతి' ఒక ప్రేమతో తయారుచేసిన కత్తిలాగా (తెలుగు నిఘంటువులో చూశాను. 'స్వాతి' అంటే ఒక నక్షత్రం, సూర్యుడి భార్యల్లో ఒకర్తె, కత్తి అని వుంది) మన హృదయాల్లోని (పాఠకదేవుళ్ళ) అభిమానాన్ని మెత్తగా దోచుకుంటోంది. మరి 'స్వాతి'మీద మనం ఎంత అభిమానం చూపించినా తరగదేం? ఎన్ని యుగాలైనా ఈ అభిమాన వాహిని ఆగదు. అలా నిరంతరం సాగుతూనే వుంటుంది.

కోలపల్లి ఈశ్వర్ నెల్లూరు
12.12.2008



స్వాతీ శతాయుష్మాన్‌భవ!

ఐదున్నర అడుగుల ఎత్తులో, ఎత్తుకు తగిన నిండైన శరీరంతో, గుండ్రని భుజాలు, దోరముగ్గిన జాంపళ్ళు తనలో మలుచుకుని, నడు మెక్కడుందే నెరజాణా అన్నట్లు, నున్నని ముడుతతో అలంకరించబడిన నడుముతో, ముందు వెనుకలు మదనుని మదోన్మత్తుని చేసే కదలికతో, వెన్నెల వెలుగుల సోయగాలను తన చారెడేసి కళ్ళల్లో నింపుకుని,చూపుల తూపులతో వృద్ధులను సైతం తల వెనక్కు తిప్పించే, బాపు కుంచెలోంచి జాలువారిన వయ్యారి 'స్వాతి' సపరివారపత్రిక.

వడ్డాది పాపయ్యగారి కుంచెనుండి జాలువారిన సౌందర్యరాశి కుంతీదేవి ముఖచిత్రంతో 'స్వాతి' చేతిలో పడగానే, ఆ స్పర్శతో పుల కరించే ప్రతి తెలుగుపాఠకుని మదిలో మెదిలే ఊహలు కావు ఇవి-

తొలి పేజీలో 'పాఠక దేవుళ్ళకు నమస్కారం' అని ప్రారంభించింది 'స్వాతి' మాత్రమే.


'స్వాతి' సపరివారపత్రిక మొదటి పేజీనుండి చివరి పేజీవరకూ చదివేక 'కోటిపల్లి రేవులో, సంధ్యాసమయంలో వింతకాంతులీనే వినీ లాకాశాన్ని చూస్తూ, పరవళ్ళు తొక్కే జీవనది గోదావరి తల్లిని పరవశంతో చూస్తున్న మధురానుభూతి.

నిన్ను సృష్టించినవారిని ఏమని ప్రశంసించను?

'స్వాతి'లోని ప్రతి అక్షరంలో ఇమిడివున్న 'బలరాము'నికి శతకోటి నమస్సుమాంజలులు...

'స్వాతీ'- పాఠకుల మానసపుత్రికా శతాయుష్మాన్‌భవ!

కె.బి.కృష్ణ కాకినాడ
19.12.2008



సాహసవంతుడు 'స్వాతి'మార్కుడు

సాహసికానివాడు అదృష్టాన్ని అందుకోలేడు. సాహసించి ప్రయాణం చేస్తే అదృష్టం పొంది తీరతాడు అని ఆత్రేయగారు ఆత్మీయంగా పదేపదే నాతో అనేవారు.

'స్వాతి'మాసపత్రిక నలుగురితో మొదలుపెట్టినా కారణాంతరాలవల్ల హైదరాబాద్ రాంకోటిలో ఒక్కరుగా సాహసంతో నిలబడి ముందడుగు వేసి తన జీవిత డిక్షనరీలో వెనకడుగుకు స్థానంలేదని ఋజువు చేసిన సాహసి బలరామ్‌గారు.

అదృష్టం కలసివచ్చి ఐశ్వర్యం వారితో నడచి వచ్చింది. హైదరాబాద్ నుండి విజయవాడ వచ్చి సుస్థిరంగా నిలబడేలా చేసింది.

'స్వాతి' అనే రెండక్షరాలలో కోటి దేవతల వెలుగుంది. మా బలరామ్‌గారు 'స్వాతి' నక్షత్రంలోనే పుట్టారు. అందుకనే 'స్వాతి' అని పేరు పెట్టి వుంటారు. ఆ నక్షత్రంలోనే శ్రీ ఎన్.టి.ఆర్. పుట్టి జగజ్జేమానంగా వెలుగొందారు. చిన్న ఫ్లాష్‌బేక్‌లోకి వెళితే-

'స్వాతి'మాసపత్రికలో పొట్టిలో పొట్టి నవలలకు అంకురార్పణ చేసిన ధీశాలి, సాహసి మా బలరామ్‌గారే.

అలాంటి పొట్టి నవల మా కోసమే పుట్టింది. అది కూడా 1976. దాని పేరు మమతల కోవెల, రచయిత్రి సి. ఆనందారామం. పాండీ బజార్లో 'స్వాతి' కొన్న వెంటనే ఆఫీసుకు వచ్చి నవల్లో కూరుకుపోయాను తలెత్తకుండా. అన్నం తినకుండా చదివేశాను.

క్రాంతిగారి రూముకు వెళ్ళి మనకు కరెక్టు సబ్జెక్టు దొరికిందని ఆయన చేతిలో పెట్టాను. క్రాంతిగారు ఊపిరి పీల్చుకోకుండా, భోజనం చెయ్యకుండా చదివేసి సంతోషంతో 'హుర్రే'అని నెమ్మదిగా అరిచారు.

వెంటనే రాఘవేంద్రరావుగారికి ఫోన్‌చేసి ఆఫీసుకు పిలిపించి 'స్వాతి' ఆయన చేతిలో పెట్టారు. ఆయన ఊపిరి విడవకుండా, కాఫీ తాగకుండా చదివేసి రెట్టింపు ఉత్సాహంతో, ఇంకాస్త గట్టిగా 'హుర్రే' అని అరిచారు (మేము,ఆయన కూడా దీనికిముందు ఫ్లాపుల పర్వంలోనే వున్నాము).

ఆ ఆనందంలో మమతల కోవెలను 'జ్యోతి'గా వెలిగించి, ఆంధ్ర ప్రేక్షక దేవతలకు హారతిగా ఇచ్చారు. వారు కళ్ళారా అద్దుకుని, మనసారా దీవించి 'జ్యోతి'రథం పట్టారు. అదృష్టవంతుడు పేకాట ఆడితే తురుపులు అన్నీ అతనివే. ఇది కూడా ఆత్రేయగారి జీవిత సత్యమే.

1984 ఆగష్టు నెలలో బాపుగారి (వినాయక) ముఖచిత్రంతో నాటిన 'స్వాతి'మొక్క (వారపత్రిక) బలరామ్‌గారి అకుంఠిత దీక్షతో క్షణక్షణాభివృద్ధిచెంది, నేడు మహావృక్షమైంది. ఆయన కీర్తిని మహోన్నతశిఖరాలమీద కూర్చోబెట్టింది. 25 ఏళ్ళ వెండిపండుగ జరుపుకొనేలా చేసింది. ఇదేవిధంగా బంగారుపండుగ జరుపుకొనేలా చెయ్యాలని మా బలరామ్‌గారిని అభినందిస్తూ... చిరంజీవి మణిచందనను మనస్ఫూర్తిగా దీవిస్తూ...

కె.రాంసూరి హైదరాబాద్, 26.12.2008

P.S : గురువారానికి బదులు 'స్వాతి'వారం అని వేసుకునే ధైర్యశాలి,



అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి

పాఠకదేవుళ్ళకి అవసరమైన ఆహారాన్ని అందిస్తున్నారు స్వాతి ద్వారా. శారీరక, మానసిక ఆనందానికి, ఆరోగ్యానికి అవసరమైనవన్నీ అందిస్తూ అందరి మన్ననలను పొందారు శ్రీ బలరామ్‌గారు.

ఒక మంచి సంకల్పం కలిగిన వెంటనే దానిని అందరికి అందించుటకు శక్తి, యుక్తి అవసరం. అవి రెండూ ఎడిటర్‌గారికి నిండుగ, దండిగ, మెండుగ వున్నవి. ఆ పనిలో నిమగ్నమయిపోతారు. తన్ను తాను మరచి పోతారు. అదే మా బలరామ్‌గారి ప్రత్యేకత.

నేడు పత్రికారంగమున వున్న పోటీని తట్టుకుని ఏ పత్రికకు అంద నంత ఎత్తుకు ఎగబ్రాకి ప్రజల తరఫున, ప్రభుత్వం తరఫున ప్రశంసలు పొంది కేంద్రప్రభుత్వ పాలకుల ఆహ్వానమునందుకుని విదేశాలతో సహా వారివెంట వెళ్ళివచ్చు అవకాశాన్ని పొందిన స్వాతి 25వ సంవత్సరములో ప్రవేశించు శుభ సందర్భముగా ఎందరో అభినందించారు. శుభాకాంక్షలు అందించారు. అందులో నేనూ వున్నాను.

'స్వాతి' స్వర్ణోత్సవము, షష్టిపూర్తి మహోత్సవము ఘనంగ, బలంగ జరుపుకొని నభూతో నభవిష్యతి అను రీతిగా స్వాతి ముందుకు మున్ముం దుకు పోవుట తథ్యము.

స్వాతికి లేదు సాటి
మరేదీ లేదు పోటీ
అందరి నోట ఇదే మాట
అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి.

అందుకు సర్వశక్తులు మా బలరామ్‌గారికి భగవంతుడు అను గ్రహించుగాక.


వారి సంకల్పాన్ని సాఫల్యం చేయుటకు కంకణం కట్టుకొనిన సహ సంపాదకులగు మణిచందనగారికి అభినందనలు. అంతర్యామిగ అనిల్ వుండి అన్నీ సమకూర్చుతున్నాడు.

వారం వారం-ఆహారం
స్వాతి పాఠకులకు ఆధారం
స్వాతితో-సాంగత్యం
సర్వులకు-అగత్యం
స్వాతి వుంటే... సర్వం ఉన్నట్లే
స్వాతికి-స్వాగతం
అంటున్నారు పాఠకదేవుళ్ళు.

స్వాతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక పాఠకులకు అభిమాన పుత్రిక.

జయ్ శ్రీరామ-వాసుదేవ
శుభం భూయాత్

కె.ఈశ్వర్ శ్రీకాళహస్తి
2.1.2009



పాతికేళ్ళ ప్రాభవం

పాఠకులనే దేవుళ్ళని చేసి పాతికేళ్ళుగా నడుస్తున్న స్వాతి మరో వందేళ్ళు నడిచినా తడబడదు. ఇన్నేళ్ళుగా స్వాతిని చదివి చదివి పాఠకుల్లో కొందరం రచయితలమయ్యాం. ఆ క్రెడిట్ స్వాతిదే.

రచయితకన్నా రచయితను నిలబెట్టేందుకు కృషిచేసే సంపాదకుడు, ప్రచురణకర్త అసలు ముఖ్యులు. అటువంటి కృషీవలుడు వేమూరి బలరామ్‌గారు. ఒక్క చేతిమీదుగా సంస్థను నడపడం ఉన్నత శిఖరాలకు చేర్చడం, ప్రజాదరణ, ఆశీస్సులు పొందడం వీటన్నిటినీ తెలుగు గడ్డమీద సాధించి చూపించిన మొదటి వ్యక్తి బలరామ్‌గారేనేమో.

కథ ఒకటేనా? ఎన్నెన్ని శీర్షికలు! ఎంత నీటైన పత్రిక! అందానికి అందం, అచ్చుతప్పులు దొరకని శుభ్రతకు శుభ్రత! పత్రిక అంటే ఇలా ఉండాలనిపిస్తుంది. పండగొచ్చిందంటే పండగ ప్రాముఖ్యం, ప్రాశస్త్యం తెలియచెప్పేది స్వాతి. ఆధ్యాత్మిక సందేహాలు తీర్చేది స్వాతి.

రాయడంకన్నా చదవడం ఎక్కువ ఇష్టమైన నాలాంటి పాఠక రచయితలకు వంశీగారి "మా పసలపూడి కథలు"నందించి గొప్ప ఉపకారం చేశారు. నేనా కథలు భద్రంగా ఫైల్ చేసుకున్నాను. ఆ కాయితాలు పోగుచేసి దాచుకోడమెందుకు ఆ కథలన్నీ ఎలాగూ పుస్తక రూపంలో వస్తాయిగా? అంటే నాదొకటే సమాధానం.

ప్రతి కథకూ కథలోని అంతరాత్మ దర్శనం చేయిస్తూ బాపూ వేసిన బొమ్మలన్నీ ఆ పుస్తకంలో వస్తాయో రావోనని భయం. అలాగే ఇప్పుడు "కోతికొమ్మచ్చి" ఫైలు తయారవుతోంది. ఇంకా ఎన్నెన్ని ఫైళ్ళు తయారు చేసుకోవాలో!

బలరామ్‌గారు, ఆయన అభిమాన పుత్రిక "స్వాతి" తెలుగు భాష, సంస్కృతి ఉన్నంతవరకు ఉండాలని భగవంతుని మనసారా వేడుకుంటున్నాను.

పోడూరి కృష్ణకుమారి హైదరాబాద్
16.1.2009

గురువు ఆశీస్సులా గురువారం ఇంటికి

క్లిష్ట పరిస్థితుల్లో ఒక తెలుగు పత్రిక 25 సంవత్సరాలు అజేయంగా తెలుగు పాఠకుల మనస్సులు దోచుకోవడం అద్భుతం. ఆబాలగోపాలాన్ని అన్నివేళలా అలరిస్తూ అత్యధిక పాఠకుల్ని ఆకట్టుకున్న అట్టహాసం గల రంగుల పత్రిక స్వాతి పత్రిక-బలరామ్‌గారి మానస పుత్రిక!

సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా-పాఠకుల నాడి పట్టుకుని అలరిస్తూ-అన్ని రంగాలవారిని, అన్ని వయసులవారిని, పనుల ఒత్తిడితో తలమునకలయ్యేవారిని కూడా విశేషంగా ఆకర్షిస్తున్నది. సేద తీరుస్తున్నది.

వయసుతో పాటు ఎదుగుతూ-పెరుగుతున్న టెక్నాలజీని తన సొంతం చేసుకుంటూ పంచరంగులలో ఠంచనుగా వారం వారం పాఠకులను పలకరిస్తుంది. గురువు ఆశీస్సులా గురువారం ఇంటి ఇంటికి చేరుతుంది.

కామిని, మోక్షగామిని, మూర్ఖుడిని, పండితుడిని సైతం ఆహ్లాదపరుస్తున్నది స్వాతి సపరివార పత్రిక ఏకత్రాటిపైన!

అట్ట ప్రింటింగు-అట్టమీది బొమ్మల సెలెక్షన్ పత్రికకే హైలైట్ అయితే, లోపల కథలు-సీరియళ్ళు- వ్యాసాలు- కార్టూనులు- జోకులు- బొమ్మలు కన్నులపండుగ చేస్తాయి. అన్నట్టు స్వాతి ఎవరి శ్రమను దోచుకోదు-స్వాతిని నమ్ముకున్న కలం కార్మికులకు మురిపెంగా పారితోషికాలు ఏ పత్రికా ఇవ్వనంత ఎక్కువగా మక్కువతో ఇస్తుంది.

అన్ని రంగాలలో ఆంధ్రులు అగ్రస్థానంలో వున్నట్లు స్వాతి కూడ భారతదేశంలో అగ్రగామిగా ఉంది. దేశవిదేశాల్లో ఆంధ్రుల ప్రతిభను చాటుతున్నది.

తెలుగు సంస్కృతికి-తెలుగువారి ఆకాంక్షలకు దర్పణం పడుతున్నది స్వాతి పత్రిక. ఇంతటి ప్రతిభతో స్వాతి పత్రికను నడుపుతున్న శ్రీ స్వాతి బలరామ్‌గారు ఒక ఆంధ్ర రత్న!

కె.వి.ప్రసాదు (వియోగి) ఆదోని
23.1.2009



స్వాతి చిరంజీవి

ఓసారి ‘స్వాతి’ నుండి లేఖ.

మామూలుగా రచన ఎన్నికయితే గ్రీన్ కార్డ్.

స్టాంపులంటించిన కవర్ లేకపోతే రెడ్ కార్డ్. స్వాతి నుండి అందుకోవడం ఎందరో రచయితల, రచయిత్రుల అనుభవమే.

అలాంటిదేం లేదు. ఆ కవర్ ఓపెన్ చేస్తే అందులో ఓ పాఠకుడు రాసిన లేఖ. చాలా ఆశ్చర్యం కలిగింది. అదో కార్డ్.

శ్రీ బలరామ్‌గారు రచయితలపట్ల ఎంత శ్రద్ధగా వుంటారో తెలిపే ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో.

నాకు తెలిసి సర్క్యులేషన్‌తోపాటు పారితోషికం పెంచే పత్రిక స్వాతి ఒక్కటే. ఈ సంప్రదాయం స్వాతి పుట్టినప్పటి నుంచి వుంది.

నీ రచయితలపట్ల నువ్వు ఎలా వుంటున్నావు. నీ పాఠకులని ఎలా అంచనా వేస్తున్నావు అనేదాన్నిబట్టి ఓ పత్రిక హృదయం అర్థం అవుతుంది.

విజయాలు వూరికే రావు. అవి కలకాలం నిలబడవు.

ఎంత ఎదిగినా ఒదిగి వుండే వినయం, చెమ్మగిల్లే నయనాలు, పాతని, కొత్తనీ ఆస్వాదించే పసితనం వుండటంవల్లే ‘స్వాతి’ తెలుగు వారి లోగిళ్లకి చేరుతోంది.

శ్రీ బలరామ్‌గారికి పాఠకుల నాడి తెలుసు.

అంతకుమించి ఆయన సుదీర్ఘ అనుభవం మంచి రచనల్ని తొలి చూపులోనే గుర్తించగల నేర్పుని ఇచ్చింది.

స్వాతి జీవన యానంలో పాతిక వసంతాలు చాలా త్వరత్వరగా గడిచిపోయాయి. ఇదో నిరంతర ప్రయాణం.

ఎందరెందరో రచయితలు ‘స్వాతి’ ద్వారా నిరంతరం వెలుగు చూస్తూనే వుంటారు.

స్వాతి చిరంజీవి. స్వాతి బలరామ్ పాఠకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

పి.చంద్రశేఖర అజాద్ హైదరాబాద్
30.1.2009

తెలుగు పత్రికారంగానికే తలమానికం

‘స్వాతి’ మాసపత్రిక ప్రచురితమై పాఠకుల మనస్సు దోచినప్పుడు ఈ మాసపత్రికను వారపత్రికగా మారిస్తే ఎంత బాగుండుననిపించింది. కొంతకాలానికి అది మాసపత్రిక నుంచి వార పత్రికగా మారలేదు కాని, మాసపత్రికతోపాటు వారపత్రిక కూడా పాఠకులకు అందించారు. ‘స్వాతి’ సపరివారపత్రికను పాతికేళ్ళుగా,‘స్వాతి’ సచిత్ర మాసపత్రికను నాలుగు దశాబ్దాలుగా ఒంటిచేత్తో నడుపుతూ, అద్భుత విజయాలను సాధించి, పాఠకుల హృదయాల్లో ‘స్వాతి’ని చిరస్థాయిగా నిలిపారు.

‘స్వాతి’ బలరామ్‌గారికి పాఠకులే దేవుళ్ళు! వాళ్ళని, వాళ్ళ అభిరుచిని ఆయన ఆరాధిస్తారు. ఆయన బలమంతా పాఠకులు.

తెలుగు పత్రికారంగంలో నూతన ఒరవడితో సర్క్యులేషన్ పరంగా కూడా చరిత్ర సృష్టించిన ‘స్వాతి’ సపరివారపత్రిక సంపాదక సారథిగా విశిష్ట స్థానం స్థిరపరచుకుని ‘తెలుగు మేగజైన్ మొఘల్’గా కీర్తి గడించిన ఏకైక తెలుగు పత్రికా తేజం అయ్యారు వేమూరి బలరామ్‌గారు.

‘స్వాతి’ పుట్టినప్పటినుండి నేను పాఠకుణ్ణే. ‘సీరియల్స్, కథలు, స్పెషల్ ఫీచర్స్, వివిధ శీర్షికలు, కార్టూన్లు’ ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొని ఆదరింపజేస్తున్నాయి.

పిల్లలకు, యువతకు, పెద్దవారికి, ఎవరికి కావలసినవి వారివారికి అందిస్తున్నది ‘స్వాతి’, ‘స్వాతి’, ‘స్వాతి’.

బలరామ్‌గారితో మాట్లాడుతుంటే ప్రముఖ చిత్రకారుడు, కవి, రచయిత, విశ్లేషకులు అయిన సంజీవదేవ్‌గారితో మాట్లాడుతున్నట్లు వుంటుంది.

‘స్వాతి’ రజతోత్సవం జరుపుకోవడం ఎనలేని కీర్తి కిరీటాన్ని అందుకుంది. నేడు టీ.వీ సీరియల్స్, సినిమాల వలన పుస్తకాలు చదవడం తగ్గినా ‘స్వాతి’కి పాఠకాభిమానులు ఎక్కువవుతున్నారేగాని తగ్గడంలేదు. బతికుంటే 50 సంవత్సరాల(స్వర్ణోత్సవం) ‘స్వాతి’ని చూడాలని వుంది.

‘స్వాతి’ తెలుగు పత్రికారంగానికే ఒక తలమానికంగా ఆచంద్రార్కం వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తూ...

సూర్యదేవర గిరిజాప్రసాద్ తిరుపతి
6.2.2009

నీరెండలో తేనెలవానలా...

తెలుగువారి గుండె చప్పుళ్ళ అక్షరాకృతి ‘స్వాతి’
తేటతేట తెలుగులా తెల్లవారి వెలుగులా
నీరెండలో తేనెలవానలా తెలుగువారి
స్వాతి వార-మాస పత్రికలు
తెలుగు పాఠకలోకానికి అసమాన పుత్రికలు.

“నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెట్లో ఆడుకునే
ఆడపిల్లలు” అంటాడు అభ్యుదయ కవి తిలక్.

ఇందులో అక్షర అక్షరం మీ సంపాదక చలనత్వానికి, మీ నిండైన
మూర్తిమత్వానికి సజీవతను సంతరించుకున్న సాక్షి సంతకం.

వారపత్రికలకే రారాజుగా భాసిస్తూ లక్షలాది పాఠకుల
గాజుకెరటాల హృదయ కేదారాలలో సుస్థిరమై వసిస్తూ
వెన్నెల సముద్రాల జాజిపూల అత్తరు-మణిదీపాలు
మీ సృజన చందన శీలాసుందర సుకుమార చిత్ర విచిత్రాలు.

“రాగమయమైన ప్రకృతి సామ్రాజ్యమునందు
ప్రతి పదంబున రసవైభవమ్ము నిలుచు
రసమయంబైన సంపాదకమన్యుని రాజ్యమునందు
ప్రతిపదంబున రాగసంపదలు నిలుచో”
అన్న కవి వాక్యానికి నికషోఫలాలు మీరందిస్తున్న స్వాతి ముత్యాలు.

స్వాతి పత్రికా కార్యాలయం ఒక చదువుల తల్లి దేవాలయంగా
సంభావిస్తూ నిత్యం చేస్తారు మీరు శ్రద్ధగా సరస్వతి సమర్చనం.
అందుకే పాఠకుల నాలుకపై అయింది ‘స్వాతి’ బీజాక్షరం.

“సర్వత్ర సంపదస్తస్య సంతుష్టం యస్యమానసమ్”
మనఃసంతుష్టి ఉన్నవానికి ప్రతిచోటా సంపదలేకదా!

వి.అనంతనారాయణ చెన్నై
13.2.2009



సింగారములో మేటి

ది లార్జెస్ట్ సర్క్యులేటెడ్ తెలుగు వీక్లీ మన స్వాతి
ఎనలేని ప్రసారానికి సంతరించుకొన్నది ఖ్యాతి
బింకమున సాటిలేదనుటలో లేదు తనకు భీతి
సింగారములో మేటి పత్రికగ వఱలుట ప్రతీతి
అసమాన రచయితల నాదరించుటన్న సంప్రీతి
భిన్నరుచులను ప్రోదిచేసి రూపొందుట దాని భాతి
నందముతో సపరివారాన్ని ఉఱ్ఱూతలూగించు రీతి
దరహాసము లొలికింప కవ్వించును రసానుభూతి
నమ్రతతో జనబాహుళ్యాన్ని మెప్పించి పొందు సమ్మతి
పత్రికారాజమని నెగడి చాటింది దాని ప్రగతి
హీనరచనల నిరసించి గడియించెను ప్రఖ్యాతి
తన్నిజముద్రణాలయంలో వెలయును యీ నిజాయితి
మన పాఠకలోకాన ప్రశంసలంది కూర్చెను భూతి
నవ్య నవ్య పోటీలలో పంచిపెట్టుగదా బహుమతి
స్వానుభవముననుతించి పంపె మూర్తి చంద్రమహంతి
తిరముగ నిల్చును యీ కీర్తి ఏకైక పత్రిక స్వాతి

చంద్రమహంతి నారాయణమూర్తి ఖుర్దారోడ్
20.2.2009



విరిసిన పారిజాతం స్వాతి

'స్వాతి' మాసపత్రిక 40వ వసంతంలోకి, 'స్వాతి' వారపత్రిక 25వ ఏట అడుగుపెట్టడం ఎంతో సంతోషంగా వుంది.


కాలగమనంతో పాటు పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పత్రికలను తీర్చిదిద్దుతూ ప్రజాభిమానాన్ని, ఆదరణను అమితంగా సంపాదించుకున్నారు శ్రీ వేమూరి బలరామ్‌గారు. అంతేకాదు, పత్రికలకు ప్రతిష్ఠనూ, స్థాయినీ, హుందాని తీసుకువచ్చారు.

సామాజిక పరిస్థితులకు అనువుగా రచనలు చేస్తూ స్వాతి స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తున్న రచయితల విలువల్ని గుర్తించి వారి పారితోషికాలను- ఇంతకుముందు, ఏ పత్రికా ఇవ్వనంత ప్రతిఫలాలను అందజేస్తోంది స్వాతి.

టీ.వీలు వచ్చాక పాఠకులకు చదివే ఆసక్తి సన్నగిల్లిందని అంటున్నారు చాలామంది. అది వాస్తవం కాదనటానికి 'స్వాతి' సర్క్యులేషనే సాక్ష్యం. స్వాతికోసం ఎదురుచూసే పాఠకుల సంఖ్య లక్షల్లో వుంది. అంతటి ప్రజాభిమానం, ఆదరణ పొందటానికి కారణం బలరామ్‌గారి సంపాదకత్వం. బలరామ్‌గారి హృదయం, బలం, ప్రాణం 'స్వాతి'. 'స్వాతి'నీ బలరామ్‌గారినీ విడదీసి చూడలేం.

తెలుగు పాఠకుల హృదయాలలో వెలుగు రేఖ 'స్వాతి'. సాహితీ సుమవనంలో విరిసిన పారిజాతం స్వాతి. చిరాయుష్మాన్ భవ!

మోహన్‌కుమార్ సికింద్రాబాద్
27.2.2009



అంతటా స్వాతే

ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా కథలు రాస్తున్నాను. ఎన్నో కథలు 'స్వాతి'లో ప్రచురింపబడినై. కొన్ని తిరిగివచ్చినై. అయితేనేం? ఇంత సుదీర్ఘ ప్రయాణంలో ఒక్క కథా మిస్‌కాలేదు. అదీ 'స్వాతి' ఘనత. అదీ 'స్వాతి' ప్రత్యేకత. అదీ సాహిత్యానికి మన 'స్వాతి' ఇచ్చే ప్రాధాన్యత.

చాలా పేరు గడించిన వారపత్రికలవారే కథలకు డబ్బు ఎగ్గొట్టిన కథలు వున్నయ్ (నిజాలు). ప్రచురణకు ముందే పారితోషికం అందించే సాంప్రదాయం పాటిస్తున్న 'స్వాతి'కి సాటీ, పోటీ లేవనడం అక్షరసత్యం.

అందుకే 'స్వాతి' స్వర్ణోత్సవ శుభసమయాన నా మనసులో మెదులుతున్న భావాల్ని ఇలా...

బలరామ్‌గారికి అన్నీ బలాలే
అవన్నీ బహుముఖాలే
'స్వాతి' అచ్చంగా, స్వచ్ఛంగా ఆయన సంకల్పబలం
అశేష పాఠకులు ఆయన యశోబలం
అందుకే అందరం కోరుకుందాం
కలకాలం ఆయనకు తోడుగా వుండాలని దైవబలం

సరసానికి 'స్వాతి', సంసారానికి (సుఖ) 'స్వాతి', ఉల్లాసానికి 'స్వాతి', ఉత్తేజానికి 'స్వాతి', విజ్ఞానానికి 'స్వాతి', సందేహాలకు 'స్వాతి', నిద్ర పట్టేందుకు 'స్వాతి', నిద్రపట్టకపోతే 'స్వాతి', బస్సుల్లో 'స్వాతి', రైళ్ళల్లో 'స్వాతి', షాపుల్లో షోగ్గా కన్పించేదీ 'స్వాతే'.

ఇందు గలదు అందు లేదన్నట్లు అంతటా 'స్వాతే'. అందుకే అది సపరివారపత్రిక, తెలుగువారి వరపుత్రిక ఈ వారపత్రిక.

పెనుమాక నాగేశ్వరరావు *గుంటూరు*
6.3.2009



షడ్రుచుల విందుభోజనం 'స్వాతి'

పాఠకదేవుళ్ళ వార
పత్రిక మన స్వాతి!!

ఆరంభంలోన తాను
చిన్నిచినుకు స్వాతి
ఏడు సముద్రాలు దాటె
ఖండాంతర ఖ్యాతి!!

షడ్రుచులను కలగలిపిన
విందుభోజనం స్వాతి...
సప్తవర్ణ చిత్రాలతో
కనువిందుజేయు స్వాతి...

శృంగారం-అంగారం
కలనేతల స్వాతి
వపా...బాపు
గీతలతో బంగారం స్వాతి

'మ్యాగజైను మొఘలి'
పువ్వు పరిమళాల స్వాతి
మణిచందనచర్చలతో
వెలుగు-తెలుగుజాతి

తనికెళ్ళ భరణి హైదరాబాద్
13.3.2009

సుస్థిరం, సుమధురం, పదిలం

తెలుగు సాహితీమాత ముంగిట ముత్యాలముగ్గు, అభిరుచి గల పాఠకుల అందాల హరివిల్లు 'స్వాతి'.

తెలుగు పత్రికారంగానికి విధాత, మార్గదర్శి స్వాతి. స్వాతి-సూర్యుడిలా స్వయంప్రకాశి. అందుకే 'స్వాతి'కి, 'స్వాతి' పాఠక దేవుళ్ళ ఆదరాభిమానాలకీ ఎల్లల్లేవని నిరూపించింది. ఎడిటర్‌గా నిత్యకృషితో పాఠకదేవుళ్లను ప్రసన్నం చేసుకోవటంలో సుసంపన్నులైన శ్రీ వేమూరి బలరామ్ గారి దీక్షాదక్షతలకు నిలువుటద్దాలుగా నిలిచిన స్వాతి సచిత్ర మాసపత్రిక సాహితీప్రియులకు కరదీపికైతే, స్వాతి సపరివారపత్రిక వాడవాడలా అభిమాన పాఠకుల తలలో నాలుక కాగలిగింది.

'స్వాతి'-శ్రీ బలరామ్-పాఠకులు ఈ ముగ్గురిదీ విడదీయలేని బంధం. తెలుగు నేలకి సంబంధించి ఎనలేని, కొనలేని సంబంధమిది.

శ్రీ వేమూరి బలరామ్‌గారు ప్రధానులతో ఎన్నో దేశాలు పర్యటించి-అక్కడి ప్రకృతిని తెలుగునాట- మన ముంగిటపరచి సగటుమనిషికి అంతగా ఆసక్తి వుండని విదేశీ, స్వదేశీ ఆర్థిక విధానాలను అలవోకగా, వినూత్నంగా, విస్పష్టంగా విపులీకరించి, తెలుగువాడి మూడో కన్ను (జ్ఞాననేత్రం-అగ్నికణం కాదు!) తెరిపించారు.

అయితే ఎనలేని ఔన్నత్యాన్ని 'స్వాతి'కి సముపార్జించి పెట్టిన శ్రీ వేమూరి బలరామ్‌గారికి


అభినందనన్నది-అల్పం.
అభిషేకమన్నది-స్వల్పం.
అక్షరాలతో తప్ప మరో రకంగా కీర్తించలేని
ఈ పేద రచయిత ఆనందాతిరేకం- అనల్పం!

తెలుగు గడ్డమీద ప్రభవించి, ప్రభంజనమైన 'స్వాతి' ఏ దేశమేగినా ఎందుకాలిడినా

తల్లి భూమిభారతిని పొగిడి పొగడపూదండతో పూజించే సాహితీ కళామతల్లి.

తెలుగునాట 'స్వాతి' స్థానం సుస్థిరం, సుమధురం, పదిలం.

డి.ప్రభాకర్ గుంటూరు
20.3.2009



ప్రజల అభ్యున్నతే 'స్వాతి' లక్ష్యం

భారతదేశమున ఆంధ్రప్రదేశ్‌నందే కాక అనేక ఇతర రాష్ట్రాలలో గల ఆంధ్రులకు కూడా 'స్వాతి' సపరివారపత్రిక సుపరిచితమే. 'స్వాతి' ద్వారా శ్రీ వేమూరి బలరామ్‌గారు మనుషుల అభ్యుదయానికి కావల సిన పెక్కు విషయాలను ప్రజలకు అందచేసి, జనుల శ్రేయోభివృద్ధికి ఎంతయో తోడ్పడుచున్నారు.

లక్షలాది ప్రజలు 'స్వాతి' పత్రికను ఆసక్తితో పఠించుచున్నారు. 'స్వాతి' సపరివారపత్రికలో కొన్ని ఆధ్యాత్మిక విషయాలను కూడా జోడించి పరమార్థ రంగమున సాధన చేయుచున్న ముముక్షువులకు కూడా ఎంతయో హితమును కలుగజేయుచున్నారు.

'స్వాతి' సపరివారపత్రిక ఆరంభంలోనే 'స్వాతి చినుకులు' అను శీర్షికతో కొన్ని చక్కని బోధలు ఇచ్చేవారు. శ్రీ వేమూరి బలరామ్‌గారు తన బహుకాల అనుభవాన్ని పురస్కరించుకొని వీటిద్వారా ప్రజలకు చక్కని హితోపదేశము చేశారు. ఇవి పాఠకులకు ఆహ్లాదంతోపాటు వారి మనస్సులను ముత్యములవలె స్వచ్ఛముగ, సత్త్వగుణమయంగ ఒన ర్చాయి. ఈ విధముగా 'స్వాతి' ప్రజలయొక్క అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతోంది.

భగవదనుగ్రహముచే 'స్వాతి' పత్రిక ఇంకను ఎక్కువ ప్రచారమును బడసి ప్రజలకు మేలు కలుగజేయుగాక!

శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు *శ్రీకాళహస్తి*
27.3.2009

పాఠకుల నాడి పట్టిన 'స్వాతి'

స్వాతి రజతోత్సవాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంటున్నందుకు ఎంతో సంతోషంగా వుంది.

ప్రపంచమంతటా గల తెలుగు ఇళ్ళలోని ప్రతి పాఠకుడి అవసరా లను తీరుస్తూ ప్రాచుర్యం గడిస్తున్న పత్రిక స్వాతి.

పాఠకుల్లో ప్రతి విభాగానికి సంబంధించిన విశ్లేషణలు ఖచ్చితమైన అక్షరసత్యాలు.

స్వాతి అంటే బలరామ్. బలరామ్ అంటే స్వాతి. తెలుగు వారింట 'స్వాతి' పేరును మమేకం చేసిన ఘనత ఆయనది. పాఠకుల ఆసక్తిని దృష్టిలో వుంచుకుని మార్పులకు అనుగుణంగా సాగడం స్వాతి ఎదుగు దలకు వెన్నెముక.

స్వాతి పయనం తారాపథంలో సాగుతోంది. బాలాజీ ఆశీస్సులతో తప్పకుండా స్వాతి 'స్టార్' కాగలదు. స్వాతి బలరామ్‌గారి అదృష్టం. అన్ని వేళలా ఆయన పెదవులపై చెరగని చిరునవ్వులకు కారణమవుతుంది ఆయన సృష్టించిన ఈ పత్రిక.

రాష్ట్రపతి, ప్రధానమంత్రులతో బలరామ్‌గారు చేసిన విదేశీ పర్య టనలు ఉన్నత శిఖరాలు అందుకోవడానికి చక్కని స్ఫూర్తి. స్ఫూర్తిమంత మైన సవాలే ఉత్తమోత్తమమైనది.

పాఠకుల నాడిని లోతుగా పట్టిన బలరామ్‌గారు దానిని తన 'స్వాతి చినుకులు'లో ప్రస్ఫుటం చేశారు. ఈ బంగారు పుస్తకానికి మించిన ఆభరణం బహుశా వుండదేమో. ఆయన కొంగ్రొత్త కల్పనాశక్తిని అభి నందించి తీరాలి. ఎన్నెన్నో వాస్తవాల్ని అక్షరాలుగా పేర్చి మనందరి కళ్ళ ముందుంచారు.

పాఠకులే బలరామ్‌గారి బలం. ఆయన తన నవ్వుతో, స్వాతితో పాఠకుల మనస్సును గెలుచుకున్నారు. బలరామ్‌గారు యువకులు, అత్యుత్సాహి, సేవాదృక్పథం కలవారు, జర్నలిజం రంగంలో ప్రపంచ నాయకులు.

జి.నారాయణచెట్టి ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) హైదరాబాద్
3.4.2009



నిరంతరం పారే సెలయేరు

1970లో శ్రీ వేమూరి బలరామ్‌గారు 'సామాన్యుడు'. తన అభిరుచుల, ఆలోచనల మేరకు స్వాతిని నడపటంకోసం, దాని బాధ్యతలు పూర్తిగా తీసుకుని అందుకోసం మంచి ఉద్యోగానికి రాజీనామా చేసిన సాహసి. పెద్ద పేరున్న మాసపత్రికల నడుమ నలిగిపోకుండా నిలబడ్డ మనోబలరాముడు.

అతడు-

ఒక్కడు!

ఒకే ఒక్కడు

అతనొక్కడే-

ఎందుకంటే ఆయనకి God-father ఎవరూ లేరు, God తప్ప.లక్ష్య సాధన కోసం కసిగా చేసిన స్వయంకృషి ఆయనది.

ఒక్కసారే పైకెగసిన కెరటం కాదాయన. నిరంతరం పారే సెలయేరు. తన పరిధిని పెంచుకుంటూ పోతోంది, ఆయన శక్తి.

స్వాతి మాసపత్రిక మాస మాస ప్రవర్ధమానమవుతోంటే ఆ విజయానికి కారణం ఏమిటీ అని నన్ను ఒకరిద్దరు సంపాదకులు అడిగితే, 'మీది ఉద్యోగం, నిర్ణీత పనివేళలు- ఆయనకు వేళలు లేవు. నిత్యం స్వాతిజపం తప్ప' అనేవాణ్ణి.

నిరంతరం ఆయన ఆలోచనల ఫలితమే స్వాతి మాసపత్రిక విజయం. దానికోసం ఆయన పడ్డ మనోవేదన, ఇక్కట్లు ప్రత్యక్షంగా చూసినవాణ్ణి. కానీ వాటినన్నిటినీ తపస్సులో భాగంగా భరించిన శక్తిశాలి శ్రీ బలరామ్ గారు.

1979లో కాబోలు, వారపత్రిక పెట్టాలన్న ఆలోచన ఆయన చెప్పినప్పుడు అదిరిపడ్డాను. అప్పటికే ప్రముఖ వారపత్రికలు తమ ప్రాముఖ్యాన్ని సుస్థిరం చేసుకున్న సమయమది. వారపత్రిక పెట్టి ఆయనేమైపోతాడో అన్న ఆందోళనతో వుండేవాణ్ణి.

కానీ స్వాతి సపరివారపత్రిక కూడా ప్రారంభించడం జరిగింది.ఇతర పత్రికల వారి అంచనాలు తారుమారు చేస్తూ, శ్రేయోభిలాషుల భయాలను పోగొడుతూ అచిరకాలంలోనే అజేయుడుగా నిలబడ్డాడు.'ఈయన సామాన్యుడు కాడు' అనిపించుకున్నాడు. ఆయన నిరంతర కృషివల్లనే 'స్వాతి' అనితరసాధ్యం అనిపించే దశకు చేరింది.

బాబు విజయవాడ
10.4.2009



తెలుగు ప్రజల జీవితంలో ఒక అంతర్భాగం

శ్రీ వేమూరి బలరామ్‌గారు ఉత్తమాభిరుచి కలిగిన సంపాదకులు. 'స్వాతి' మాసపత్రికతో ఆయన సాహితీ ప్రపంచంలో ఒక వినూత్న ఒరవడిని సృష్టించారు.అదే విధంగా 1984లో 'స్వాతి' సపరివార పత్రికను ప్రారంభించి ఈ 25 సంవత్సరాలలో పత్రికను దేశంలోనే అత్యధిక సర్క్యులేషన్ గల వారపత్రికల్లో 3వ స్థానానికి తీసుకువెళ్ళడం తెలుగు వారు గర్వించదగిన విషయం.

స్వాతి సపరివారపత్రిక ద్వారా శ్రీ బలరామ్ ఎంతోమంది రచయిత లను, రచయిత్రులను తెలుగు పాఠకలోకానికి పరిచయం చేశారు.

ఉత్తమ రచనల ద్వారా తెలుగు సాహితీరంగాన్ని సుసంపన్నం చేశారు. అటు వ్యాపార విలువలతో పాటు ఇటు సాహితీ విలువలను కాపాడుకుంటూ 'స్వాతి'ని తెలుగు ప్రజల జీవితంలో ఒక అంతర్భాగంగా చేయడం అపూర్వం.

శ్రీ బలరామ్‌గారు 'స్వాతి'ని దేశంలోనే 'నెంబర్ 1' పత్రికగా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను.

స్వాతి సపరివారపత్రిక రజతోత్సవ పండుగ జరుపుకోబోతున్న సందర్భంగా నా శుభాకాంక్షలు.

నారా చంద్రబాబునాయుడు హైదరాబాద్
17.4.2009



స్వాతి రజతోత్సవం పాఠక విజయోత్సవం

అమ్మాజీ బలరాముల
వరపుత్రిక మన స్వాతి!
సకుటుంబ సపరివార
స్థిర పత్రిక మన స్వాతి!!

పసందైన తెలుగు రుచుల
పరమాన్నము మన స్వాతి!
ప్రియ పాఠకదేవుళ్ళకు
నైవేద్యము మన స్వాతి!!

అనిల్ స్మృతుల మధురిమల
అమృతఝరి మన స్వాతి!
గురువారము దినసరిలో
తప్పనిసరి మన స్వాతి!!

అతిరథుల అనుభూతుల
ప్రతిస్పందన మన స్వాతి!
హరిచందన సుగంధాల
మణిచందన మన స్వాతి!!

సరస కథల సరాగాల
రసలాహిరి మన స్వాతి!
సద్గురు సుభాషితాల
భావలహరి మన స్వాతి!!

కామెడీ కథానికల
కల్పతరువు మన స్వాతి!
వైవిధ్యప్రక్రియలకు
ఆదిగురువు మన స్వాతి!!

సుఖజీవన సూత్రాలకు
సంజీవని మన స్వాతి!
పారిజాత పరిమళాల
బృందావని మన స్వాతి!!

వర్తమాన రాజకీయ
వింజామర మన స్వాతి!
వార వార ప్రవర్ధమాన
విశ్వంభర మన స్వాతి!!

ఆధ్యాత్మిక వివరణల
జ్ఞానజ్యోతి మన స్వాతి!
పర్వదిన వ్రత విధుల
పరంజ్యోతి మన స్వాతి!!

చిట్టిపొట్టి చిన్నారుల
ఆటవిడుపు మన అనిల్ స్వాతి!
వర్ధమాన రచయితలకు
మేలుకొలుపు మన స్వాతి!!

సాటి వారపత్రికలకు
వెలుగుబాట మన స్వాతి!
విశ్వవ్యాప్త తెలుగు ఘనుల
కలలపంట మన స్వాతి!!

అరుదైన గౌరవాల
సంచలనము మన స్వాతి!
సంస్కృతీ సాంప్రదాయ
సంకలనము మన స్వాతి!!

అభిమానుల ఆశీస్సుల
తపోధనము మన స్వాతి!
మొక్కవోని బలరాముని
మనోబలము మన స్వాతి!!

స్వాతి చినుకుల సూక్తిసుధల
రాగజలధి మన స్వాతి!
తేనె సోనల తీపి గురుతుల
ఆటవెలది మన స్వాతి!!

నవరసాల డాట్‌కామ్‌ల
ఇంటర్‌నెట్ మన స్వాతి!
ఇక- కోతికొమ్మచ్చితో
మెగాహిట్టు మన స్వాతి!!

వైభవాల ప్రాభవాల
విలసిల్లును మన స్వాతి!
ఆచంద్రతారార్కము
వర్ధిల్లును మన స్వాతి!!

ముంగర కోటేశ్వరరావు తెనాలి
24.4.2009



అచ్చమైన తెలుగుకు స్ఫూర్తి

తెనుగు సాహిత్య సంద్రాన్ని మధించి మధించి
ముత్యాలనెన్నియో తీసినావు
'స్వాతి చినుకుల'నెన్నియో కురిపించి కురిపించి
పత్రికల మాలగా కూర్చినావు
ఎందరెందరో భారత ప్రథమ పౌరుల వెంట
ఎన్నెన్నో దేశాలు తిరిగినావు
అచ్చమైనట్టి తెలుగుకు 'స్వాతి' స్ఫూర్తి
గర్వమందెను స్వాతిని గనీ తెనుగుధాత్రి
'కొండంత వరములను గుప్పేటి' రాయుడు
ఎల్లవేళల మిమ్ము కాచుగాక!
శ్రీశైల శిఖరాన వసియించు మల్లన్న
ఆయురారోగ్యంబుల నొసగుగాక!
శ్రీ కాళహస్తిన వెలసిన శివశక్తి
కనురెప్పవలె మిమ్ము రక్షించుగాక!
'బెజవాడ దుర్గమ్మ' తోడుండి
ఆచంద్రతారార్కం స్వాతిని నడిపించుగాక!
దృష్టిదోషమ్ములన్నియూ తొలగిపోయి
సర్వ సౌభాగ్యములు మీకు సమకూరుగాక!
'నాడు' సహచరుడు స్నేహితుడనైన నేను
ఆత్మసాక్షిగా దీవించుచుంటి మిమ్ము

డా॥ పరుచూరి రాజారామ్ *గుంటూరు*
8.5.2009



ఒక మహాయజ్ఞం

ఇంతకుముందు ఎన్నో పత్రికలు రజతోత్సవాలు జరుపుకున్నాయి. కాని 'స్వాతి' సపరివారపత్రిక ఒక్కటే వాటన్నిటికి భిన్నంగా లక్షల మంది హృదయాలని తాకి కదిలించడం, దీర్ఘకాలం పాఠకులకి ఎంతో ఆనందాన్ని, ఆలోచనని అందించడం అనే ఓ మహాయజ్ఞాన్ని గత పాతిక సంవత్సరాలుగా దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ఇవి చాలా అపురూపమైన విజయాలు.

ఇవన్నీ ఒక ఎత్తైతే, కుటుంబ జీవనంలోని ఆనందాన్ని పూర్తిగా రుచిచూడటం, 'స్వాతి'ని బిడ్డగా భావించి ఆ బిడ్డ ఎదగడంలోని తృప్తిని ఆస్వాదించడం మీ దంపతుల ఆదర్శ జీవనానికి తార్కాణాలు.

భావి జీవితంలో మీ ప్రభావం మరింత విస్తరించి, 'స్వాతి' ఈ సమాజానికి స్పష్టమైన దిశని నిర్దేశిస్తుంది. తెలుగు భాషకి, జన జీవనానికి 'స్వాతి' ద్వారా మీరు చేస్తున్న సేవ మరెందరికో స్ఫూర్తినిస్తుంది.

మీరు, మీ కుటుంబం మరింత ఆనందాన్ని ఆస్వాదిస్తారని, జీవన గమ్యంలో తృప్తిని పొందుతారని ఆశిస్తున్నాను.

'స్వాతి' సపరివార పత్రిక రజతోత్సవం జరుపుకోబోతున్న ఈ శుభసందర్భంలో మనసారా అభినందనలు తెలుపుతున్నాను.

డా॥ జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్
15.5.2009

తెలుగుతల్లి 'ప్రియపుత్రిక'

కవులు కవులన్న
నెల్లరు కవులుగారు
నృపులు నృపులన్న
నెల్లరు నృపులుగారు
చిన్నతనముననే
నీకు చెప్పినాడ
తపన గుణధామ

సీతారామ నృపలలామ! అన్నారు మా గురుదేవులు పూజ్యపాదులు శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి- ఈ నుడి ఇరవయ్యో శతాబ్దానికే 'మహాకవి' అని కితాబు అందుకొన్న శ్రీరంగం శ్రీనివాసరావు- అదే శ్రీశ్రీకే వర్తిస్తుంది అంటే అతిశయోక్తి కాదు.

శ్రీశ్రీ జయంత్యుత్సవాలను 29 ఏప్రిల్ నుంచి - ఒక ఏడాదిపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా ప్రజ ఆనందంతో జరుపుకొంటూ వుండడం నిజంగా ఓ విశేషం- కవిత్వ ప్రక్రియలోనే సొంతం విప్లవాగ్ని రగుల్కొల్పిన కవివరేణ్యుడు శ్రీశ్రీ.

ఇది పాతికేళ్ళ పైమాట - శ్రీశ్రీ స్వాతి పత్రిక కార్యాలయానికి వచ్చారు- శ్రీ వేమూరి బలరామ్ మహాకవికి- ఆతిథ్యం ఇచ్చారు. ఆ తర్వాత శ్రీశ్రీని ఒక మిత్రుడు అడిగాడు "మీరు స్వాతి పత్రికను చూస్తున్నారా?"

తడుంకోకుండా ఒక మొక్కను వున్నపట్టున మొలిపించినట్టు శ్రీశ్రీ చిరునవ్వుతో అన్నారు "స్వాతి- పత్రికా! కాదు- కాదు అది తెలుగుతల్లి ప్రియపుత్రిక!" అని. తదాది- నేటి దనుక- స్వాతి పాతికేళ్ళ పడుచుగా ఎన్నెన్నో అందచందాలతో, ఒంపుసొంపుల వయ్యార మొలికించే సోయగాలతో- ఎంతగా ఎదిగిందో- ఖండఖండాలలో విస్తరించిన 39.59 లక్షల పాఠకులతో- తెలుగులోనే అత్యధిక సర్క్యులేషన్ గల ఏకైక వారపత్రికగా ప్రకాశిస్తోంది.

బుద్ధవరపు వేంకటరత్నం హైదరాబాద్
22.5.2009

రజత స్వాతి

ఒక సామాన్య వ్యక్తి ఒక పత్రికను ప్రారంభించి ఇరవై అయిదేళ్ళకు పైగా అనవరతంగా ఒక్క సంచిక తప్పకుండా, ఆలస్యం అసలు లేకుండా నడుపుతూ రావడం తెలుగు పత్రికా చరిత్రలో అరుదైన విశేషం. ఆ వ్యక్తి వేమూరి బలరామ్‌గారు, ఆ పత్రిక 'స్వాతి'.

'పత్రికే నా ప్రాణం' పత్రికే నా ఆశ... నా శ్వాస అంటూ తరగని తపనను వ్యక్తీకరించే వేమూరి బలరామ్‌గారికి అభినందనలు. ఆయన పత్రిక 'స్వాతి'కి రజతోత్సవాభినందనలు.

ఇరవై అయిదేళ్ళుగా మన సంస్కృతికి విశిష్టమైన సేవ చేస్తున్న శ్రీ వేమూరి బలరామ్‌గారికి తెలుగువారు తమ సంతోషాన్ని, కృతజ్ఞతను అందచేయడం సముచితం.

'చదువరు'ల పత్రికగా
తెలుగునాట వెలుగు నింపి
మేధావుల కరదీపికగ
వెలుగుబాట మనకు చూపి
విజ్ఞానం పంచుచుండె
అందరినీ పలుకరించి
జనచైతన్యం పెంచుచుండె
నాటి నుండి నేటివరకు
నిలువెత్తు మన 'వేమూరి'
నిజాయితీ ధ్యేయంగా
నిస్వార్థపు సేవ చేసి
అహర్నిశలు కష్టించి
ప్రతి సంచిక దిద్ది తీర్చి
మారుతున్న కాలాలతో
మార్పులెన్నో అందు కూర్చె
వ్యాసాలను ముద్రించెను
వివేకమును కలిగించెను
ఆశయమే కీర్తిగా
పాతికేళ్ళు గడిపినాడు
వేమూరి మానసపుత్రిక
స్వాతి సపరివార పత్రిక
పాఠకుల కల్పవృక్షం
విలువల అక్షర సాక్ష్యం!!


ప్యారీ బెంగళూరు
29.5.2009



ముగ్ధమోహిని

వేద, పురాణేతిహాసాల సూక్తి, సుభాషిత
మూర్తీభవించిన ముఖ చిత్ర విన్యాస వేదిక
రియాలిటీ, రీజనింగ్‌గల పొలిటికల్ రిపబ్లిక్
బయకార చేష్టల శృంగార కదంబ మాలిక
లబ్ధవర్ణపు రచయితల నవపల్లవ కావ్య కన్యక
రాతలో రమ్యత, ఎంపికలో నవ్యత 'స్వాతి' ప్రత్యేకత...హ
మ్,తుమ్ ఏక్‌హై అంటూ నినదించిన అక్షర కోకిల
విరించి పత్ని విహారిత, నివాసిత, సపరివారిత
జనం మెచ్చిన, ఖ్యాతి హెచ్చిన బలరాముని మానసపుత్రిక
యీ ముగ్ధ మాటకు, మనసుకు ఉన్న సంబంధం
ఆచంద్ర తారార్కం
భద్రాద్రివాసుని దీవెనలతో మూడు పువ్వులు ముప్పదికాయలతో
వర్ధిల్లు... ప్రవర్ధమానివై జ్ఞాన సుధను కురిపించు, మురిపించు
స్వాతి సపరివారపత్రిక రజతోత్సవ వేడుక శుభాకాంక్షలతో

డా॥ పి.చక్రపాణి నెల్లూరు
5.6.2009



నేనూ - మామయ్యా - స్వాతీ

'స్వాతి'తో నా బంధం 1971 నించీ. సద్యోగం అబ్బి హైదరాబాదుడు ప్రారంభించిన రోజులు. కొత్త కథను రాసుకుని పురిటి (సు)వాసనలు వెదజల్లుతున్న స్వాతికి తీసుకెళ్ళటం, బలరామ్ గారు (లేదా వేమూరి సత్యనారాయణ గారు) అలా కాదు ఇలా అని తిరిగి ఇవ్వటం, మళ్ళా అది మరోలానో, మరోటి ఇంకోలానో రాసుకెళ్ళటం- సుమారో ఏడాదికి విక్రమార్కుడు విజయం సాధించాడు! స్వాతి నా కథకి పట్టం కట్టింది! 'పారితోషికంగా ఓ ఏడాదిపాటు స్వాతి అందుకోండి' అన్నారు బలరామ్ గారు. 'భేష్' అనుకున్నాను.

కొన్నాళ్ళకి స్వాతి బెజవాడెళ్ళిపోయింది.

ఓసారి సెలవులకి బెజవాడ వెళ్ళినప్పుడే మా కేశవ మామయ్యా వచ్చాడు. ఇద్దరం ఆ సాయంత్రం బజార్లో నడుస్తున్నాం. నెల మొదటి వారమని గుర్తొచ్చింది - 'స్వాతి' ముందుకి రాగానే! 'జస్టెమినిట్' అని మా మామయ్యని రోడ్డు మీదే నిలబెట్టి, లోపలికి అడుగెట్టాను. బల రామ్‌గారికి దణ్ణం పెట్టాను- 'బాబు' సాక్షిగా! ఆయన ఆ నెల మానస పుత్రికని నా చేత పెట్టారు. అందుకుని బయటపడ్డాను.

ఆ క్షణంలో ఆ కేశవుడు ఈ శివుణ్ణి చూసిన చూపు ఆనాడు శివుడు మన్మథుణ్ణి చూసిన చూపే! 'పుస్తకాలనేవి కొని చదవాల్రా వెధవాయ్! పత్రికలవాళ్ళు తెల్సుకదా అని ఇలా కాంప్లిమెంటరీలు అడుక్కు తెచ్చు కుంటావా' అని నోటితో అన్లేదుగానీ, చూపు చాలు ఆ వడ్డనకి!

బిక్కమొహం వేశాను- మనసులో ఓ నిముషం గింజుకున్నాను. ఆ తర్వాత మెల్లగా గొణిగాను- "కాదు మామయ్యా! నా కథ వేసుకున్నం దుకు పారితోషికంగా ఏడాదిపాటు స్వాతి పత్రిక పంపుతున్నారు. ఈ నెల ఇక్కడే ఉన్నాను కదా అని స్వయంగా తెచ్చుకున్నాను"

మామయ్య మొహంలో రిలీఫ్! ఏం మాట్లాడలేదు. నా చెయ్యి అందుకుని నొక్కి వదిలేశాడు!

వామనావతారాన్నించి విశ్వరూపానికి అనతికాలంలోనే చేరుకున్న స్వాతి నించి ఈనాడు కథకి వెయ్యి రూపాయలు కథ పడకముందే (ఎన్నికయిన మర్నాడే?) అందుకుంటుంటే, ఆనాటి అనుభవం గుర్తొస్తూ ఉంటుంది!

ఆనాటి బాల్యావస్థనించి ఈనాటి బృహద్రూపానికి ఇంతింతై వటుడంతయైన చందాన ఎదుగుతున్న స్వాతిని చూసి ఆ ఖ్యాతి మాదిగా భావించి, ఏదో సాధించిన ఆనందం- గర్వం!

నలభయ్యేళ్ళ మా(న)సపత్రికా, పాతికేళ్ళ రజతోత్సవ బాలికా కూడా బలరామ్ గారి సారథ్యంలోనే స్వర్ణోత్సవ సంచికలు వెలుగు చిమ్ముతాయని ఆశ్వాసం - ఆకాంక్షా!

పి.వి.ఆర్.శివకుమార్ హైదరాబాద్
12.6.2009

'సపరివార' స్వాతి వెండికొండ

13 సంవత్సరాల క్రితం మా నాన్నగారు స్వాతి గురించి చెప్పిన మాటలు నాకు ఇప్పటికీ గుర్తు.

అప్పటికి ఆయన వయసు 70 సంవత్సరాలు పైనే.

అన్ని వయసులవారి
ఇష్టాలకు తగ్గట్టు
నేసిన కలనేత స్వాతి- అన్నది ఆయన అభిప్రాయం.

అందుకే-
అప్పటికీ
ఇప్పటికీ
అందరికీ
'సురుచుల' స్వాతి, 'సపరివార' స్వాతి.
పబ్లిక్‌లో స్వాతికి ఎంత పట్టు ఉందో
పబ్లిక్ రిలేషన్స్‌లో బలరామ్‌ది స్వాతి 'పట్టు'.

అందుకే-
పత్రికల్లో, స్వాతి వెండికొండ.
బలరామ్ నిండుకుండ.
పాఠకులకు, స్వాతి- ప్రియం, ప్రీమియమ్.
బలరామ్- సుప్రియం.
స్వాతి (వేమూరి) బలరామ్‌గారికి స్వాతికాభినందనలు.

తాడిమళ్ళ రామకృష్ణ హైదరాబాద్ 19.6.2009



పాతికేళ్ళ సపరివార యాత్ర

అప్పుడే పాతికేళ్ళు గడిచిపోయాయి... 1984 ఆగష్టులో మొదలైన స్వాతి (వారపత్రిక) అక్షరయాత్ర రమ్యంగా, మధురంగా సాగిపోతూ ఉంది. ఇరవై అయిదు వసంతాల శోభ సంతరించుకుని 'స్వాతి' విశ్వమోహినిలా తెలుగువారికి షడ్రుచులతో విందు భోజనం వడ్డిస్తుంది. తెలుపు నలుపు వర్ణాలతో మొదలైన పత్రిక (కవరు పేజీ మినహాయించి) ఇప్పుడు సప్తవర్ణ శోభితమై కనువిందు చేస్తూవుంది.

స్వాతి బలం, బలగం అంకితభావం ఉన్న శ్రీ బలరామ్ గారు, రచయితలు, ఆర్టిస్టులు. ఆ అంకితభావమే స్వాతికి రక్షాకవచం. "జయించేవారికి ఈ ప్రపంచం చాలా చిన్నది" అంటాడు అలెగ్జాండర్ చక్రవర్తి. ఆ స్ఫూర్తితో మరింత పత్రిక సర్క్యులేషన్ పెరుగుతూ అక్షర యాత్ర దిగ్విజయంగా సాగిపోవాలి.

స్వాతితో రెండు పుష్కరాల అనుబంధం... స్వాతి వారపత్రిక కథకు వంద రూపాయల పారితోషికం అప్పట్లో ఇస్తే ఎంతో ఆశ్చర్యంగా ఉండేది. కథకు నలభై, యాభై పుచ్చుకున్న అనుభవమేగాని వంద రూపాయల మనీయార్డర్ రాలేదు పత్రికల నుంచి. ఆ తరువాత పారితోషికం క్రమంగా పెరుగుతూ కథకు వెయ్యి రూపాయలు ప్రచురణ కంటే ముందే పంపే సాంప్రదాయం స్వాతి మొదలుపెట్టింది.

బంధువులు, మిత్రులకే కాకుండా రచయితలకు కూడ కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక పంపడం శ్రీ వేమూరి బలరామ్‌గారి సహృదయాన్ని తెలియజేస్తుంది. స్వాతి అనుసరించే మార్గం అనితరసాధ్యం.

రెండు అక్షరాల స్వాతి లక్షలమంది తెలుగువారి మనస్సులో మల్లెల సౌరభాన్ని వెదజల్లింది. క్రమం తప్పకుండా గురువారం ఉదయం స్వాతి పూల పరిమళం మన ఇంటిని చుట్టుముట్టేస్తుంది. వారం రోజులపాటు ఆ సువాసన మనల్ని వదలదు మరో సంచిక వచ్చేంతవరకు.

అలపర్తి రామకృష్ణ హైదరాబాద్
26.6.2009



స్వాతిముత్యానికి పంచరత్నాలు

శ్రీరాముని దయచేతను
నారూఢిగ తెలుగు ప్రజలు నౌరాయనగా
వారానికొక్క పండుగ
గా రంజిలె స్వాతి ఖ్యాతి గద కేఎస్వీ

బలరామ్ మానస పుత్రిక
విలసత్ సద్భావ లతిక విస్మృమర చేలాం
చల చలిత రసమయూఖిక
కలభాషిణి స్వాతిసూక్తి ఖని కేఎస్వీ

ఎన్నో పత్రికలొచ్చెను
ఎన్నో పత్రికలు పోయె నేవేమైనా
ఇన్నాళ్ళుగ నే పత్రిక
వన్నె పెరుగలేదు స్వాతివలె కేఎస్వీ

సరసాలకు సురశాలగ
సరదా పరదాల కథల స్వారస్యములన్
విరసాలకు చెరసాలగ
చరిత్రలో స్వాతికెవరు సరి కేఎస్వీ

స్వాతికి జీవనజ్యోతికి
చేతో బాంధవికి శుభద చిన్మయ మతికిన్
పూత యశోరుచి మూర్తికి
శతమాన శతాయు కీర్తిశతి కేఎస్వీ

కేఎస్వీ తిరుపతి
3.7.2009



పాతికేళ్ళ అందాల పడుచు 'స్వాతి' కోసం

అన్నానా భామినీ...

స్వాతితో మూడు దశాబ్దాల పైబడ్డ నా అనుబంధం-
నాలోని రచనాసక్తినీ/శక్తినీ దినదిన ప్రవర్ధమానం
చేస్తోందని... ఆదమరచి ఎపుడయినా...

స్వాతిలో వివిధ రసాల కథల పోటీ పేరు చూడగానే-
నా మనసు కదన కుతూహలంతో
ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని... మాట వరసకెపుడయినా...

బహుమతిచ్చినా, సాధారణ ప్రచురణకు తీసుకున్నా-
స్వాతి చెక్కుతో సహా అందించే ఆత్మీయ సమాచార పత్రం-
నాలోని రచయితకు సన్మాన శాలువా ధరింపజేసిన
అనుభూతిని కలిగిస్తుందని... నోరుజారి ఎపుడయినా...

స్వాతి చినుకుల కోసం ఎదురుచూసే చకోర పక్షుల్లా
ప్రతి గురువారం విడుదల అయ్యే స్వాతి సంచిక కోసం వారాల
కౌంట్‌డౌన్‌ని రసిక హృదయాలు బేలగా జపిస్తాయి అని...
తొందరపడి ఎపుడయినా...

సరసం, హాస్యం మానవుడి దీర్ఘాయుష్షుకి దివ్య ఔషధాలని
ప్రప్రథమంగా కనిపెట్టిన రసికజన మానసపుత్రిక స్వాతియే
అని... తొట్రుబాటులోనయినా...
అన్నానా భామినీ...!

తులసి బాలకృష్ణ హైదరాబాద్
10.7.2009

పాతికేళ్ళ "స్వాతి" ముత్యం

ఏ స్వాతి పఠితల ఆస్వాదనా శక్తి
ఇనుమడింపగజేసి వినుతి కెక్కె

ఏ స్వాతి కచ్ఛపీ సుస్వరమ్మనిపించి
అక్షరరాగాల నాలపించె

ఏ స్వాతి తెలుగింటి విశ్వాసమును బొంది
ఆత్మబంధువు వోలె అలరుచుండె

ఏ స్వాతి రాకకై ఎదురు చూచెడి వారి
ఎదలపై సాహితీ సుధలు జల్లె

అదియె పాఠకదేవుళ్ళ కాలయమ్ము
అదియె బలరామఋషిగారి ఆశ్రమమ్ము

అట్టి స్వాతికి ఇరువదిఅయిదు ఏండ్ల
పర్వమరుదెంచె నుతియింప సర్వజగతి.

వెన్నెలకంటి చెన్నై
17.7.2009



స్వాతికి నాకు పాతికేళ్ళు...

అది 1984... చదువుకుంటున్న రోజులు... టీనేజ్ అనుభవాలు, అనుభూతులతో కథో, కవితో రాసి స్నేహితులకి వినిపించి బావుందనిపించుకోవటం ఓ సరదా... ఈ పర్వంలో సపరివారపత్రిక ప్రారంభించబోతూ కథల పోటీ ప్రకటించింది స్వాతి. స్నేహితుల ప్రోద్బలంతో రెండు కథల్ని పోటీకి పంపిన రెండు నెలలకి ఓ కథ సాధారణ ప్రచురణకి స్వీకరిస్తున్నట్టు తెలిపి పత్రిక ప్రారంభానికి చాలా ముందుగానే పారితోషికం పంపి, అబ్బురపరచింది స్వాతి.

అలా నాలోని రచయితని భుజంతట్టి కాన్ఫిడెన్స్ ఇచ్చింది. ఆ ప్రోత్సాహంతో వెంటనే మరో రెండు కథల్ని మాసపత్రికకు పంపితే, ఈసారి ఏకంగా ఓ కథని ప్రచురించి, ఆ పేజీలు పోస్టులో పంపి మొట్ట మొదటిసారి నా కథని అచ్చులో చూపించి, అచ్చెరువొందేలా చేసింది స్వాతి. తదుపరి, ఎన్నో కథలు... అందులో రెండు సరసమైన కథలకి బహుమతులు అందుకుని, ముందుకెళ్తూ కథా రచయిత నుండి సీరియల్ రచయితగా (పది వారాల సీరియల్ పోటీలో నెగ్గి)ఎదిగింది కూడా స్వాతి సహచర్యంలోనే.

స్వాతితో పాతికేళ్ళ ఈ ప్రయాణంలో రచయితగా కంటే పాఠకుడిగానే ఎక్కువ అనుబంధం. ఈ బంధుత్వాన్ని కలిపిన శ్రీ బలరామ్ గారిని కలవాలని ఎప్పటిదో కోరిక. అది ఎరికైనట్టు గురుతుల్యులు 'వంశీ'గారి 'గోపి గోపిక గోదావరి' షూటింగ్‌లో 'మావిడాకు తోరణాలు బంతిపూల స్వాగతాలు...' (చిత్రీకరిస్తున్న పాట) అందుకుంటూ బలరామ్‌గారు అనూహ్యంగా ఎదురుపడగా, 'వల్లూరిపల్లి రమేష్'గారు వారితో కొద్ది రోజులు గోదారి తీరంలో కలిసి గడిపే అరుదైన అవకాశాన్ని కలిగించారు. ఆ సందర్భంగా, 'పాపికొండల్ని మొదటిసారి చూడటం ఇదే..' అని బలరామ్‌గారు చెప్పటం విని ఆశ్చర్యం అనిపించింది. ప్రెసిడెంట్, ప్రైమ్ మినిష్టర్ మొదలగువారితో పారిస్, యు.ఎస్. తీసుకెళ్ళిన పత్రిక ఆయనని ఇంత చిన్న చిన్న స్వంత సరదాలకి ఎంతలా దూరంగా ఉంచిందని...

స్వాతి పదికాలాలు పాఠకుల మది దోచుకోవాలని ఆకాంక్షిస్తూ...

శాంతారాం సూరపు హైదరాబాద్
24.7.2009

వారం వారం సపరివారం స్వాతి

1974లో నా పధ్నాలుగో ఏట 'స్వాతి' సచిత్ర మాసపత్రికలో కథల పోటీ ప్రకటన చూసి వీరావేశంతో 'ఏడడుగులు' అనే కథ రాసి పంపిన సంఘటన ఇప్పటికీ గుర్తు.

తర్వాత 1984లో 'స్వాతి' సపరివార పత్రిక ఆవిర్భవించి, 'బాపు బొమ్మకు కథ' ద్వారా నన్నో కథకునిగా ఎక్కువమందికి పరిచయం చేసింది! 'స్వాతి'లో ఏ శీర్షిక ప్రారంభమైనా అందులో నేను ఏదో రూపంలో పాలుపంచుకున్నాను. 'స్వాతి' సపరివార పత్రికతోపాటు, రచయితగా నాకూ ఇది 'రజతోత్సవ' సంవత్సరమే! నాలాంటి ఎందరికో కూడా!

ప్రతీ సంవత్సరం ఎన్నో పోటీలను పెట్టి, రచయిత(త్రు)లను తట్టి లేపి, రెచ్చగొట్టి మరీ కథలు రాయించి, బహుమతులిచ్చి గౌరవించేది 'స్వాతి' మాత్రమే అంటే అతిశయోక్తి కానేకాదు!

పాఠకుల్ని దేవుళ్ళగాను, రచయిత(త్రు)లను స్వంత కుటుంబ సభ్యులుగాను భావించడం వల్లనే, శ్రీ వేమూరి బలరామ్ గారి కుమార్తె చి.మణిచందన వివాహ వైభవాన్ని స్వయంగా వీక్షించే అరుదైన అవకాశం నాకు దక్కింది!

శ్రీలు పొంగే జీవగడ్డను 'స్వాతి'తో
వేళ్ళూని, పాఠకులను దేవుళ్ళగాను - సాహితీ
మూర్తులను కుటుంబ సభ్యులగాను భావించి - సప
రివార సమేతంగా వారం వారం 'స్వాతి' వీక్షకులను - తన
బలంగా చేసుకొని - తెలుగు వార పత్రికకు
లక్షలకు లక్షలు కాపీల సర్క్యులేషన్ గౌరవాన్ని - నజ
రానాగా అందించిన మాన్యశ్రీ 'వేమూరి బలరా-
మ్'గారికి ఇవే అభినందన 'రజతోత్సవ' చందనాలు!!

ఎన్.కె.నాగేశ్వరరావు పెనుగొండ
31.7.2009



తెలుగు పాఠకుడి అండ... స్వాతి బంగారుకొండ

స్వాతి నక్షత్రం గొప్పది
నక్షత్ర బలం ఇంకా గొప్పది
స్వాతి బలరామ్ సంకల్పబలం
ఇంకా ఇంకా గొప్పది!

అందుకే ప్రపంచంలో తెలుగువారెక్కడున్నా... స్వాతి సపరివార పత్రిక సకుటుంబ పత్రికగా... బంధుమిత్ర సపరివార సమేతంగా ఇష్టపడి చదివే పత్రికగా... తెలుగువారి అలవాట్లలో ఓ అంతర్భాగంగా... పత్రికా ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచి... పాఠకుల నీరాజనాలందుకుంటోంది. తనకంటూ కొన్ని నిర్దిష్టమైన ప్రమాణాలతో... విలువలతో... అనితరసాధ్యమైన అకుంఠిత దీక్షతో... ఆకాశమంత ఎత్తుకి ఎదిగింది. అక్కడ కనిపిస్తున్నాడు స్వాతి బలరామ్! అతిశయోక్తి కాదిది అందనంత ఎత్తుకి ఎదిగిపోయాడు స్వాతి బలరామ్!...

బుక్‌స్టాల్‌లో కనిపిస్తున్న పుస్తకాల్లో 'స్వాతి' సపరివార పత్రిక ప్రత్యేకంగా కనిపిస్తుంది. చూడగానే కొనాలనిపిస్తుంది.

ఎన్నో పత్రికలు పాతుకుపోయిన స్థితిలో ఓ వారపత్రిక తన ఉనికిని సాహితీ ప్రపంచానికి చాటిచెప్పడం గొప్ప ఫీట్‌గా నిలుస్తుంది.

ఇక్కడ ప్రత్యేకించి చెప్పుకోవలసిన విషయం ఏవిటంటే! 'స్వాతి' సపరివార పత్రికలో పేరున్న రచయితలు లేరు. పత్రికకు స్పాన్సర్ చేసే కార్పొరేట్ సంస్థలు లేవు. మిగతా పబ్లిషర్సుతో పోల్చి చూస్తే 'స్వాతి'కి నిధులూ లేవు. ఉన్నదల్లా విధులే! 'స్వాతి'కి అండగా ఉన్నవారు అభిమాన పాఠకులు మాత్రమే! 'స్వాతి'లో పెద్ద రచయితలు ఎవరూ రాయలేదు. 'స్వాతి'లో రాసి పెద్ద రచయితలయ్యారు.


'స్వాతి' ఈరోజు దేశవిదేశాల్లో దేదీప్యమానంగా మోగుతుందంటే దాని విజయ రహస్యం 'ఒన్ టు టెన్-నన్ అదర్ దేన్ స్వాతి బలరామ్ సర్' అంటాను. కృషి, దీక్ష, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. ముఖ్యంగా క్రమశిక్షణ. క్రమం తప్పకుండా పత్రికని తీసుకురావడం. అందులో సర్వాంగ సుందరమైన బొమ్మలు... శీర్షికలూ... కొత్త విషయాలూ... కథలూ... సీరియళ్ళూ... ఏ పేజీ తిరగేసినా అనితర సాధ్యమనిపించే విధంగా తీర్చిదిద్దడం. పుస్తకం హస్త భూషణం అంటారు కదా- ఆ పుస్తకం 'స్వాతి' అంటే అతిశయోక్తి కాదు.

ఏ ఒకటో... అరా పత్రికలు తప్ప... మిగతా పత్రికలు పారితోషికం అడిగితే పరిహాసంచేసే దౌర్భాగ్యపు స్థితి నెలకొని ఉంది. 'స్వాతి' అందుకు భిన్నంగా వ్యవహరించింది. రచయితల ఆశలకు ప్రాణం పోసింది. ప్రతి చిన్నరచనకు పెద్దమొత్తాన్ని 'బహుమతి'గా అందించే ఏకైక పత్రిక 'స్వాతి' మాత్రమే! కథలకు గానీ, సీరియల్స్‌కి గానీ భారీ మొత్తాన్ని అందించే పత్రిక కూడా 'స్వాతి' మాత్రమే! ఇది నిజంగా గర్వించదగ్గ విషయం!

ఈరోజు 'స్వాతి' రోల్‌మోడల్. ఈరోజు 'స్వాతి' భారత ప్రధానులు, రాష్ట్రపతుల నుంచి ప్రపంచ పర్యటనకు ఆహ్వానం అందుకున్న ఏకైక పత్రిక-'స్వాతి' సాహిత్యలోకంలో ధ్రువతారగా నిలిచిపోయింది.

ఒక్కమాటలో చెప్పాలంటే 'స్వాతి' సపరివార పత్రిక మన ఆంధ్రుల పత్రికని సగర్వంగా చెప్పడానికి సగర్వంగా ఫీలవుతున్నాను. సాహితీ నందనంలో వెలుగు పూలు పూయించిన స్వాతి బలరామ్ కృషి భావితరాలకు స్ఫూర్తిగా ఆచంద్రార్కం నిలిచిపోతుంది! ఇది అక్షర సత్యం!

ఇమంది రామారావు హైదరాబాద్
7.8.2009



పాఠకదేవుళ్ళ పాట

ప॥ మా స్వాతి పత్రికకు
మనసు పూ దండ
వేమూరి ఘనతకు
వేయి దండాలు...॥

చ॥ ముద్దు ముఖచిత్రాలు
ముగ్గులై పోతుంటె
బాపురమణల కథలు
బడి గంటలవుతుంటె
పండంటి శీర్షికలు
పొంగుతున్నాయి
పాఠకుల గుండెలే
పాడుతున్నాయి... ॥మా స్వాతి॥

చ॥ అనిలవార్తుల కథలు
అమృత వేదాంతాలు
ఉపనిషత్తుల బ్రోలు
సెక్సోపదేశాలు
జీ.కే. మాటల కొలువు
సపరి వారపు చదువు
వరఫలాలై నిలుచు
చరిత నిలిచే వరకు

భక్తి పువ్వుల రూట్సు
బాక్సైటముల 'బాంబ్సు'
కవ్వించు కార్టూన్సు
కలకండ సీరియల్సు
తెలుగు లోగిళ్ళలో
తేనెలై కురవంగా
రజతోత్సవం జరుపుతాం
రసరాజ్యమే ఏలుతాం

జై స్వాతి తల్లీ
జై స్వాతి తల్లీ
జై సరస్వతి 'స్వాతి' తల్లీ॥

జె.కె.భారవి హైదరాబాద్
14.8.2009



నవరసాలు ఒలికించు ఖని

"స్వాతి-పత్రికా! కాదు-కాదు అది తెలుగుతల్లి ప్రియపుత్రిక!" స్వాతి వీక్లీ ప్రతి సంచికా సర్వాంగ సుందరంగా ముస్తాబవుతూ మాకు కనువిందు చేస్తోంది.

హైలెస్సా హైలెస్సా... అంటూ కులాసా కబుర్ల తోరణం
అందం, ఆహ్లాదం, ఆరోగ్య సూత్రాలకు ఆలవాలం
కవ్వింతలు, కేరింతలు, కథా కమామీషుల కావ్యం
కోరుకునేవారికి కోరుకున్నంత క్రమానుస్వాదనం

నవరసాలు ఒలికించు ఖని మా స్వాతికి ఇవే ఆంధ్ర పాఠక నీరాజనాలు.

స్వాతి పాతికేళ్ళ పడుచుగా ఎన్నెన్నో అందచందాలతో, ఒంపు సొంపుల వయ్యార మొలికించే సోయగాలతో - ఎంతగా ఎదిగిందో- ఖండ ఖండాలలో విస్తరించిన 39.59 లక్షల పాఠకులతో తెలుగులోనే అత్యధిక సర్క్యులేషన్ గల ఏకైక వారపత్రికగా ప్రకాశిస్తోంది.

భగవదనుగ్రహముచే 'స్వాతి' పత్రిక ఇంకను ఎక్కువ ప్రచారమును బడసి ప్రజలకు మేలు కలుగజేయుగాక!

మీరు, మీ కుటుంబం మరింత అందాన్ని ఆస్వాదిస్తారని, జీవన గమ్యంలో తృప్తిని పొందుతారని ఆశిస్తున్నాను.

'కిసీకీ నజర్ నాలగే' ఈ వాక్యానికి అర్థం, దృష్టిదోషం (దిష్టి) తగలకుండు గాక!

'స్వాతి' సపరివార పత్రిక రజతోత్సవం జరుపుకున్న ఈ శుభ సందర్భంలో మనసారా అభినందనలు తెలుపుతున్నాను.

ఎస్.ప్రేమ్‌దులారి నెల్లూరు
21.8.2009

'స్వాతి' వైభవం

పాతికేండ్ల క్రింద 'స్వాతి' పుట్టిన వేళ
తెలుగుతల్లి గుండె పులకరించె -
గంపెడంత ఆశ కలిగె పాఠకులలో...
రచయితలకు క్రొత్త ప్రమిద దొరకె...

అచిరకాలంబులో 'స్వాతి' అందుకొన్న
ఆదరాభిమానాలకు హద్దులేదు -
ఖ్యాతి ఊరకనేవచ్చి కాలిచెంత
వంగుచు సలాముచేయదు - ప్రతిభ లేక

విలువలు పోషించుటలో
మెలకువలను తెలిసినట్టి మేటికదా శ్రీ
బలరామ్; 'స్వాతి'కి ముత్తెపు
వెలుగులలో మకుటమెత్తె విజ్ఞులు మెచ్చన్

పారితోషికమును ప్రచురించుటకు ముందె
ఉచితరీతినొసగు రచయితలకు -
కలము విలువ తెలిసి కనకాభిషేకమ్ము
చేయగలుగు 'స్వాతి'దే యుగమ్ము

ఎన్ని కలములెదిగి సన్నుతులందెనో
'స్వాతి' వలన; బడుగు బ్రతుకులెన్ని
కడుపునింపుకొనెనొ; ...కథలుగా నవలగా
వ్రాయవచ్చు 'స్వాతి' వైభవమును

రసరాజు తణుకు
28.8.2009



అద్వితీయం... అనితరసాధ్యం... అపూర్వం

'అద్వితీయంగా, అనితరసాధ్యంగా, అపూర్వంగా... అంగరంగ వైభవంగా వెలువడుతున్న స్వాతి సపరివార పత్రిక నభూతో...! ప్రతి పేజీ... ప్రతి అక్షరం ప్రాణం పోసుకున్నట్టుగా ఉంది.

పాతికేళ్ళుగా ఇలా ఒకే స్థాయిలో పాఠకులని అలరించడం ఒక్క 'స్వాతి'కే సాధ్యమేమో! ఎంతో తపన... అంకితభావం ఉంటే తప్ప ఇది సాధ్యంకాదు.

తింటే గారెలు తినాలి
వింటే భారతం వినాలి
చదివితే 'స్వాతి' చదవాలి
అనే కొత్త నానుడికి 'స్వాతి' సృష్టికర్త అయింది.

'స్వాతి' చదవడం ఆంధ్ర పాఠకుడి అదృష్టం. మేము అష్టదిగ్గజాలు కొలువు తీరిన శ్రీకృష్ణదేవరాయలి భువన విజయం చూడలేదు. కాని సాహితీ దిగ్గజాలు కొలువు తీరే 'స్వాతి' వేదికని ప్రతి వారం దర్శించడం మా అదృష్టం.

ఆబాలగోపాలాన్ని అలరించే పత్రిక ఒక్క స్వాతి మాత్రమే అన్నది నిర్వివాదాంశం.

ముందుముందు మా 'స్వాతి' మరిన్ని అద్భుతాలు సృష్టిస్తూ, ధృవ తారగా వెలుగొందాలని కోరుకుంటూ...

స్వాతీ నీకు శతమానం భవతి.

ప్రతాప వెంకట సుబ్బారాయుడు సికింద్రాబాద్
4.9.2009


రజతోత్సవ ముద్దరాలికి ముద్దులు...

ఎపుడు గురువార మగునని యెదురుజూచు
పాఠకులకెల్ల కనువిందు పరచునటుల
సొబగులీనుచు నరుదెంచు శుభము లొసగు
తెలుగు సీమకు నీ స్వాతి వెలుగు గాదె

వార పత్రిక లందున ధీరయగుచు
సాటి పత్రిక లందున మేటియగుచు
లక్షల కొలంది పఠితుల లక్ష్యమగుచు
అక్షరమ్ములు పండించు దక్షతయ్యె

జనన మందిన దాదిగ కనుచునుంటి
వయసు వరదగ నురికెడి హయము వంటి
శుక్ల పక్షము చంద్రుని సొగసు గంటి
ముద్దరాలికి తాతయ్య ముద్దులంటి

బద్ది నాగేశ్వరరావు అనకాపల్లి
11.9.2009



ఆంధ్రుల ఖ్యాతికి జయపతాకాలు

'**స్వా**తి' సపరివార పత్రికకి ఎంతలో - ఎంత తొందరగా వచ్చేశాయి పాతికేళ్ళు!

'స్వాతి' వార, మాసపత్రికలు దేశ సాంఘిక జీవనంలో, సాహితీ సందర్శనంలో, అద్భుత ప్రకాశం వెదజల్లి, ఆంధ్రుల ఖ్యాతికి మీరు ఎగురవేసిన జంట జయపతాకాలై, కలకాలం రెపరెపలాడుతూ ఉన్నాయి, ఉంటాయి.

నలభై, ఇరవై అయిదు ఏళ్ళు నిండిన మీ కన్నబిడ్డలు 'స్వాతులు' నిరంతర తేజస్సంపన్నంగా విలసిల్లాలని కోరుతున్నాను.

భగవంతుడి సన్నిధిలోని ప్రేమాంకిత పరీమళ పారిజాత పుష్పాల వాన మీమీద అనిల్‌బాబు కురిపించుగాక.

మీ దాంపత్య అనురాగ చిహ్నమైన చి॥ మణిచందన, అనిల్‌కుమార్, సత్యాచౌదరి, నిత్యాచౌదరి సమేతంగా మీకు మరింత అనురాగామృతం, ఆనందసుధాస్రవంతులు ప్రవహింపచేయాలని ఆశిస్తున్నాను.

మీ అర్ధాంగి శ్రీమతి అమ్మాజీ గారు ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధులతో మీకు అండగా, కొండగా, గుండెలనిండు ప్రేమగా నూరు వసంతాలు నూత్న సౌందర్యాలతో, సౌభాగ్యాలతో, మిమ్మల్ని కాపాడుతూ, ప్రోత్సహిస్తూ, పరిరక్షిస్తూ, పరిభ్రమిస్తూ, సహధర్మచారిణిగా, సమయానుకూలవర్తినిగా, సౌమనస్యమూర్తిగా, మార్గదర్శినిగా సహకరించుగాక.

కొలకలూరి ఇనాక్ హైదరాబాద్
18.9.2009

అచ్చమైన తెలుగు తాలింపు

తెలుగువారికి 25 సంవత్సరాలుగా 'స్వాతి' సపరివార పత్రిక నందిస్తూ-

వయోభేదం లేకుండా ఆబాలగోపాలాన్ని అలరిస్తూ
ఇంగ్లీషు మీడియం చదువులు, విదేశీమోజుల కాలంలో సైతం
తెలుగు అక్షరం మదిమదిలో పదిలంగా గుడికట్టుకునేందుకు
సామాన్య సాహిత్యభాషలో తెలుగు అక్షరాలకు శాశ్వత విలువను కల్పిస్తూ...
అసామాన్య విజ్ఞాన, వినోద, వ్యాపార, సాంఘిక, శాస్త్రీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక విశేషాల మేళవింపుతో...
ప్రతి ఇంటా, అచ్చమైన తెలుగు 'తాలింపు'లా
ఘుమఘుమలతో మధురిమలతో మనసంతా నింపుతూ....
తెలుగువారు ఏ దేశమేగినా, ఎందుకాలిడినా
వీడని నీడై, తోడై...
గత వర్తమాన, భావితరాలకు మార్గదర్శకమై
వెలుగొందగల్గే అక్షర దీపికలను...
'స్వాతి'రూపాన వారం వారం అందిస్తున్న తీరు బహుధా ప్రశంసనీయం.
ప్రపంచమంతా ఒక్కటైపోతున్న విశ్వవిపణి, పారిశ్రామికీకరణ ప్రాబల్యంలో సైతం,
ప్రాంతీయ భాషను,
మన 'తెలుగు' భాషను పదిలపరచే ప్రక్రియలో
'స్వాతి' ఓ అప్రకటిత మహాయజ్ఞం.

నూలు శ్రీరామచంద్రరావు, వెంకట నాగలక్ష్మి కేరళ
25.9.2009

తెలుగు 'హై'లో 'హై'లెస్స

కృష్ణరాయలిది విజయనగరం
వేమూరి బలరామ్‌ది విజయవాడ
కవనమాయ భువనవిజయం
స్వాతి ఈయన భువనవిజయం
ఆయనకి అష్టదిగ్గజాలు
ఈయనకు అనంత దిగ్గజాలు
ఆయన జాతి రాయలు
ఈయన స్వాతి రాయలు
ఆయన విజిత మొఘల్
ఈయన తెలుగు మేగజైన్ మొఘల్
అలనాటి ఆంధ్రభోజుడిగా ఆయనకు తెలుగు లెస్స
పత్రికాలోకంలో నేటి ఆంధ్రభోజుడిగా స్వాతి రాయలు
వేమూరి బలరామ్ తెలుగు 'హై'లో 'హై'లెస్స
జలప్రళయంలో ప్రాణికోటి మనుగడకి
మత్స్యావతారుడెన్నుకున్నది నావ
జలప్రణయంలో వేదవ్యాసోద్భవానికి పరాశరుడెన్నుకున్నది నావ
అఖిలాంధ్ర పండిత పామర పాఠక జనరంజక సాహితీ సాధనకి
జ్ఞానప్రవాహంలో అమ్మాజీ-సహిత-బలరామ్ ఎన్నుకున్నది
మణిమయ స్వాతి నావ!
గమ్యమెరిగిన ఈ నిరంతర ప్రయాణంలో రజతోత్సవమో మజిలీ!

రామలక్ష్మి, రాజగోపాలరావు హైదరాబాద్
2.10.2009



స్వాతి ముత్యం

మొక్కలాగే తాను పుట్టింది
పుట్టగానే పరిమళించింది
పాఠక హృదయాల సదనాలలో చేరి
ఏపుగా చెట్టుగా పెరిగింది

కొత్తదారుల వెంట వెళ్లింది
అన్నింట మిన్న అనిపించింది
పాఠకులనందరిని మెప్పించి ఒప్పించి
తనదారిలోకి రప్పించింది

అమ్మలా అందరికి నచ్చింది
అందరి హృదయాలు చొచ్చింది
పాఠకులనే తాను దేవుళ్ళుగా తలచి
దేవుళ్ళకే వరాలిచ్చింది

'స్వాతి' ముత్యంలాగె మెరిసింది
'స్వాతి' సత్యంలాగె నిలిచింది
పాతికేళ్ళవుతున్న పాతబడిపోకుండ
'స్వాతి' నిత్యమిలాగె ఉంటుంది

మాధవీ సనారా అనకాపల్లి
9.10.2009



స్వాతి నీ ఘనకీర్తి

తొలకరి జల్లులో మెరుపు స్వాతి
తొలకరి జల్లులో కడిగిన ముత్యం స్వాతి
ఇంతై ఇంతింతై దినదినాభివృద్ధియై
ప్రజా హృదయాలలో ఎంతో అభిమానాన్ని
పదిలపరుచుకుంది స్వాతి
ఎందరికో, కవులకు రచయితలకు
ఆశ్రయమిచ్చింది స్వాతి
అక్షరమక్షరమును పదాలుగా చేసి కవ్విస్తూ, నవ్విస్తూ
ప్రజా హృదయాలతో దోబూచులాడింది స్వాతి
తనదైన శైలిని చాటుతూ ఆంధ్రదేశానికే
గర్వకారణంగా నిలిచింది స్వాతి
స్వాతి నీ వెలుగు దశదిశలా వెలిగి
ప్రతి హృదయాన్ని చూరగొందమ్మా స్వాతి
స్వాతి సరిలేరు నీకెవ్వరూ
ఇక పోటీ రారు ఇంకెప్పుడు
పాతికేళ్ళ స్వాతి స్వీకరించమ్మా
నా నమస్సుమాంజలులు...

వి.వి.క్రిష్ణయ్య గిద్దలూరు
16.10.2009

స్వాతి-ఖ్యాతి

'చినుకై'
చిగురై
ముత్యపు చిప్పయై 'ముత్యమై'
మంచి ముత్యాల సరమై

వేకువై
వేణువై
వెలలేని వరాలై
విడ్డూరమై, మెరిసే వైడూర్యమై
సరాగరాగమై

సత్యమై, నిత్యమై
సమ్మోహనమై, సూక్తివై
పత్రికై, పుత్రికై
తెలుగింటి ఆడపడుచువై
తెలుగు జిలుగై

'అడగండి' అని
అడిగి మరీ విశదపరచే
అక్షర సామ్రాజ్యంలో
అక్షయపాత్రవై, 'నక్షత్రమై'
'అనిలై', అనంతమై
అపురూపమై, ఆరోగ్యమై
అసమానమై
ఆధ్యాత్మికమై

విరాజిల్లుతున్న
విరజాజివై
జాబిలై
వెన్నెల వెలుగువై
వినతికెక్కిన
నువ్వెవ్వరు?

అంబరాన స్వాతి నక్షత్రమా?
అంబుధిన స్వాతి ముత్యమా?
ఈ ఇరువురినీ చేర్చే స్వాతి చినుకువా?
ఎవ్వరు? నువ్వెవ్వరు??

నిర్మల కేశరాజు హైదరాబాద్
23.10.2009



వారపత్రికారంగంలో సంచలనం

పాఠకులు క్రమంగా వారపత్రికలకు దూరంగా జరిగిపోతున్న వేళలో 'స్వాతి' సపరివారపత్రిక తనదైన వినూత్న తరహా ఫార్ములాను సృష్టించి, వారిని దరిచేర్చుకుంది.

శ్రీ వేమూరి బలరామ్ 'స్వాతి' సపరివారపత్రికను ప్రారంభించిన తరువాత సంపాదకుల దృష్టినుండి పాఠకులను పరిశీలించే విధానానికి స్వస్తి చెప్పి, పాఠకుల దృష్టినుండి తన పత్రికను, అందులోని రచనలను పరిశీలించడం ప్రారంభించారు.

తెలుగునాట ప్రతివారం 40 లక్షలమంది చదువుతున్న 'స్వాతి' పత్రిక నిర్వహణను ఒక తపస్సులా భావించి, విజయవంతంగా నడుపుతున్న శ్రీ వేమూరి బలరామ్‌ని చూస్తుంటే- సునిశిత పరిశీలనా దృష్టి, ఎక్కడ ఏ మెరుపు కనిపించినా తక్షణమే దానిని గుర్తించి కైవసం చేసుకోగల సూక్ష్మదృష్టి ఆయనలో కన్పిస్తుంది.

మన తెలుగుజాతికి - భాషకు అపూర్వమైన ఖ్యాతి - ఆదరణ గుర్తింపు తెచ్చిన మీ ఈ యజ్ఞం దిగ్విజయంగా - నిరంతరం ప్రవర్ధమానంగా సాగాలని - పైకి పైపైకి - ముందుకు దూసుకుపోవాలని ఆశిస్తూ... 'స్వాతి' సపరివార పత్రిక రజతోత్సవం జరుపుకున్న సందర్భంలో శుభాభినందనలు.

కోపూరు వెంకట సుబ్బారావు మచిలీపట్నం
30.10.2009

అపర సంజీవని

అలనాడు ఆంజనేయుడు సంజీవనీ మూలిక ఎలా ఉంటుందో తెలియక సంజీవి పర్వతాన్నే పెకలించుకుని తీసుకువచ్చాడు. దానిలో అవసరమైన సంజీవనిని మాత్రమే తీసుకుని ఆ పర్వతాన్ని వదిలివేశారు. అది జరిగిపోయిన చరిత్ర.

కాని 'స్వాతి' సపరివార పత్రికలో ఏ ఒక్క అక్షరమూ అలా వదిలివేయడానికి వీలులేనిది. ఇది అంతంలేని చరిత్ర.

ప్రపంచం నలుమూలలా సంచరించగల సత్తా స్వాతికి మాత్రమే ఉంది. ఏ దేశమైనా ఆకాశం ఒకటే ఎలా అవుతుందో ఎన్ని పత్రికలున్నా స్వాతి ప్రత్యేకమైనది.

ఎందుకంటే, 'స్వాతి' నక్షత్రానికి ఉన్న ప్రత్యేకత అలాంటిది. ఆచంద్రార్కం అది తన ప్రకాశాన్ని వెదజల్లుతూనే ఉంటుంది.


స్వాతి ఆవిర్భవించిన దగ్గర్నించి శ్రీ వేమూరి బలరామ్ గారు పాఠక లోకాన్ని పాఠకదేవుళ్ళుగానే భావించి కీర్తిస్తున్నారు.

వారిపట్ల ఆయనకు గల విశ్వాసంవల్లే స్వాతి ఈనాటికీ ఏమాత్రం అలుపెరుగని ఆనందనాట్యం చేస్తూ ఉంది.

ఎంతోమంది అతిరథ మహారథులతో ఎన్ని దేశాలు సందర్శించినా, ఎన్ని పురస్కారాలు పొందినా ఇసుమంతైనా గర్వం ప్రదర్శించని మహామనీషి శ్రీ వేమూరి బలరామ్ గారు.

పత్రికా రంగానికే తలమానికం అయిన స్వాతి సపరివార పత్రికను అత్యంత శ్రద్ధాసక్తులతో, సర్వాంగసుందరంగా పాఠకదేవుళ్ళ అభిరుచుల కనుగుణంగా తీర్చిదిద్దుతున్న శ్రీ వేమూరి బలరామ్‌గారికి, వారి కుటుంబసభ్యులందరికీ స్వాతి రజతోత్సవ శుభాకాంక్షలు.

యు.కృష్ణమూర్తి ఊటుకూరు
6.11.2009



‘వాసి’లోను ‘రాసి’లోను నెం.1

‘వాసి’లోను, ‘రాసి’లోను ఒక పత్రిక నెంబర్ 1 స్థానాన్ని పొందడమనేది ఎంత కష్టతరమైనదో అందరికీ తెలుసు. అలాంటి ఉత్కృష్టమైన స్థానానికి ‘స్వాతి’ చేరుకోవడానికి శ్రీ వేమూరి బలరామ్ గారు ఎంత కృషిచేశారో, ఎంత పట్టుదలగా, దీక్షగా, క్రమశిక్షణతో పత్రికను పాఠక దేవుళ్ళ అభిమానం చూరగొనేలా రూపొందించడానికి శ్రమించారో ‘స్వాతి’ సంస్థతో పరిచయమున్న అందరికీ తెల్సు.

పత్రికా ప్రపంచంలో ఇంతవరకూ ఎవరూ సాధించలేని మరిన్ని అత్యున్నత విజయాలు సాధించాలని స్వాతి కుటుంబంలో ఒక సభ్యుడిగా మనసారా కోరుకుంటున్నాను.

డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి విజయవాడ
13.11.2009

పత్రికారంగంలో ఇంద్రజాలికుడు

భారతదేశంలో గల మేగజైన్లలో స్వాతి సపరివార పత్రిక ‘మూడవ’ స్థానంలో ఉందంటే ఆ క్రెడిట్ పూర్తిగా శ్రీ వేమూరి బలరామ్ గారికే దక్కుతుంది.

బలరామ్ గారు పాఠకుల అభిరుచి తెలుసుకోవడానికి ఆంధ్ర దేశమంతటా తిరిగి పాఠకులనాడి తెలుసుకుంటూ కష్టపడ్డారు. కాబట్టే ‘స్వాతి’ పత్రికారంగంలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబడింది.

స్వాతి బలరామ్‌కు పాఠకులే దేవుళ్ళు! వాళ్ళని, వాళ్ళ అభిరుచిని ఆయన ఆరాధిస్తారు. ఆయన బలమంతా పాఠకులు! అందుకే...

స్వాతికి పోటీగా ఏ పత్రికా నిలువలేదు. స్వాతి సపరివార పత్రిక వెనుకనే... స్వాతి బాటలో ఎన్నో పత్రికలు నడిచాయి, నడుస్తున్నాయి, నడుస్తూనే ఉంటాయి.

స్వాతి సపరివార పత్రిక ఎప్పటిదైనా చాలా భద్రంగా దాచుకుంటారు. కారణం ఏమిటి? అదే స్వాతి సంపాదకుని ఇంద్రజాలం.

స్వాతిలో అంతా కొత్తదనమే. ఈనాడు చాలా పత్రికల్లో వస్తున్న శీర్షికలన్నీ ఒకనాడు స్వాతి పత్రికలో వచ్చినవే అంటే ఎంతమాత్రమూ అతిశయోక్తికాదు. స్వాతి పత్రికలన్నీ దొరికితే, ఒక్కొక్కటే చూస్తూ ఉంటే ఎప్పటికప్పుడు దేనికదే కొత్తగా ఉంటుంది. అందుకు కారణం...

స్వాతి బలరామ్ ఒక తపస్సులాగా నిరంతరం ‘స్వాతి’ రూపురేఖలు తీర్చిదిద్దుతూ ఉంటే, వారి చిరంజీవి మణిచందన వారికి చేదోడు వాదోడుగా ఉంటారు. అదే ఆయన అదృష్టం.

స్వాతి సపరివార పత్రికను శతమానం భవతి అని దీవిస్తూ

గీతాసుబ్బారావు హైదరాబాద్
20.11.2009



స్వాతికి 8 దిక్కులు తెలుసు

మామూలు మనిషికి 4 దిక్కులు తెలుస్తాయి. కాస్త వాస్తు తెలిసినవారికి మరో నాలుగు...అంటే 8 దిక్కులు తెలుస్తాయి.

కానీ మానవ జీవనయవనికలోని సమస్త కోణాలనూ స్పృశించి, అన్ని దిక్కులనూ పరికించి చూస్తున్న 'స్వాతి' వ్యక్తిత్వ నిర్మాణ సోపానానికి పట్టుగొమ్మ వంటిది.

సీ. జాతికి కీర్తియౌ జయమిచ్చినది మీరు
స్వాతికి బలమగు సమత మీరు
తేనెల మించిన తెలుగుపలుకు మీరు
స్వాతికి బలమగు సమత మీరు
జీవనసారపు జిగిబిగి సిరి మీరు
స్వాతికి బలమగు సమత మీరు
సామ్యములేనట్టి సౌహార్ద్ర నిధి మీరు
స్వాతికి బలమగు సమత మీరు

తే. సొగసు, వగలు, హొయలు, కొత్త సోయగాల
వర్ణచిత్రము. ఆహ్లాద వారధియగు
తెలుగువారల అభిరుచి తెల్పు- స్వాతి
మనవలెను మరికొన్ని యోజనపుటేళ్లు
వెలుగవలెనెన్నొ యుగములు, వెనుక తరము
వారలకు దారి చూపించు వన్నె కలిగి

అక్షరమునాయుధంగా... విజ్ఞానవీచికల వెదజల్లు సపరివార పత్రిక స్వాతి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ...

మన్నవ గంగాధరప్రసాద్ చెన్నై
27.11.2009

ప్రయోగాలకు పుట్టినిల్లు

మన దేశంలో ఎవరైనా, ఏదైనా విజయం సాధిస్తే వెంటనే ఏవేవో కారణాలు చెప్పుకుంటాం. 'వీడు అదృష్టవంతుడనో, ఫలానా వారికి బంధువనో, పుట్టుకతోనే అదృష్టం కలిసి వచ్చిందనో' అనుకుంటాం. కానీ దాని వెనుక ఉన్నటువంటి కృషిని మాత్రం గుర్తించం.

పత్రికా రంగంలో శ్రీ వేమూరి బలరామ్ గారు ఇంతటి విజయం సాధించారంటే దాని వెనుక వారి కృషి, పట్టుదల, అకుంఠితదీక్ష అన్నీ కలగలిసి ఉన్నాయి. దానికి నిదర్శనమే వారి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న స్వాతి సపరివార పత్రిక సాధించిన ప్రగతి.

పత్రిక అనేది ఒక సర్క్యులేషన్ బట్టే కాదు, పాఠకులకి ఏమందిస్తోందీ, ఏ నిదర్శనం చూపిస్తోందీ అన్నది ముఖ్యం. అటువంటి విషయాలలో ముందంజ వేసి ఎన్నో ప్రయోగాలను చేసిన వారపత్రిక స్వాతి.

శ్రీ బలరామ్ గారికి స్వాతి ఒక ప్రపంచం.వారి కుటుంబం స్వాతి. వారి ప్రతి యాక్టివిటీ కూడా స్వాతే.

అటువంటి ఇన్‌వాల్వ్‌మెంట్, కమిట్‌మెంట్ ఉంది కాబట్టే స్వాతి సపరివార పత్రిక సాటి పత్రికలలో అంతటి ప్రగతి సాధించింది.

'తానా' వారిచ్చిన 'తెలుగు మేగజైన్ మొఘల్' అవార్డు పత్రిక-ప్రచురణ రంగాల్లో బలరామ్ గారు అధిష్ఠించిన సమున్నతమైన స్థానానికి ఒక ఘనతరమైన కితాబు కావడమే కాక, ఆయన పోరాట పటిమకు, మొక్కవోని దీక్షకు గుర్తింపు కూడా. వారి విజయం తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక సాహసోపేతమైన అధ్యాయం.

శిఖరాగ్రాన్ని చేరుకునే క్రమంలో బలరామ్ గారు ఎన్ని సవాళ్ళను అధిగమించారో వ్యక్తిగతంగా నాకు తెలుసు. ఎంతో ప్రామాణికత, శ్రద్ధాసక్తులు లేకుండా ఇంతటి ఘనకార్యం సాధించడం కష్టం.

స్వాతి సపరివార పత్రిక మరెంతో ఎత్తుకు ఎదిగి, మరెన్నో రికార్డులు సాధించాలని కోరుకుంటున్నాను.

పద్మశ్రీ రమేష్ గెల్లి హైదరాబాద్
4.12.2009



రాబోయే తరానికి మార్గదర్శి స్వాతి

శ్రీ వేమూరి బలరామ్ గారు నిత్యకష్టజీవి, ఆయనకు పనే సర్వస్వం. ఆ పనిలో ప్రత్యేకత ఉండాలి, భావితరానికి మార్గదర్శకత్వంగా ఉండాలి అనే తపన ఆయనలో ప్రస్ఫుటంగా కనపడుతుంది. మంచి మనసున్న సహృదయులు, ఆప్యాయతానురాగాలకు ప్రతిరూపం ఆయన.

ఒకసారి వారితో పరిచయమైతే చాలు, మరిచిపోలేని వ్యక్తిత్వం. అట్లాగే, వారు కూడా మనము ఎంత చిన్నవాళ్ళమైనా మరచిపోరు. అన్నిటికీ మించి వారిలో కనపడని దానగుణం-ఇవన్నీ చూస్తుంటే వారు ఈ తరానికి, మనకి మట్టిలోంచి దొరికిన అపురూపమైన మాణిక్యం.

వీరు సాగరమథనం చేసినంత కష్టపడి, అహరహమూ శ్రమించి స్వాతిని పెంచి పెద్దదాన్ని చేస్తూ వేమూరి బలరామ్‌గారల్లా, స్వాతి బలరామ్‌గారయ్యారు.

స్వాతిని కన్నబిడ్డలాగా చూసుకుంటూ, తమ అనుభవాన్ని కన్నబిడ్డ అయిన మణిచందనకు రంగరించిపోస్తూ, ఆమెను స్వాతి రాబోయే తరానికి అండగా తయారుచేస్తున్నారు.

బలరామ్‌గారిలాగా మనసు పెట్టి కష్టపడితే మనము ఉన్నత స్థాయికి ఎదుగుతాము.

ఇంతటి దీక్షాదక్షతలున్న శ్రీ వేమూరి బలరామ్ గారి మానస పుత్రిక 'స్వాతి సపరివార పత్రిక' నిండు నూరేళ్ళు వర్ధిల్లుతూ, పత్రికా ప్రపంచంలో అగ్రతారగా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాను.

డా॥ సి.సుభాకర్‌రావు విజయవాడ
11.12.2009



రెండు ప్లస్‌లు స్వాతి బలం

సాహసప్రియులు ఈ లోకాన్ని ఇంకో అడుగు ముందుకు వేయించేలా చేస్తారు!

కానీ అది ఎటు ముందుకు వెడుతుందో ముందే నిర్ణయించుకుంటారు సంయమనప్రియులు!

ముందుకు పోతున్నామని, డొంకల్లోకీ, అడవుల్లోకి పోతారు కేవల సాహసప్రియులు!

ముందుకు పోవడమంటే గతంనుంచి నేటికి ఎలా వచ్చామో అలాగే రేపట్లోకి వెళ్ళడం అనుకుని ప్రణాళిక గీసుకుంటారు సంయమనప్రియులు. సాహసప్రియులు అతివాదులు! సంయమనప్రియులు మితవాదులు!

ఈ ఇద్దరికీ మధ్య నిలబడగలిగినవారు అరుదుగానే ఉంటారు!

వారే స్థితినీ గతినీ కూడా సాధిస్తారు! ఆ అరుదుగా ఉండేవారిలో సాహసమూ ఉంటుంది! సంయమనమూ ఉంటుంది!

అంటే రెండు ప్లస్‌లుంటాయి కానీ మైనస్ ఉండదు!వారే ముందుకు నడుస్తారు! ముందు నడుస్తారు! ముందుకి నడిపిస్తారు!

అలాంటివారే స్వాతిశయంలేనివారు. స్వాతి సంపాదకులు!

స్వాతి సంపాఠకులు! స్వాతి సంచోదకులు!స్వాతి సంబోధకులు!

స్వాతి వేమూరి బలరామ్ గారు.

డా॥ మిరియాల రామకృష్ణ రాజమండ్రి
18.12.2009

వారపత్రికకు సరికొత్త నిర్వచనం 'స్వాతి'

"సపరివార పత్రిక" అనే సరికొత్త నిర్వచనంతో మొదలై అతి వేగంగా సర్క్యులేషన్ శిఖరాగ్రాన్ని చేరుకొన్న వారపత్రిక స్వాతి. సంపాదకులు వేమూరి బలరామ్. స్వాతి పొందిన జనాదరణవల్ల బలరామ్ ఇంటిపేరు స్వాతిగా మారిపోయింది. పాఠకుల నాడి తెలిసిన సంపాదకులు. ఒకవంక యువతనూ, మరొకవంక గృహిణులనూ, ఇంకొక వంక వృద్ధతరాన్ని ఆకట్టుకునే రచనలను ప్రచురిస్తూ అత్యధిక సర్క్యులేషన్ కలిగిన వారపత్రికగా స్వాతిని తీర్చిదిద్దారు.

1984 ప్రాంతంలో ఈ వారపత్రిక ప్రారంభమైనప్పుడు అప్పటి ప్రసిద్ధ పత్రికలన్నింటికంటె అమ్మకాలలో వెనుకన ఉండేది. తరువాత దశకంలో మిగతా పత్రికల సమస్థాయికి ఎదిగింది. మరికొన్ని సంవత్సరాలలో మిగతా అన్ని పత్రికలను వెనుకకు నెట్టి అత్యధిక సర్క్యులేషన్ కలిగిన పత్రిక అనిపించుకున్నది.

కథలు, సీరియల్స్, నవలలు మిగతా పత్రికలలోవలెనే ప్రచురించినప్పటికీ సెక్స్ విజ్ఞానం, ఆధ్యాత్మిక జ్ఞానంలాంటి అనేక సరికొత్త శీర్షికలతో పత్రిక అన్నివర్గాలను ఆకర్షించగలిగింది.

స్వాతి భవిష్యత్తులో మరిన్ని విజయాలతో ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాను.

పొత్తూరి వెంకటేశ్వరరావు హైదరాబాద్
25.12.2009



ఒంటరి విజయం

శ్రీ వేమూరి బలరామ్‌గారి మానసపుత్రిక స్వాతి సపరివార పత్రిక 25 ఏళ్ళను పూర్తిచేసుకున్నందుకు నాకు చాలా ఆనందం కలిగింది.

తెలుగు పత్రికల్లో స్వాతి వార, మాసపత్రికలను ఒంటిచేత్తో నడుపుతూ, అద్భుత విజయాలను సాధించి, పాఠకుల హృదయాల్లో స్వాతి నిజంగానే సకుటుంబ సపరివార పత్రికగా తీర్చిదిద్దిన ఘనత వేమూరి బలరామ్ గారిది.

వారు స్వాతిలో రాసిన 'స్వాతి చినుకులు' తెలుగువారి దైనందిన జీవితాలకు దర్పణాలు.

ఇప్పటివరకు ఏ పత్రికా సంపాదకుడికీ దక్కని 'తెలుగు మేగజైన్ మొఘల్' గౌరవాన్ని పొందిన ఏకైక వ్యక్తి స్వాతి బలరామ్ గారు.

వేమూరి బలరామ్‌గారిలాంటి విశిష్ట వ్యక్తి, సౌజన్యమూర్తి నాకు ఆత్మీయులైనందుకు ఎంతో సంతోషిస్తూ వారు కలకాలం స్వాతి సామ్రాజ్యాన్ని సర్వజనామోదంగా, సమర్థవంతంగా నడిపి, తెలుగు పాఠకులకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నాను.

పి.రాజేశ్వరరావు హైదరాబాద్
1.1.2010

స్వాతికి సంవత్సరానికి 52 ఋతువులు

స్వాతి... ఆ పేరు వింటే చాలు ప్రతి తెలుగువాడి మనసు పులకరించిపోతుంది.

పాఠకుడిని మైమరపింపజేసే అద్భుతలోకం స్వాతి.

కదిలే బొమ్మలతో ప్రేక్షకుడిని మరో లోకంలోకి తీసుకువెళతారు సినిమా దర్శకులు.

కదలని అక్షరాలతో, బొమ్మలతో పాఠకుడిని రంగులలోకంలోకి తీసుకువెళతారు 'స్వాతి' దర్శకులు శ్రీ వేమూరి బలరామ్.

సంవత్సరానికి ఆరు ఋతువులు ఉన్నాయని మనకు తెలుసు.

ఈ సంవత్సరంలో ఆయా ఋతువుల్లో ప్రకృతి అందం ఏవిధంగా ఉంటుందో మరు సంవత్సరం కూడా ఆయా ఋతువుల్లో అదే అందం గోచరిస్తుంది.

స్వాతికి సంవత్సరానికి 52 ఋతువులు (సంచికలు). ఈ 52 ఋతువుల్లోనూ మనకు ఎన్నో అందాలు కనిపిస్తాయి.

మరు సంవత్సరం ఈ 52 ఋతువుల్లోని అందాలను మించిన అందాలు కనిపిస్తాయి. ఇలా ప్రతి సంవత్సరం సరికొత్త అందాలను పాఠకుడికి చూపించే 'స్వాతి' బ్రహ్మ శ్రీ వేమూరి బలరామ్ మనలను ఇలా మైమరపింపజేస్తూనే ఉండాలని కోరుకుంటూ...

కె.లలితకుమారి కృష్ణనగర్
8.1.2010



అక్షరాలతో ఆడుకునే సాహితీపుత్రుడు

శ్రీ వేమూరి బలరామ్ గారు సాధించుకున్న పేరుప్రఖ్యాతులు అందుకోవడం ఎవ్వరివల్లా కాదు. మరి ఇంకెవ్వరికీ, ఎన్నటికి కూడా సాధ్యం కానేకాదు. ఎందుకంటే-

బలరామ్ గొప్ప వ్యక్తి
మహామేధావి. అక్షరాలతో ఆడుకునే సాహితీపుత్రుడు
తెలుగింటి సపరివారులు అభిమానించే మహాపురుషుడు
అన్నిటికంటే 'బలరామ్ చిలిపివాడు.
సరసమైన భాషను పటుత్వంతో పరుగులెత్తిస్తాడు'
స్వచ్ఛమైన తెలుగును స్వాతితో తెలిపిన ఘనుడు
వారపత్రికా ప్రపంచంలో ఆయనకు ఆయనే సాటి
ఆయనకు ఆయనే పోటీ
ఇది జగమెరిగిన సత్యం
ఆయన కీర్తిప్రతిష్ఠలు తెలుగుభాష బ్రతికినంత కాలం పరుగు లెడుతుంటాయ్

జి.రవికుమార్ హైదరాబాద్
15.1.2010

సర్వం 'స్వాతి'మయం

'అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ... అందరికీ అందనిదీ పూచిన కొమ్మ...' అని ఓ సినీకవి అన్నట్లుగా, నిజంగా అందానికి అందం స్వాతి సౌందర్యం. రాబోయే సంచికలు ఎలాంటి సొబగులతో వెలువడుతాయో ముందుగా ఎవరి ఊహకీ అందని విషయం.

విభిన్నమైన కథలతో, విలక్షణమైన శీర్షికలతో, ఉత్కంఠభరితమైన సీరియల్స్‌తో, గిలిగింతలుపెట్టే కార్టూన్లతో, అశేష పాఠకుల మనసును దోచుకుని, అందనంత ఎత్తుకు ఎదిగిన స్వాతికొమ్మను అందుకోవడం ఎవరికి సాధ్యం! అందుకే స్వాతికి ఖండాంతర ఖ్యాతి లభించింది.

మొన్నీమధ్య అమెరికాలోని స్వాతి అభిమాన పాఠకులు స్వాతి గురించి మాట్లాడుతూ- 'స్వాతిలోని ప్రతి శీర్షికా ఎంతో ఉత్సాహంగా చదివించేదిగా వుంటుంది. స్వాతి తమకు ఖచ్చితంగా గురువారమే రిలీజు అవ్వటం విశేషమని, ఏమాత్రం ఆలస్యమయినా తాము ఏదో కోల్పోయినట్లుంటుంద'ని అన్నారు.

స్వాతికి విదేశాలలోనూ అశేష పాఠకుల విశేష ఆదరణ లభించిందంటే, దాని వెనుకున్నది శ్రీ వేమూరి బలరామ్‌గారి అకుంఠితదీక్ష, అవిరళకృషి అన్నది జగమెరిగిన సత్యం. ఉత్తమ సాహితీ విలువల్ని కాపాడుకునే విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, పాఠకులకు విలువైన, విజ్ఞానవంతమైన సమాచారాన్ని అందించడంతోపాటు వారం వారం స్వాతిని దివినుంచి భువికి దిగివచ్చిన తారలా సర్వాంగసుందరంగా ముస్తాబు చేయడంలో ఆయనకు ఆయనే సాటి.

స్వాతి ఈ స్థాయిని ఎల్లకాలం నిలబెట్టుకుంటూ, ఎన్నో అనూహ్య విజయాలతో, అరుదైన గౌరవసత్కారాలతో ముందుకు సాగుతూ, సర్వం 'స్వాతి'మయం కావాలని కోరుకుంటున్నాను.

కె.ఎస్.మాధవరావు విజయవాడ
22.1.2010



మీరే స్వాతి - స్వాతే మీరు

పత్రిక శ్రేష్ఠతనిబట్టి దాని సారథి గురించి అంచనా వేయవచ్చు. మీయొక్క నిజాయితీకి, నీతికి 'స్వాతి' పత్రిక అభివృద్ధే నిదర్శనం.

'స్వాతి'లోని ప్రతి ఒక పేజీలోనూ మీ యొక్క ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒకదానికొకటి పోటీగా ఉంటున్న వ్యాసాలు, కథలు, సీరియల్స్, శీర్షికలు ఉన్న పత్రిక 'స్వాతి'.

మా నాన్నగారు అనేవారు "నేనిది ఎందుకు చెయ్యలేను? చెయ్యగలను? అని ఏ పనినైనా ప్రారంభించండి. తప్పక జయం కలుగుతుంది" అని. అదే పట్టుదల మీ కృషిలో కనబడింది. విజయం సాధించడానికి ఎటు పయనించాలో తెలిసిన వ్యక్తి మీరు.

ఇప్పుడు అందరూ మీ ఘనవిజయాల గురించి మాట్లాడుకుంటుంటే 'ఇంకా విజయం సాధించాననుకోవడంలేదు, ఇంకా సాధించాల్సింది చాలా ఉంది' అని అనడం మీ నిరాడంబరతకి నిదర్శనం.

కాబట్టి మీరు సాధించాలనుకున్న విజయాలను సాధించి పత్రికా రంగంలో కొత్త చరిత్ర సృష్టించి, మీ లక్ష్యం చేరుకోవడంలో సఫలీకృతుల వ్వాలని నా కోరిక.

'నేనే స్వాతి - స్వాతే నేను' అనుకుని దానికోసమే ప్రతీ క్షణం కృషి చేస్తున్న మిమ్మల్ని మనసారా అభినందిస్తున్నాను.

కందుకూరి వెంకట మహాలక్ష్మి న్యూఢిల్లీ
29.1.2010



కీలకమలుపు రజతోత్సవ పొద్దుపొడుపు

మీరు సాధించిన విజయాలు భావితరాలకు మార్గదర్శకాలు. ఇక మీరు చిలకరించిన 'స్వాతి చినుకులు'ను నేను ఎప్పటికీ మరిచిపోలేను. అవి నా మనసును అంత సున్నితంగా, హృద్యంగా స్పృశించాయి.

సంపాదకీయాలకు నిత్యజీవితాంశాలను ఎంచుకోవటంలోనే మీ ప్రత్యేకత గోచరిస్తుంది.అల్పపదాలతో అనల్పభావాలను ఆలోచన రేకెత్తించేలా చెప్పగలగడం మీకే చెల్లింది.

జీవితాన్ని కాచి వడబోసి, వ్యక్తి వికాసానికీ, వ్యక్తిత్వ వికాసానికీ అందించిన అమృతగుళికలు 'స్వాతి చినుకులు'.

స్వాతికి అప్పుడే పాతికేళ్ళా అనేవారు ఎందరో ఉంటారు. కాని ఒకటి నిజం. ఈ జీవిత గమనంలో మరెన్ని లక్ష్యాల సాధన మిగిలివుందో మీలాంటి కార్యదక్షులు తరచి చూసుకునేందుకు అనువయిన కీలకమలుపు- స్వాతి రజతోత్సవ పొద్దుపొడుపు.

అందుకే 'స్వాతి' లక్షలాది తెలుగు ప్రజల జీవితంలో ఒక భాగం.

మెరుగైన ఆరోగ్యంతో,పదునైన ప్రణాళికతో మీరు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ...

రామోజీరావు హైదరాబాద్
5.2.2010

తెలుగు సారస్వత పత్రికలలో తలమానికం

ఏ రచయితకైనా తనదైన ఓ శైలీ, దృక్పథం వుంటాయి. వాటిద్వారా అతను కీర్తిప్రతిష్ఠలు గడిస్తాడు. అటువంటి అనేకానేకమంది లబ్ధప్రతిష్ఠుల రచనల బాగోగుల్ని, తన పాఠకుల అభిరుచుల్ని తులనాత్మకంగా సమీక్షించగలవాడు 'సంపాదకుడు' అనడానికి అర్హుడు. పైగా కొత్తగా కలంపట్టి అపూర్వ ప్రయోగాలు చేస్తున్నవారిని వెలుగులోకి తేవలసిన బాధ్యత కూడా సంపాదకుడిదే. అందులోనే విజయ కీలకమూ కలిగి వున్నవాడు ఉత్తమ సంపాదకుడు.

కాబట్టి ఎడిటర్ స్వయంగా కొమ్ములు తిరిగిన రచయిత కానక్కర లేదు. రచయితలంతా ఎడిటర్‌లుగా రాణించే అవకాశం లేదు. రచయిత వ్యక్తిగత ప్రతిభతో రాణిస్తాడు. ఎడిటర్ అనేకమంది ప్రతిభా వ్యుత్పత్తుల్ని విజయపతాకలుగా చేసుకుని స్వయంకృషితో విజయం సాధిస్తాడు.

ఎవరి రంగంలో వారు గొప్పే అయినా అనేకమంది గొప్పదనాల్ని సమీకరించే ప్రతిభ సంపాదకులకే అవసరం. ఈ విశ్వాసాలతో తెలుగు సారస్వత పత్రికారంగంలో నిత్యనూతన ప్రయోగాలు చేస్తూ ముందంజవేస్తున్న సమర్థుడు శ్రీ వేమూరి బలరామ్.

రచయితలకు అధిక పారితోషికాలు ఇవ్వడంలో, నవలల, కథల పోటీలు నిర్వహించడంలో 'స్వాతి' కొత్త ఒరవడులు ప్రవేశపెట్టింది.

ఇలా ఎప్పటికప్పుడు నూతన ప్రయోగాలను చేస్తూ ఆధునిక తెలుగు సారస్వత పత్రికలలో తలమానికం అనిపించుకుంటున్న 'స్వాతి' బలరామ్ గారు, పత్రికా నిర్వహణను అసిధారావ్రతంగా పాటించడం లోని త్రికరణశుద్ధికి ప్రతీక.

శ్రీహరిరావు జనత, విజయవాడ
12.2.2010



ఎంటర్‌టైనింగ్ అండ్ ఎన్‌లైటనింగ్ వీక్లీ

వారంతర్వాత వారం ఒక్కో పేజీ తిప్పుతుంటే ఆహ్లాదం,పరిమళాలు నిండిన పిల్లగాలులు మిళితమైన తాజాదనం 'స్వాతి'లో కనిపిస్తుంది. లక్ష్యం పట్ల ఏకదీక్ష, పరిపూర్ణభక్తితో కష్టించి పనిచేయడమే విజయానికి మార్గాలని బలరామ్ గారు ప్రపంచానికి మరోమారు చాటిచెప్పారు.

ఒక్క ప్రతిభని మాత్రమే వెచ్చిస్తే చాలదు- విజన్, ప్లానింగ్, పొందికైన ప్రయత్నం, పాఠకుడి దృక్పథంపై సరైన అవగాహన, సమాచారం, ప్రస్ఫుట వైఖరి-ఇవన్నీ పత్రికా సారథ్యంలో అవసరం.

యోగ్యమైన వనరులతో బలరామ్‌గారు 'స్వాతి' వారపత్రికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. 'స్వాతి'-'బలరామ్' ఈ రెండు పదాలు విడదీయలేనివి, విడదీయరానివి. తన పత్రికపట్ల అంతులేని భక్తి, నిబద్ధత, 'స్వాతి' ఎదుగుదల, అభివృద్ధే విజయలక్ష్యంగా ఆయన కనబరిచే నిజాయితీ తిరుగులేనివి. వీటన్నింటి ద్వారా తెలుగు వార పత్రికా ప్రపంచంలో బలరామ్ గారు చరిత్ర సృష్టించారు.

మన సంస్కృతీ, సంప్రదాయ విలువలతో, విజ్ఞానం, వినోదం అందించే మరిన్ని విభిన్న అంశాలతో తెలుగు పాఠకుల సేవను బలరామ్ గారు కొనసాగించడానికి సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం, సంపదలతో దీర్ఘాయుష్మంతులు కావాలని కోరుకుంటున్నా.

పాఠక దేవుళ్ళుగా బలరామ్ గారు పరిగణించే పాఠకులు ఆయనకు నిజమైన గైడ్స్, 'స్వాతి'ద్వారా ఆయనందించే అనేక విషయాలు పాఠకుల మానసిక దాహార్తిని, అవసరాల్ని తీర్చి సంతృప్తిపరుస్తున్నాయి.'స్వాతి' తెలుగు పాఠకులకు ఎంటర్‌టైనింగ్ అండ్ ఎన్‌లైటనింగ్ వీక్లీ!

ఎన్.ఆర్.చందూర్ చెన్నై
19.2.2010

తెలుగు పత్రికకు పట్టాభిషేకం

తెలుగుపత్రికా సామ్రాజ్యానికి మణిహారం, అత్యంత ప్రజాదరణ పొందిన వారపత్రికా చక్రవర్తి, ఆయనే స్వాతి సపరివార పత్రికా సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్ గారు.

వేమూరి బలరామ్ గారిని తెలుగు పత్రికా సామ్రాజ్యానికే ఒక మకుటంలేని మహారాజుగా 'మేగజైన్ మొఘల్' అన్న అపూర్వమైన బిరుదుతో ఉత్తర అమెరికా తెలుగు సంఘంవారు సత్కరించటం ఆయన పరిపూర్ణమైన అర్హతలకు గుర్తింపని చెప్పటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

వేమూరి బలరామ్ గారు అనేక పర్యాయములు మన ప్రధానులు, రాష్ట్రపతుల వెంట అధికార ప్రతినిధుల బృందంలో సభ్యునిగా పర్యటించడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.

ప్రతివారం మేలిమి ముత్యాలను సేకరించి వాటిని 72 పేజీలున్న స్వాతిముత్యంగా తెలుగు పాఠకదేవుళ్ళకు వారం వారం అందించడం ఒక్క బలరామ్ గారికే చెల్లింది.

అందుకే 'స్వాతి' సపరివారపత్రిక అత్యధిక సర్క్యులేషన్ గల ఏకైక తెలుగు వారపత్రికగా ఎనలేని గౌరవాన్ని పొందుతోంది.

'స్వాతి' పత్రిక దిగ్విజయంగా 25 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 26వ సంవత్సరంలోనికి నిండుజవ్వనిగా అడుగుపెట్టిన సందర్భంగా పాఠకుల ఆదరాభిమానాలను మరింతగా అందుకొని, మరెన్నో జైత్ర యాత్రలను దిగ్విజయంగా సాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...

జొన్నలగడ్డ వెంకటరత్నం విశాఖపట్నం
26.2.2010



ఎదురుచూసిన ఆనందం

సూర్యుని నులివెచ్చని కిరణాలు భూమిని తాకుతున్న వేళ
అక్కడందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.
తను ఈ రోజే రావాలి. ఇప్పటికే తను వచ్చి వారమయింది.
ప్రతి ఒక్కరిలోనూ ఆత్రుత
పిల్లలు, యువతీయువకులు, మగువలు, మగాళ్ళు
సీనియర్ సిటిజన్స్ అందరిదీ అదే పరిస్థితి.
మగువల మనసు చేసే వంటపై లేదు.

ఇంటి యజమాని చేతులు వెనక్కు పెట్టుకుని అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆ ఇంటి గారాలపట్టి ప్రతినిమిషం వీధిగుమ్మం లోకే చూస్తోంది.

తాతయ్య బామ్మ సహాయంతో వచ్చి అరుగుపై కూర్చున్నాడు.
మెలుకువొచ్చిన నేను గడియారం వైపు చూస్తున్నాను.
డ్యూటీ అయిపోయిన నైట్ వాచ్‌మేన్ వెళ్ళడం లేదు.
'నేనూ తనను చూసెళ్తా బాబుగారు' అంటున్నాడు.
ఉన్నట్టుండి అక్కడి వాతావరణం చల్లగా మారింది.
గారాలపట్టి పెదవులపై చిరునవ్వు మెరిసింది.
అందరూ అటువైపు పరుగెత్తారు. ఆ రోజు గురువారం.

ఆమె వచ్చేసింది. తను ఎవరో కాదు, అణువణువునా తెలుగుదనం ఉట్టిపడే ప్రతి తెలుగింటి ఆడపడుచు 'స్వాతి' సపరివార పత్రిక.

స్వాతికోసం ఎదురుచూడటంలో ఉండే ఆనందమిది.
ప్రతివారం నాకెదురయ్యే అనుభవమిది.

ఆర్.సతీష్ *గుంటూరు*
5.3.2010


నిత్యనూతనం 'స్వాతి' సొంతం

డాక్టర్ ఆరుద్ర 'పైలాపచ్చీసు' గురించి ఎప్పుడో రాశారు. మరి ఆ వయసు, ఆ ప్రత్యేకత అటువంటిది. అయితే ఎదిగేకొద్దీ మరింత సౌజన్యం, స్నేహానుబంధం పాఠకులతో పంచుకొంటూ, పెంచుకుంటూ దూసుకొని వెళ్ళే 'స్వాతి'కి మనసారా అభినందనలు.

పాతికేళ్ళ క్రితం స్వాతిపై అభిమానం కలిగింది. అది రాను రానూ బంధమైపోయింది.ఎప్పటికప్పుడు కొత్తదనం సంతరించుకుంటూ ఉపయుక్తమైన ఫీచర్లతో ఆబాలగోపాలాన్నీ కట్టిపడేసే కుటుంబంలోని వ్యక్తిగా కలిసిపోయింది. 'స్వాతిచినుకులు' చాలు లోకానికి పదివేలు. అంతకుమించినది 'స్వాతి' సపరివార పత్రిక.

అహో? వారపత్రికా చరిత్రలో 'స్వాతి' అక్షరాలు సువర్ణాక్షరాలతో ఉంటాయి. రజతోత్సవ వేడుకల్ని జరుపుకున్న తెలుగింటి ఆడపడుచు 'స్వాతి' మరి స్వర్ణోత్సవాలు, తదితరోత్సవాలూ జరుపుకుంటూ పాఠకులను పులకింపజేయగలదని ఆశిస్తూ 'స్వాతి' కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.


డా॥ చక్రపాణి యిమ్మిడిశెట్టి *అనకాపల్లి*
12.3.2010



అలరించేది....ఆడించేది...పాడించేది

గోపీ చేతిలోని 'ముద్దబంతి'
రాధ కళ్ళల్లోని 'కాంతి'
ఆంధ్రులు మెచ్చిన 'స్వాతి'
బలరామ్‌గారి ఇంటి 'ఖ్యాతి'
పత్రికారంగంలో 'అధిపతి'
రసజ్ఞులకు శోభనపు 'పడతి'
సాహితీలోకంలో ఓ 'చైతన్య స్రవంతి'
చదవకపోతే ఏదో 'అశాంతి'
చదివేకా మనసుకి ఎంతో 'ప్రశాంతి'
ఒక్క మాటలో చెప్పాలంటే
స్వాతి పాఠకులకో 'బహుమతి'
అయితే...
పాఠకుల మనసాక 'కోతి'
వారిని అలరించేది...ఆడించేది...
పాడించేది... 'స్వాతి'
అందుకే...
పాఠకులకు ఎంతో 'ప్రీతి'
ఎల్లలు లేనిది స్వాతి 'ప్రఖ్యాతి'
సాధించాలి ఇంకా ఎంతెంతో 'ప్రగతి'

సోమవరఝల నాగేంద్రప్రసాద్ వారణాసి
19.3.2010



ఋషిలా తపస్సు చేసే ఏకాగ్రత కావాలి

స్వాతితో నా ఆత్మీయత ఈనాటిది కాదు.

బలరామ్ గారు ఎన్నో ఏళ్ళ నుంచి నాకు తెలుసు.

స్వాతి ప్రారంభం నుండి నాకు తెలుసు.

స్వాతి సపరివార పత్రిక ప్రారంభ సంచికలో నా సీరియల్ ప్రచురింపబడటం నాకిప్పటికీ గుర్తే.

ఒక సంస్థను ప్రారంభించడం చాలా తేలిక. దానిని నిలబెట్టడం చాలా కష్టం. నిలబెట్టాలీ అంటే ఆ వ్యక్తికి ఋషిలా తపస్సు చేసే ఏకాగ్రత కావాలి.

రెండోది కూలీమనిషి ఎండలో ఇటుకలు మోసేటంతటి కష్టాన్ని భరించగలిగే శక్తి కూడా కావాలి.

మూడోది తల్లిలా అందర్నీ చూసుకొనే ప్రేమపూరిత మనస్సు కావాలి.

ఈ మూడూ వేమూరి బలరామ్ గారిలో ఉన్నాయి కాబట్టే 'స్వాతి' తెలుగు పత్రికారంగంలో ధ్రువతారగా వెలుగొందుతోంది.

తెలుగుభాష ఉన్నంత కాలం 'స్వాతి' ఇలా తన వెలుగును ప్రసరిస్తూనే ఉండాలని కోరుకుంటున్నాను.

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి హైదరాబాద్
26.3.2010



మనసును ముత్యంలా మార్చే 'స్వాతి'

స్వాతి సపరివార పత్రికను మీరు అనేక సంవత్సరాల నుండి విజయవంతంగా నడిపిస్తున్నారు. మీ పత్రికకు 'స్వాతి' అన్న పేరు ఎన్నికలో చాలా విశేషం దాగివుంది. ఎందుకంటే ఆకాశం నుంచి పడే వర్షపు నీరు మురికికాలువలో పడితే మురికినీరవుతుంది, కాలిన ఇనుముపై పడితే ఆవిరవుతుంది, సముద్రంలో పడితే ఉప్పునీరవుతుంది, నదిలో పడితే మంచినీరవుతుంది, తామరాకుపై పడితే ముత్యపు నీరవుతుంది, అదే నీరు స్వాతి చిప్పలో పడితే ముత్యమవుతుంది.

అలాగే పాఠకులు మీ పత్రికను చదివితే వారి మనసు స్వచ్ఛమైన ముత్యములాగా మారుతుంది అనుటలో ఎలాంటి సందేహం లేదు. ఒక కుటుంబంలో అనేక వయసులవారుంటారు. అయినా వారంద రికీ మీ పత్రికలో కావలసింది లభిస్తుంది.

అందుకే మీ పత్రిక వడ్డించిన విస్తరిలాంటిది. ఎవరికి ఏది కావాలంటే దానిని స్వీకరించి తృప్తిచెందవచ్చు... అందుకే మిమ్ములను మనసారా అభినందిస్తున్నాను.

బి.వెంకటయ్య మహబూబాబాద్
2.4.2010

అలుపెరుగని సాహితీ ప్రయాణం

తెలుగువారందరికీ ఆత్మీయమైన, ఇష్టమైన పేరు 'స్వాతి'. స్వాతి అనగానే స్ఫురణకు వచ్చే వ్యక్తి శ్రీ వేమూరి బలరామ్.


తెలుగుభాష, సంస్కృతీ సంప్రదాయాల శ్రేష్ఠతను వాస్తవిక స్ఫూర్తితో వర్ణిస్తూ అలుపెరుగని తెలుగు సాహితీ ప్రయాణం సాగిస్తున్నది స్వాతి. అందుకే స్వాతికి ఎంతో ప్రాచుర్యం, అంతులేని ఘనత.

సాహిత్య విలువల పరిధి స్వర్గపుటంచుల్ని అధిగమిస్తుంటే, సముద్రపు లోతుల్లోకి వెళ్ళిన అనుభూతిని అందిస్తోంది స్వాతి. చదవనేర్చిన ప్రతివ్యక్తి చేతిలోనూ చక్కగా ఇమిడిపోతుంది స్వాతి.

స్వాతి ప్రాచుర్యం, వేమూరి బలరామ్‌గారు తెలుగుభాషకు చేస్తున్న సేవలు కలకాలం కొనసాగుతూ, తిరుగులేని గుర్తింపును పదికాలాల పాటు పదిలపరుచుకోవాలి.

శ్రీ వేమూరి బలరామ్‌గారు సుఖసంతోషాలతో ఉండాలని, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, ఈ గురుతరబాధ్యతను సాగించే శక్తి ఇలాగే కొనసాగాలని మనసారా కోరుకుంటున్నాను.

గిరీష్‌కుమార్ సంఘీ హైదరాబాద్
9.4.2010



స్వాతి ప్రశస్తి

స్వాతి అంటే గాయత్రీ మంత్రం, సూర్యునిభార్య సంజ్ఞాదేవి. ఈమెకే ఛాయాదేవి అని మరోపేరు. స్వాతి అంటే సరస్వ(స్వా)తి. స్వాతి అంటే సాంత్వనము. ఇక స్వాతినక్షత్రం, స్వాతి చినుకు అందరికీ తెలిసినవే!

పరమ శ్రద్ధాసక్తి పఠియించువారల
గాయత్రి మంత్రమై కాచు స్వాతి!
విశ్వవీథులలోన విహరింప సంజ్ఞగా
వెలుగు ఛేనికి వెంట నిలుచు స్వాతి!
నక్షత్రముల మహానక్షత్రముగ తోచి
వాయుదేవకమయి వఱలు స్వాతి!
చిన్కు పడంతిగా చేరి ముత్తెపు చిప్ప
మిలమిల ముత్యమై మెఱయు స్వాతి!
పత్రికలకెల్ల తానొజ్జ బంతి యగుచు
దినదినాధిక ప్రాచుర్యమును గడించి
పడసె నేటికి రజతోత్సవ ప్రశస్తి!
పడయు గావుత స్వర్ణోత్సవ ప్రశస్తి!

డా॥ కాసల నాగభూషణం చెన్నై
16.4.2010

అరుదైన ప్రగతి

శ్రీ వేమూరి బలరామ్, స్వాతి ఒక్కరే. ఆంధ్రప్రదేశ్‌లో పేరెన్నిక గన్న కుటుంబ పత్రిక స్వాతి. శ్రీ వేమూరి బలరామ్ గారు మేగజైన్ జర్నలిజంలో అనేక కొత్త ఒరవడులు ప్రవేశపెట్టారు. తక్కువ సమయం లోనే అఖిలభారతస్థాయిలో స్వాతిని నెంబర్ వన్ స్థాయికి తీసుకువెళ్ళారు. స్వాతి సాధించిన అరుదైన ప్రగతి ఇది.

శిఖరాగ్రాన్ని చేరడం సులువు కావచ్చు కాని, నెంబర్ వన్ స్థానాన్ని ఎప్పుడూ సుస్థిరపరుచుకోగలగడం స్వాతి ఘనత. ఇది శ్రీ వేమూరి బలరామ్‌గారి వల్ల మాత్రమే సాధ్యపడింది. ఆయనలోని దూరదృష్టిని, నాయకత్వ లక్షణాలను మనసారా ప్రశంసిస్తున్నాను.

ఆయన రచించిన 'స్వాతి చినుకులు' సాహిత్య తునకలు. వీటిని అనుసరిస్తే భావితరాలవారు మంచికి మారుపేరవుతారు. మానవతా స్ఫూర్తిని, జీవితంలో ప్రతి కోణాన్నీ 'స్వాతి చినుకులు' స్పృశిస్తాయి. ఇందులోని అంశాలు ఆచరణీయాత్మకమైనవి. వీటినుంచి సాంత్వన లభిస్తుంది. అనేక కష్టనష్టాల నుంచి బయటపడేందుకు సగటుమనిషికి ఇవి సహకరిస్తాయి.

సగటువ్యక్తి ప్రయోజనార్థం వెలకట్టలేని 'స్వాతి చినుకులు' పుస్తకాన్ని ప్రచురించిన శ్రీ వేమూరి బలరామ్ గారు కృతార్థులు. ఆయన భవిష్యత్ కార్యక్రమాలు గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

ఐ.వెంకట్ హైదరాబాద్
23.4.2010



విలువలున్న పత్రిక

ఒక పత్రిక యొక్క విలువలు, మంచిచెడ్డలు నిర్ణయించేది పాఠకులు.

ఒక పత్రిక చేతిలో ఉంటే - ఉత్తమాభిరుచిగల పాఠకుడనే అభిప్రాయం ఎదుటివారిలో కలిగించే పత్రికే ఉత్తమ పత్రిక. అటువంటి విలువలున్న పత్రిక 'స్వాతి'. స్వాతి చేతిలో ఉన్నా, ఎవరింట్లో ఉన్నా, ఎక్కడ ఉన్నా ఆ అందమే అందం.

సాధారణంగా ఒక పత్రిక ఉన్నతస్థానానికి చేరుకున్నప్పుడు ఎవరికైనా ఈర్ష్య కలుగుతుంది. కాని ఆ పత్రిక స్థాయికి చేరుకోవాలనే పట్టుదల, దాని అడుగుజాడల్లో నడవాలనే ఆలోచన ఎదుటి పత్రికలకు కలిగించింది 'స్వాతి' తాను ఎదుగుతూ.

అందుకే సపరివార పత్రిక అయింది. మానవతా విలువలు ఉన్న పత్రికగా పేరుపొందింది. 'స్వాతి ఆరంభిస్తుంది ఇతర పత్రికలు అనుసరిస్తాయి' అని మహాకవి శ్రీశ్రీతో ప్రశంసించబడింది.

స్వాతి పాఠకదేవుళ్ళ ఆదరాభిమానాలే మాకు శ్రీరామరక్ష అని చెప్పడం వేమూరి బలరామ్ గారు నిగర్వి అనడానికి ప్రతీక.

తెలుగు పాఠకుల రసిక హృదయాలలో 'స్వాతి' ఎప్పటికీ నిలిచి ఉండాలని కోరుకుంటూ...

తంపర గంగాభవాని తణుకు
30.4.2010

మారుతతుల్యవేగం 'స్వాతి'ది

తెలుగు వెలుగు విస్తరణకు ఇనుమిక్కిలిగా తోడ్పడుతోంది 'స్వాతి'.

'స్వాతి' సపరివార పత్రిక అంచెలంచెలుగా ఎదిగి, ఈనాడు శిఖరాగ్రానికి చేరుకుందంటే, అందుకు మీ కృషి, దీక్ష, పాఠకుల అభిరుచుల పట్ల పరిపూర్ణావగాహనలే కారణం. అందుకే అశేష ఆంధ్రుల హృదయాల్లో మీరూ, 'స్వాతి' సపరివార పత్రిక అపురూపమైన, అభిమాన పూర్వకమైన స్థానం సముపార్జించగలిగారు.

'స్వాతి చినుకులు' మీ సర్వతోముఖ పరిజ్ఞానానికీ, అభివ్యక్తి సారళ్యానికీ ప్రతీకలు. 'కాదేదీ సంపాదకీయానికనర్హం' అని నిరూపించే మీ సంక్షిప్త సంపాదకీయాలు విషయ వైవిధ్య సంభరితాలు. తటిల్లతల్లా ప్రకాశిస్తాయి. ఆలోచింపచేస్తాయి.

మీరు రాష్ట్రపతి, ప్రధానులతో పలుసార్లు విదేశీ పర్యటనలకు తెలుగు వారపత్రికల ఏకైక ప్రతినిధిగా ఎన్నుకోబడడం అపూర్వ గౌరవం. ఆ పర్యటనల పదచిత్రాలు మీ పరిశీలనా నైశిత్యానికి దర్పణం.

అసంఖ్యాకమైన పురస్కారాలతోపాటు, ప్రతిష్ఠాత్మకమైన తానా అవార్డు 'తెలుగు మేగజైన్ మొఘల్' మిమ్మల్ని వరించడం తెలుగుజాతి గర్వించదగ్గ విషయం. 'స్వాతి' మనోజవంతో, మారుతతుల్యవేగంతో పరుగులు తీస్తూనే ఉండాలని కోరుకుంటూ...

పి.ఎస్.రావు సోమవరం
7.5.2010



ఆహ్లాదకరమైన అద్భుతదీపం

జనావళికి విజ్ఞానం, వికాసం, వినోదం పంచే పత్రిక స్వాతి.

ఈ భువనైక మందిరంలో స్వాతి సపరివార పత్రిక ఆహ్లాదకరమైన అద్భుతదీపం. ఈ అద్భుతదీపానికి అధిపతి వేమూరి బలరామ్ గారు. స్వాతి తెలుగు పత్రికా రంగానికి కరదీపిక.

స్వాతి సంపాదకులుగా బలరామ్ గారు భారత రాష్ట్రపతులు, ప్రధానులతో ప్రపంచ పర్యటనలు చేశారు. 'స్వాతి' ప్రపంచం చుట్టివస్తే ఆంధ్రుల ఖ్యాతి ప్రపంచం చుట్టివచ్చినట్టే.

ఇక 'స్వాతి చినుకులు' గురించి చెప్పాలంటే- అసలే యాంత్రిక యుగం.అందులోనూ పరుగులెత్తే ప్రపంచం ఆపైన ప్రతిక్షణం ఏమవుతుందో అని మనసుపడే ఒత్తిడి... పర్యవసానంగా గమ్యం తెలీని విచిత్ర పరిస్థితి- అలా వేడిసెగల జీవితాసనంమీద నిట్టూర్చుతూ, బాధపడుతూ, భంగపడుతూ, బెంగపడుతూ కూర్చున్నప్పుడు 'స్వాతి చినుకులు' చదివితే ఆ వేడి చల్లారి మనసుకి రిలీఫ్ కలుగుతుంది.

ఈ స్వాతి చినుకులు మనిషిని చీకటినుండి వెలుతురులోకి-నిరాశ నుండి ఆశలోకి- స్తబ్దత నుండి జాగృతిలోకి- అశక్తతనుండి శక్తిలోకి- అగమ్యం నుండి గమ్యంలోకి తీసుకువెళతాయి.

అలా చెప్పుకుంటూపోతే అన్నీ జీవితం అనే స్వాతి చిప్పలోకి రాలిన చినుకులే- అన్నీ ఆణిముత్యాలే.

స్వాతి అన్ని కోణాల్లోనూ పాఠకుడ్ని చైతన్యవంతుడ్ని చేస్తూ ముందుకు పోవాలనీ, సారస్వత సువాసనల్ని వెదజల్లుతూనేవుండాలని మనసా, వాచా, కర్మణా కోరుకుంటూ...

బొల్లిముంత నాగేశ్వరరావు తెనాలి
14.5.2010



డైనమిక్ ఎడిటర్

ఆత్మవిశ్వాసానికి, మేధస్సుకి, నిరంతర కృషికి నిదర్శనం వేమూరి బలరామ్ గారు.


స్వాతి ఆవిర్భావంనుంచి గమనిస్తే బలరామ్‌గారిలో గల పై మూడు కారణాల ఫలితమే స్వాతి ఈ స్థితిలో ఉండటానికి కారణం.

ఒక పత్రిక స్థాపించాలంటే ఆ వ్యక్తికి కాలంతో పాటు పరుగెత్తే మనసు కావాలి, పాఠకుడిని మనోనేత్రంతో చూసే లక్షణం ఉండాలి, డైనమిక్‌గా ఉండాలి. ఇవన్నీ వేమూరి బలరామ్‌గారిలో ఉన్నాయి కాబట్టే ఆయన డైనమిక్ ఎడిటర్ అయ్యారు.

ఒకప్పుడు మనసు వికలమైనప్పుడు సాంత్వనకోసం భగవద్గీతని వెదికేవాడిని. ఇప్పుడు 'స్వాతి చినుకులు' చదువుతుంటే చాలు ఏదో ఒక అంశం సమాధానం అవుతోంది. ఓదార్పు లభిస్తోంది. భవిష్యత్తుకు ఓ చక్కని మార్గం చూపే గురువు 'స్వాతి చినుకులు' పుస్తకం.

'శ్రమయేవ జయతే' అన్న సూక్తికి 'స్వాతి' సాక్షిగా నిలవాలని కోరుకుంటూ...

పాయసం సుబ్రహ్మణ్యమహర్షి నెల్లూరు
21.5.2010



స్వాతికి శక్తిసామర్థ్యాలు వచ్చేశాయి

స్వాతి సపరివార పత్రిక మాకు ప్రియమైన పత్రిక.

'ఇంతింతై వటుడింతయై...' అన్నట్టు స్వాతి సపరివార పత్రిక తెలుగు పత్రికా ప్రపంచంలో అగ్రస్థానానికి ఎదిగింది అంటే అందుకు కారణం వేమూరి బలరామ్ గారి డైనమిజమ్.

ఇంత ఎదిగిన తర్వాత వేమూరి బలరామ్ గారి మీద, స్వాతి సపరివార పత్రిక మీద గురుతరమైన బాధ్యత మరింత పెరిగింది. ఆ బాధ్యతను గుర్తించారు కాబట్టే స్వాతి ద్వారా లోకం తీరు, మానవ మనుగడ మొదలైన అంశాలపై పన్నీటి జల్లులలాంటి చినుకులు అందించి మానవ వికాసానికి తోడ్పడుతున్నారు.

స్వాతిలో అనేక ఆకర్షణీయమైన పద్ధతులున్నాయి.

దినపత్రికలతో పాటూ ప్రజలకు కొత్త మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత వారపత్రికలమీద కూడా ఉంది. అందులోనూ మన సమాజం, ప్రజలు గందరగోళంలో, దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దిక్కు చూపించాల్సిన బాధ్యత పత్రికలమీద ఉంది. కొత్త ఆకర్షణలతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా, మార్గదర్శకంగా పత్రికలను నడపాలి.

బలరామ్ గారూ! మీరు తప్పకుండా అలా నడపగలరని, సపరివార పత్రికకు ఆ స్థాయి, ఆ శక్తి వచ్చాయని, ప్రతి వారం చదివే పాఠకు డిగా నేను విశ్వసిస్తున్నాను. నేను ఊరికినే తేలిగ్గా ఎండుటాకులా గాలికి కొట్టుకుపోయే మనిషిని కాను. వయసునుబట్టి నాకూ ఏదో కొంత పరిపక్వత ఏర్పడింది.

ఆ శక్తి ఈ సపరివార పత్రిక నాడుల్లో ఉంది. ఆ శక్తినింకా పుంజుకొని, ఇంకా ఇంకా సర్క్యులేషన్ పెంచుకొని, వారపత్రిక అంటే, 'ఇదే ఆదర్శమైన సపరివార పత్రిక' అని మెచ్చుకోబడాలని బలరామ్‌గారికీ, పత్రికకీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

జస్టిస్ ఆవుల సాంబశివరావు హైదరాబాద్
28.5.2010



బలరామ్ దీక్షాదక్షత గలరామ్

ఆనాడు మీరు స్వాతి వారపత్రిక తేవాలని తలపెట్టినప్పుడు మేము భయపడ్డాము. ఆంధ్రపత్రిక, జ్యోతి, ప్రభల వంటి పెద్ద పెద్ద సంస్థలకే వీక్లీ సమస్యగా ఉంటున్నదనీ - ఒక్క వ్యక్తికి అది శక్తికి మించిన పని అనీ హెచ్చరించాము.

ఇవాళ ఆ వ్యక్తి శక్తి విశ్వరూపం చూసి - కాస్త మా అంచనా గురించి సిగ్గుపడినా - మా మిత్రుడు సాధించిన విజయానికి చాలా గర్వపడుతున్నాము.

బలరామ్ దీక్షాదక్షత

గలరామ్ కావుననె వలచె కీర్తిలలామాః

స్వాతి ఎప్పటిలాగే మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తూ...

బాపు రమణ చెన్నై
4.6.2010

అక్షరాలా నిజం

'స్వాతి' సపరివార పత్రికను వారం వారం 39.59 లక్షలమంది పాఠకులు చదువుతున్నారంటే 'స్వాతి' అక్షరాస్యతకు చేసిన దోహదం అక్షరాలా నిజం.

బలరామ్ గారూ! మీరు రాసిన 'స్వాతి చినుకులు' చదివాను. పుస్తకానికి సరిపోయే అభిప్రాయాలను పుటలో కుదించడం నిజంగా నేర్పే. మీ ప్రయోగం ఆసక్తికరంగా ఉంది.

'అవసరానికా స్నేహం', 'సూక్ష్మంలోని మోక్షం', 'సువాసన అబ్బిన సొమ్ము' లాంటి రచనల్లో కొత్తకోణాలు కనిపిస్తున్నాయి.

సంక్షిప్త సంపాదకీయాలను ఆ పూటకి పబ్బం గడిపేట్టు కాకుండా, భద్రపరుచుకుని మళ్ళీ చదువుకునేట్టు రాయడం అభినందనీయం.

స్వాతి సపరివార పత్రిక రజతోత్సవం పూర్తిచేసుకున్నందుకు విజయసారథి, 'స్వాతి' సంపాదకులైన మీకు నా అభినందనలు.

డా॥ సి.నారాయణరెడ్డి హైదరాబాద్
11.6.2010



తెలుగుజాతి నిండుగౌరవాన్ని నిలిపారు

స్వాతి ద్వారా మన తెలుగుజాతి నిండుగౌరవాన్ని నిలబెట్టిన ఘనత మీదే బలరామ్ గారూ! ఇది మీకుగాక మరొకరికి సాధ్యమా!

మీ స్వాతి చినుకులు చదివాను. అవి చినుకులుగావు, స్వాతి ముత్యాలు, నిత్యసత్యాలు. నిజజీవితంలో ప్రతి మానవునికీ కలిగే సంఘటనలను పరిశీలనాత్మకంగా విశ్లేషించి, అందుకు solutionను కూడా సూచించిన మీ రచన practical lifeకి ఒక guide.

మీ స్వాతి చినుకు 'ప్రయాణాల్లో తేడా వుంది' శీర్షిక చాలామందిలో ఉన్న ఒక బలహీనత లేక సంస్కారలోపం. 'సంబోధనలు సవ్యంగానే వుండాలి' అన్న శీర్షికలో మీ సూచన దాదాపు ప్రతివ్యక్తీ cultivate చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అలాగే, మీ చినుకులు అన్నీ successful social lifeకి ముత్యాలే.

మీ స్వాతి చినుకులు 'మీ జీవితం' - మీ సామాజిక దృక్పథానికి ఒక దర్శనం అయితే, దేశాధినేతలతో మీ విదేశీ పర్యటనలు, మీ అనుభవాలు మీ జీవితాన్ని మరొక కోణంలో విశ్లేషించే నిదర్శనం.

స్వాతి బలరామ్‌గా మీ కీర్తిప్రతిష్ఠలు ఏ విజయవాడ నగరానికో లేక కృష్ణాజిల్లాకో, ఒక రాష్ట్రానికోగాక అంతర్జాతీయంగా వికసించి మన తెలుగువాడి కీర్తిపతాకాన్ని ఎగురవేస్తూనేవుండాలని కోరుకుంటున్నాను.

వై.లోకనాథశర్మ విజయవాడ
18.6.2010

స్వాతి యజ్ఞం మొదలై 40 ఏళ్ళు

పత్రికలు చదివే అలవాటు అంతంతమాత్రంగా ఉన్న తెలుగు నాట ఒక మాసపత్రిక నాలుగు దశాబ్దాలుగా, ఒక వారపత్రిక రెండున్నర దశాబ్దాలుగా నిరాటంకంగా నడుస్తుండటం నమ్మలేని నిజం. అబ్బుర పరిచే ఈ వాస్తవం వెనుక వేమూరి బలరామ్ అనే ఒక తపస్వి ఉన్నారు.

చేసే పనిని యజ్ఞంలా చేసుకుపోవడం ఆయనకు అలవాటు.అందు వల్లే ప్రతి గురువారం వారపత్రిక, ప్రతి నెలా మాసపత్రిక ఈ వారంలోనే, ఈ నెలలోనే కొత్తగా మార్కెట్‌లోకి వచ్చాయన్నంత నిత్యనూతనంగా కనిపిస్తుంటాయి.

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందిస్తూ కుటుంబానికి, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే ఎన్నో విషయాలను ప్రతి వారం, ప్రతి నెలా మోసుకొస్తున్నాయి స్వాతి వార, మాస పత్రికలు.

పత్రిక పెట్టడం దుస్సాహసమవుతుందని కొందరు శ్రేయోభి లాషులు ఎంత వారించినా... 'ఆ... ఆయనవల్ల ఏమవుతుంది. మహా మహులే నిలబడలేదు' అని విమర్శకులు అభిప్రాయపడినా...బలరామ్ వెనకడుగువేయకుండా ముందుకే వెళ్ళారు.

ఆ ముందడుగు తెలుగింటికి ప్రగతి సోపానంగా మారింది. ఎన్నో సందేహాలకు సమాధానాలిచ్చింది. ఎవరికీ చెప్పుకోలేని బాధల్ని తొల గించింది. అపోహల్ని పటాపంచలు చేసింది. విజ్ఞాన వీచికలు పారించింది. ఆలోచనాశక్తిని ఇనుమడింపజేసింది.

'నేను ఎవరినీ, దేనినీ పోటీ అనుకోను. మనం నమ్మిన పనిని త్రికరణ శుద్ధిగా చేస్తే చాలు. ఫలితం దానంతట అదే వస్తుందనేది నా నమ్మకం'' అంటారు వేమూరి బలరామ్.

వారంలో ఒకరోజు టీవీని పూర్తిగా ఆపేసి స్వాతి వార, మాసపత్రిక లను చదవండి. విజ్ఞానం, వినోదం కలగడంతోపాటు భాషపైన కూడా అవగాహన వస్తుంది. పదసంపద పెరుగుతుంది.

పదసంపద పెరిగితే మీ మాట వినసొంపుగా ఉంటుంది. అంతేకాదు మీ పిల్లలకు తెలుగు భాష గురించి ఎంతో కొంత నేర్పించడానికి మీకు అవకాశం ఏర్పడుతుంది.

ఎప్పటికప్పుడు వినూత్నంగా ఉండే స్వాతి సపరివార పత్రికలో 'నేనెవరో తెలుసా!' అంటూ ఒక శీర్షికను ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలో మహానుభావులుగా కీర్తించినవారి గురించి ఇందులో వివరిస్తారు.వాళ్ళ చరిత్ర మొత్తం చెప్పి వారెవరో చెప్పమని ప్రశ్న అడుగుతారు. విజ్ఞానంతో పాటు బుర్రకు పదునుపెట్టే శీర్షిక ఇది.

స్వాతి మరో నాలుగు దశాబ్దాలు... కాదు కాదు శతాబ్దాలు ఇలాగే పరిఢవిల్లాలని, ఇందుకోసం భగవంతుడు బలరామ్‌కు, ఆయన వారసులకు శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నాను.

యలమంచి చిరంజీవిరావు
కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్
25.6.2010



అదొక అదృష్టం

సాహిత్య మేధస్సు కలిగిన శ్రీ స్వాతి బలరామ్ గారూ, స్వాతి సపరివార పత్రిక 25 వసంతాలు పూర్తిచేసుకున్న శుభసందర్భంలో మీకు మా శుభాకాంక్షలు.

మీతో పరిచయం మాకొక అదృష్టం.

మీతో సంభాషణ మాకొక మరపురాని అనుభూతి.


ఆంధ్రభాషకు పరభాషా జాడ్యం కలుగుతున్న ఈ రోజుల్లో మీరు స్వాతి మాస, వారపత్రికల ద్వారా మాతృభాషకు అందిస్తున్న సేవలు అద్వితీయం, వర్ణనాతీతం.

తెలుగు పాఠకులందరి హృదయాలలో మీరు నింపిన 'స్వాతి చినుకులు' చదివాను.అవి నా హృదయాన్ని ఎంతగానో హత్తుకుపోయాయి. అందులో మీరందించిన విషయాలు ఆలోచనలను రేకెత్తించడమేకాక వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడతాయి.

'స్వాతి చినుకులు' అన్నివయసులవారికీ తరతరాలపాటు ఉప యోగపడతాయి. అందరూ నిధిగా భావించి దాచుకోవాల్సిన పుస్తకం 'స్వాతి చినుకులు'.

ఆ కళామతల్లి, దైవం మీకు ఆయురారోగ్య ఐశ్వర్యాదులు సదా ప్రసాదిస్తూనేవుండాలని, తెలుగుభాషకు మీరు అందిస్తున్న సేవలు ప్రతి తెలుగువారి జీవితాన్నీ మరింత ప్రభావితం చేయాలని, మీరు కలిగిస్తున్న స్పందన తెలుగువారి మనోఫలకముపై చెరగని ముద్ర వేస్తూనేవుండాలని కోరుకుంటూ...

ఎమ్.ఎస్.వి.ప్రసాదరావు హైదరాబాద్
2.7.2010



సంపాదకుడే సుప్రీం

ప్రియమైన బలరామ్ గారూ! స్వాతి సపరివారపత్రిక రజతోత్సవం పూర్తిచేసుకున్నందుకు నా అభినందనలు.

మీరు లక్ష్యాన్ని సాధించారు. మీ విజయం ఇతర పత్రికలకు భిన్నమైంది. ఎందుకంటే మీది సంపాదకుడి విజయం. మిగతా పత్రికలు పూర్తిగా రచయితలు, పబ్లిసిటీ, ఫోటోలపై మనుగడ సాగిస్తున్నాయి. సంపాదకుడే సుప్రీం అని మీరు ఋజువుచేశారు.

పత్రిక సుప్రీం కాని, రైటర్స్ కాదు.

ఇటువంటి పత్రికలకు నేను అనుకూలుడిని. మీరిది స్వాతి సచిత్ర మాసపత్రిక విషయంలో, ఇప్పుడు స్వాతి సపరివారపత్రిక విషయంలో సాధించారు.

అప్పటి బలరామ్‌లో ఇప్పటి బలరామ్‌లో మంచితనంలో మార్పు లేదు. అదే మీ గ్రేటెస్ట్ క్వాలిటీ- ఎసెట్ కూడా.

కొన్నాళ్ళు నేను స్వాతితో ఉన్నందుకు గర్విస్తున్నాను. స్వాతితో ఉన్న ప్రతిక్షణం నేను ఎంతగానో ఎంజాయ్ చేశాను. అప్పటి రోజులు మళ్ళీ నా కళ్ళముందు మెదిలాయి.

మరోమారు మీకు అభినందనలు తెలియజేస్తున్నాను.

యర్రంశెట్టి శాయి హైదరాబాద్
9.7.2010

విజయీభవ! దిగ్విజయీభవ!

'స్వాతి' సపరివార పత్రిక ప్రారంభ సంచిక నుండి క్రమం తప్పకుండా చదువుతున్నాను. 'స్వాతి'కి అభిమానిని అయిపోయాను. స్వాతిముత్యం స్వచ్ఛతకు చిహ్నం. మీ స్వచ్ఛమైన మనసు 'స్వాతి'లో ప్రతిబింబిస్తుంది.

స్వాతి చినుకులు ఆధ్యాత్మికంగా పరిపక్వమై పండి, ఎంతో పాండితీ ప్రకర్షతో రాసినట్లు ఉంటాయి.

స్వాతి ద్వారా విజ్ఞానం, ఆహ్లాదం, ఆధ్యాత్మికత, సరసం, హాస్యం వంటివన్నీ లభిస్తాయి.

'స్వాతి' సపరివార పత్రిక అన్నందుకు పేరు సార్థకపరుచుకుంటూ అన్నివయసులవారినీ అలరిస్తూ యావత్ కుటుంబాన్నీ ఆనందపరుస్తోంది. అందుకనే మహోన్నతమైన విజయం సాధించింది. పేరుప్రఖ్యాతులు సంపాదించింది.

విజయీభవ! దిగ్విజయీభవ! అని మనసారా దీవిస్తున్నాను.

డా॥ సి.విశ్వనాథమ్ హైదరాబాద్
23.7.2010



మీరు ధన్యజీవులు

బలరామ్‌గారూ! స్వాతి సపరివార పత్రిక ద్వారా మిమ్మల్ని చూస్తున్నాను. పత్రికలో ప్రచురితమయ్యే ప్రతి అక్షరం వెనుక మీ సునిశిత పరిశీలనా దృష్టి వ్యక్తమవుతుంది. అందుకే స్వాతిలో ప్రత్యేకించి ఏది బాగుంటుంది అంటే చెప్పడం కష్టం.

'స్వాతి' ఇంతటి ప్రాచుర్యం సంపాదించుకోవడానికి మీ కార్యకుశలత, అంతర్లీనతలే కారణం. స్వాతి మాస, వార పత్రికలను బిడ్డలుగా చూసుకునే మీరు నిజంగా ధన్యజీవులు.

స్వాతి సపరివార పత్రిక పాఠకుల సంఖ్య నలభై లక్షలకు చేరుకోవటం గొప్ప విషయం. మీరు ఈ పత్రికను ఎంతగా పెంచి పోషించారు, వివిధ అంశాలతో పాఠకుల ఆసక్తిని ఏవిధంగా వృద్ధిచేసుకుంటూవచ్చారనడానికి ఇది స్పష్టమైన సంకేతం. ఇది ఓ అద్భుతమైన విజయం.

తెలుగు పాఠకులకు స్వాతి చినుకులు ఓ వరం. ఈ సంపాదకీయాలు ఆలోచనల్ని రేకెత్తించి, ప్రజలకు సరైన దిశను చూపించగలవు.

దేశ రాష్ట్రపతులు, ప్రధానమంత్రులతో కలసి విదేశీ పర్యటనల్లో పాల్గొనే అవకాశాల్ని మీరు పొందగలగడం, మీరు పాఠకుల పట్ల ప్రదర్శించే నిబద్ధతకు ఎంతో గుర్తింపు లభించిందనడానికి నిదర్శనం. అటువంటి మీరు ఎన్నో అవార్డులు, ప్రశంసలకు పాత్రులు కావడంలో ఆశ్చర్యంలేదు.

ఐ.సదాశివగుప్త హైదరాబాద్
6.8.2010



నిజము నిజము!

తెలుగు మేగజైన్ మొఘల్
పత్రిక పేరునే ఇంటిపేరుగా మార్చుకొన్న గజల్
శ్రీ వేమూరి బలరామ్
బలరామ్ ప్రీతిమీర
స్వాతి రజతోత్సవం జరుపుకొనగ
హితులు సన్నిహితులు బంధుతతులు మోద
భరితులై పొంగి మనసార ప్రస్తుతింప
ఏడుకొండల నెలకొన్న తేడువాడు
నిండుమనసుతో దీవించు నిజము నిజము!
స్వాతి పాఠకదేవుళ్ళ చేతి చలువ
సతము రక్షించుచుండును సత్యమిదియె!

డా॥ పులికంటి కృష్ణారెడి తిరుపతి
13.8.2010

స్వాతి ది బెస్ట్

పత్రికారంగంలో స్వాతి ఓ 'తేనెపట్టు'
స్వాతి పత్రికలోని ప్రతీ శీర్షిక ఓ 'తేనెబొట్టు'
స్వాతి పాఠకులపై కనికట్టు
స్వాతి తెలుగు కట్టూబొట్టూ
స్వాతి ఆబాలగోపాలానికి పనికొచ్చే ఓ అక్షర పనిముట్టు
స్వాతి సాహితీ, సంగతుల సవ్యసాచి
స్వాతి భారతీయ పత్రికారంగానికి నవ్య దిక్సూచి
స్వాతి నివాసాంధ్రులపై, ప్రవాసాంధ్రులపై కురిపిస్తుంది అక్షరజల్లు
స్వాతి రంగైన బంగారు శీర్షికల వార్తల హరివిల్లు
ఎన్నో శీర్షికల ఏకైక పత్రిక స్వాతి!
స్వాతి పత్రికారంగానికే ఎనలేని ఖ్యాతి
నూ'తన'త్వం స్వాతి లక్ష్యం - దీనికి పాఠకాదరణే సాక్ష్యం
కాలానుగుణంగా మారటమే స్వాతి అభివృద్ధికి అసలు గుట్టు
ముద్రణలో - ముద్రలో రాజీపడకపోవడంలో స్వాతి పర్‌ఫెక్టు
అన్ని తరాలవారిని ఆకట్టుకోవటంలో స్వాతి ఫస్ట్
అందుకే తెలుగు పత్రికల్లో స్వాతి స్థానం ది బెస్ట్

బి.ఎమ్.పి.సింగ్ విజయవాడ
20.8.2010



ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే

'స్వాతి' 26 వసంతాలు పూర్తిచేసుకోవడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది.

ఇంతవరకూ ఎన్నో పత్రికలు ఆర్థికంగా విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే వాటి అభివృద్ధికి మూలకారకులైన పాఠకులను తగినవిధంగా సత్కరించలేకపోయాయి. కాని మీరు అలా చేయలేదు. వారికి మీ పత్రిక ద్వారా ఏదో ఒక రూపేణా బహుమతులను అందజేస్తూ మీ కృతజ్ఞతను తెలియజేసుకుంటున్నారు.

ఒడుదుడుకులు తట్టుకుని, నిరంతరకృషి, పట్టుదలతో పైకొచ్చిన వ్యక్తులు మాత్రమే వెనక్కి తిరిగి చూసుకుంటారు. అలా చూసుకునే వ్యక్తుల్లో అగ్రస్థానం మీదే.

'స్వాతి చినుకులు' మొదటిపేజీ నుండి చివరిపేజీ వరకు చదివాను. మీ జీవిత అనుభవాలలోంచి పుట్టి, 'స్వాతి' చినుకులుగా మారి, పాఠక హృదయాల్లో కురిసి అవి స్వచ్ఛతను పైకి తీసుకువస్తాయనడంలో సందేహం లేదు. మరిన్ని 'స్వాతి చినుకులు' మీ కలంలోంచి జాలువారాలని కోరుకుంటున్నాను.

'స్వాతి' అనేక విజయాలను సాధిస్తూ, ఇంకా పైకి ఎదగాలని మనసారా ఆశిస్తూ...

కరుణాకర్ హైదరాబాద్
27.8.2010

హిప్నటైజ్ చేసే 'స్వాతి'

స్వాతి సపరివార పత్రిక 26వ మైలురాయిని దాటడం చాలా ఆనందదాయకం.

వేమూరి బలరామ్‌గారూ! కొందరు మాటలతో ఆత్మీయులవుతారు, మరికొందరు రాతలతో, ఇంకొందరు చేతలతో దగ్గరవుతారు. ఈ మూడింటినీ ఔపోసనపట్టినవారు మీరు.

అందుకే పైవాటితోపాటు మీ నిరంతర కృషి, దీక్ష, పట్టుదల, పరిశ్రమ, నిశ్చయమైన అభిప్రాయాలు, నిర్దిష్టమైన పంథా, మిమ్మల్ని ఆంధ్ర ప్రజల నీరాజనాలు అందుకునేలా చేశాయి.

సాధారణంగా అందరూ విమర్శలంటే భయపడతారు. కాని విమర్శలను సైతం విజయబాటలుగా మలచుకున్న విశిష్ట వ్యక్తి మీరు.

స్వాతి చినుకులు చదివాను. హిప్నటైజ్‌చేసే నన్నే అవి హిప్నటైజ్ చేశాయి. Psychological counselling చేసినప్పుడు ఇవి నాకు చాలా సార్లు పనికొచ్చాయి.

మరీ సున్నితమనస్కులైనవారికి, ఎమోషనల్‌గా డిస్టర్బ్ అయ్యేవారికి, తమకుతామే సమస్యలు సృష్టించుకునేవారికి, ఆత్మవిశ్వాసం లోపించిన వారికి, విమర్శచేయడమే పరిశ్రమగా పెట్టుకునేవారికి... ఇలా ఎందరికో ఇందులో Sweetగా Shortగా Suggestions ఉన్నాయి.

స్వాతి చినుకులు is nothing but short & sweet suggestions to the needy అని నాకు అనిపించింది.

ఇది కూడా మానసిక విశ్రాంతినిచ్చే ఔషధమే. స్వాతి కలకాలం తెలుగువారిని హిప్నటైజ్ చేస్తూనే ఉండాలని కోరుకుంటూ...

డా॥ బి.వి.పట్టాభిరామ్ హైదరాబాద్
3.9.2010



'స్వాతి' స్థానం 'స్వాతి'దే

వేమూరి బలరామ్ గారూ! తెలుగునాట 'స్వాతి' సపరివార పత్రిక ఆవిర్భవించి ఇరవై ఆరేళ్ళుగా తన ప్రస్థానం సాగిస్తుండడం చాలా ఆనందం కలిగించింది.

భారతదేశ పత్రికల్లో ప్రముఖ స్థానాన్ని పొందడం, 'స్వాతి'లాంటి ఓ విలక్షణ పత్రిక మా తెలుగుభాషలో ఉందని చెప్పుకోవడం తెలుగు అక్షరం తెలిసిన ప్రతివారికీ గర్వకారణం.

'స్వాతి'ని ఈ స్థానంలో నిలబెట్టిన మీకు తానావారు 'తెలుగు మేగజైన్ మొఘల్' అవార్డును ప్రదానం చేయడం సముచితం.

ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన 'స్వాతి' సపరివార పత్రికలో నేను సైతం రచనలు చేసి బహుమతులు పొందాననే భావన, ఆనందానుభూతి అక్షరాలకి అందనిది.

తెలుగుభాష ఉన్నంతకాలం 'స్వాతి' స్థానం 'స్వాతి'దే.

కాశీ విశ్వనాథ్ విశాఖపట్నం
10.9.2010


మీరో ట్రెండ్‌సెట్టర్

వేమూరి బలరామ్‌గారూ! భారతదేశంలోని 301 మేగజైన్‌లలో మూడవ లార్జెస్ట్ సర్క్యులేటెడ్ మేగజైన్‌గా స్వాతిని తీర్చిదిద్దిన మీకు నా అభినందనలు.

స్వాతి ఆరంభంలో భాగం పంచుకున్న నేను భారత రాష్ట్రపతి మరియు ప్రధానమంత్రులతో మీ పర్యటనలతో సహా మీరు అధిగమించిన అనేక మైలురాళ్ళను, మీ పురోగతిని నిశితంగా పరిశీలిస్తున్నాను. మీకు దక్కిన తెలుగు మేగజైన్ మొఘల్ అవార్డు అది వ్యక్తిగతంగా మీకు, స్వాతికి కూడా గుర్తింపదగిన పురోగతి. ఇది అరుదైన పురస్కారం. తెలుగు మేగజైన్ రంగంలో మరెవరూ పొందని అవకాశం.

ఈ విజయాలన్నీ ఓ ట్రెండ్‌సెట్టర్‌గా, ట్రైల్ బ్లేజర్‌గా, వివాదరహిత సంపాదకుడిగా పాత్రికేయరంగంలో మీ విశేష కృషిని తెలియజెప్పున్నాయి. స్వాతి త్వరలోనే 50 లక్షలమంది పాఠకుల సంఖ్యను అందుకోవాలని ఆశిస్తున్నాను. మీ నిబద్ధత, అంకితభావం, దూరదృష్టిలతో త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించి, సరికొత్త శిఖరాల్ని అందుకోగలరని భావిస్తూ...

టి.సి.రామయ్య విజయవాడ
17.9.2010



ఓ వినూత్న సేవ

గౌరవనీయులైన బలరామ్‌గారూ! కాదేదీ కవితకనర్హం. కాదేదీ సామాజిక సేవకనర్హం. మీరు స్వాతి ద్వారా చేస్తున్నది ఓ వినూత్న సేవ. జీవితాల్లో టెన్షన్ నిండిపోయి, విశ్రాంతికి తావులేని ఈ రోజుల్లో 'స్వాతి' ద్వారా మీరు చేస్తున్న సేవ సమాజానికి ఎంతో ఉపయోగకరమైనది. అత్యంత నిస్వార్థమైనది.

రిలాక్సేషన్ కోసం స్వాతి చదివే పాఠకులలో నేనొకదాన్ని. ఇది తక్షణమే నా బుర్రను చల్లబరుస్తుంది. హార్డ్‌వర్క్‌ని నేను విశ్వసిస్తాను.అలా కష్టపడేవారిని నేను ఆరాధిస్తాను. వారిలో మొదటిస్థానం మీదే.

మీరు సాధిస్తున్న గొప్ప విజయాలకు నా అభినందనలు. మీరు అరుదైన, విశిష్ట వ్యక్తి. మిమ్మల్ని కలుసుకునే అవకాశం 'స్వాతి' ద్వారా నాకు లభించడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను. మీరిలా తెలుగువారి కోసం నిరంతరం కృషి చేస్తూనేవుండాలని నా ఆశ.

డా॥ ఝాన్సీరాణి బొబ్బిలి నూజివీడు
24.9.2010

దీవెనల అక్షయం

తెలుగు పత్రికారంగాన ఇంతటి ఖ్యాతి!
నీకే సొంతం 'స్వాతీ'!
నీ వెలుగు ప్రసరించెను ఖండాంతరాలు దాటి
నిను చూడ మాకు కనువిందు
నీ గురించి విన వీనులవిందు
నీ రికార్డులకు సాటిలేదు
'స్వాతి' సపరివార పత్రిక
తెలుగుతల్లి సుపుత్రిక
కాపీలు కాదు నీ లక్ష్యం
పాఠకదేవుళ్ళ దీవెనల అక్షయం

రేవతి విశాఖపట్నం
1.10.2010



స్వాతితో నా అనుబంధం

'స్వాతి'తో అనుబంధం ఈనాటిది కాదు. దాదాపుగా స్వాతి పుట్టుకనించీ ఈనాటివరకూ కొనసాగుతూనేవుంది. స్వాతి ఎదుగుదలతోపాటు రచయితగా నేనూ ఎదుగుతున్నాను. స్వాతి ఇచ్చిన ప్రోత్సాహం అలాంటిది.

పాఠకులను దేవుళ్ళుగా భావించే వేమూరి బలరామ్ గారికి రచయితలు కూడా అటువంటివారే. ఎందరో కథకులను స్వాతి ద్వారా వేమూరి బలరామ్ గారు తిరుగులేని రచయితలుగా మార్చి పాఠకులకు అందించారు.

ఆ రోజుల్లో స్వాతి ఇంత అనూహ్యంగా ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ ఈ రోజు స్వాతి ఆకాశమంత ఎత్తుకు ఎదగటం చూసిన అందరి కళ్ళలోనూ ఆశ్చర్యమే.

ఇంతేకాదు. స్వాతి ఇంకా ఇంకా ఎదగాలి. వేమూరి బలరామ్ గారిలో అనుకున్నది సాధించే కార్యదక్షత ఉంది. మరింతగా ఎదిగే స్వాతితో రచయితలకీ, పాఠకులకీ అనుబంధం మరింత బలపడాలి.

ప్రతాప రవిశంకర్ *గుంటూరు*
8.10.2010

విజ్ఞానం + వినోదం + వికాసం

స్వాతి సపరివారపత్రిక ప్రతి కుటుంబంలోనూ, ప్రతి ఒక్కరూ చదవవలసిన వీక్లీ. ప్రస్తుతం తెలుగులో ప్రచురింపబడుతున్న వారపత్రికల్లో అధికంగా చదువుతున్నది, విజ్ఞానం + వినోదం + వికాసం కలిగిస్తున్న వారపత్రిక స్వాతి.

ఏ వారపత్రికలోనూ లేని విషయాలు పాఠకలోకానికి అందించిన, అందిస్తున్న ఘనత స్వాతి సపరివార పత్రికదే.

అత్యధిక పాఠకుల అండదండలే 'స్వాతి'కున్న శక్తి.

కప్పగంతుల భాస్కరరావు *భట్నవిల్లి*
22.10.2010



కసితో నాస్తి దుర్భిక్షమ్

శ్రీ వేమూరి బలరామ్ గారూ! 26 సంవత్సరాలుగా 'స్వాతి' సాధిస్తున్న విజయాలు చూస్తుంటే "What is now proved was once only imagined" అన్న విలియం బ్లేక్ సైన్స్ గురించి చెప్పిన సూక్తి మీ గెలుపుకే వర్తిస్తుందనిపిస్తోంది.

అందుకే పాఠక హృదయాలను ముత్యపుచిప్పలుగా మార్చగలిగిన మీ 'స్వాతి చినుకులు' మీ అకుంఠితదీక్షపరంగా మీ మేధస్సునుంచి రాలిపడిన స్వేదబిందువులు.

మీకంటూ ఓ బాణీ మీదైన శైలిగల మీరిలాగే దూసుకుపోతుంటే కృషికి అది నిర్వచనం మాత్రమే కాదు నాలాంటివాళ్ళకెందరికో మార్గదర్శకమవుతుంది కూడా.

"The great man is he who does not loose his child's heart" అన్న సూక్తినీ మరిచిపోకుండా కృషితో కాదు 'కసితో నాస్తి దుర్భిక్షమ్' అన్న పంథాలో ఎప్పటి పసిపాప నవ్వుతోనే మీరు కంటిన్యూ కావాలి. నా స్వల్ప పరిచయంలో మీలో చూసింది ఆ child's heart కాబట్టి దాన్ని ఇకముందూ పదిలంగా దాచుకోండి. ఇంకా దూసుకుపోండి...

కొమ్మనాపల్లి గణపతిరావు హైదరాబాద్
15.10.2010

సాహితీసేవే మానవసేవగా...

శ్రీ వేమూరి బలరామ్‌గారూ! ఈ లోకంలో ఎందరో అదృష్టవంతులు ఉంటారు. అందరికీ సాహితీసేవ ద్వారా మానవసేవ చేసే అవకాశం లభించదు. అంతటి ఉత్కృష్టమైన అవకాశం మీకు లభించడం తెలుగువారిగా మేమందరం గర్వించదగ్గ విషయం.

మీ అభ్యుత్థాన, విజయ, విక్రమ గమనాన్ని ధీరోదాత్త అధిరోహణా క్రమాన్ని చూస్తుంటే ఒకటి అనిపిస్తోంది... భగవంతుడి అంశ ఉంటే తప్ప ఒక వ్యక్తి ఇంతటి మహాశక్తిగా రూపాంతరం చెందలేరు.

మా తరానికి భగవత్ స్వరూపాన్ని ఆవిష్కరించిన మానవశక్తి శిఖరమైన మీకు ఆ భగవంతుడు సర్వశుభాలనూ కలగజేయాలని కోరుకుంటున్నాను.

ఎమ్.కోటేశ్వరరావు చెన్నై
29.10.2010



ఉల్లాన్ని పల్లవింపజేసే 'స్వాతి'

తెలుగు పత్రికారంగంలో 'స్వాతి' ఒక విశిష్టస్థానాన్ని పొంది, ప్రజాదరణ పొందడం సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం.

పాఠకుల ఉల్లాన్ని పల్లవింపజేస్తోంది 'స్వాతి'.

మీ 'స్వాతి చినుకులు' నా ఎదను బాగా తడిపాయి. మంచి ఆలోచనలు మొలకెత్తించాయి. ఆలోచనలకు పదునుపెట్టాయి. భాష సరళం. మధురం. కొన్ని వాక్యాలు మళ్ళీ మళ్ళీ మదిలో మెదిలేలా ఉన్నాయి.

భవిష్యత్తులో 'స్వాతి' భారతదేశంలోనే అత్యధిక సర్క్యులేషన్ కలిగిన పత్రికగా వెలుగొంది, తెలుగు పత్రికారంగానికే ఒక తలమానికంగా ఆచంద్రార్కం వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

డా॥ గుత్తా మునిరత్నం తిరుపతి
5.11.2010

పనిచేయడమే ఆయనకు సరదా

'కొందరు సరదాకు పనిచేస్తారు, కానీ తెలివైనవారికి పనిచేయడమే ఓ సరదా...!' అన్నారు పెద్దలు.

శ్రీ బలరామ్‌గారూ! మీరు పై కొటేషన్‌లో రెండో కోవకు చెందిన విశిష్ట సంస్కారమున్న వ్యక్తులు.

అందుకే వారం వారం 39.59 లక్షలమంది పాఠకులను అలరిస్తోంది 'స్వాతి' సపరివార పత్రిక. 'తెలుగు మేగజైన్ మొఘల్' అనే ప్రతిష్ఠాత్మకమైన అవార్డు మీకు లభించింది.

మీ క్రమశిక్షణ, పట్టుదల మరెన్నో విజయాల్ని, పురస్కారాల్ని మీకు లభించేలా చేస్తాయి.

పెరుగు రామకృష్ణ నెల్లూరు
19.11.2010



వజ్రాయుధమంత శక్తిగలది

శ్రీ వేమూరి బలరామ్ గారూ!

కృషి, దీక్ష, పట్టుదలకు భాష్యం చెప్పిన పత్రికారంగ ఋషీవరులు మీరు. కృషిని నమ్మిన మహామనీషి మీరు. కేవలం మీ ఒక్కరివల్లే స్వాతి మాస, వారపత్రికలు హిమాలయశిఖరమంత ఘనకీర్తిని పొంది దేశ, విదేశ, అశేష అభిమాన పాఠకుల ఆరాధ్యదేవతలుగా విజయయాత్ర సాగిస్తూనే ఉన్నాయి.

'స్వాతి' కీర్తిసంపదను ఎవరూ అడ్డుకోలేరు.

మీకు భగవంతునిపై గల విశ్వాసమే తెలుగు పత్రికారంగంలో 'స్వాతి'ని వజ్రాయుధమంత శక్తివంతంగా తయారుచేసింది.

ఇకముందు కూడా మీకు అన్నీ శుభాలే కలగాలని కోరుకుంటూ...

కె.ఎస్.రామకృష్ణ విజయవాడ
12.11.2010

ప్రతి సంపాదకుడూ మీలాంటివారైతే

శ్రీ బలరామ్ గారూ! నాకు ప్రియమైన పత్రిక 'స్వాతి'.

ఏ సిఫారసులు, ఏ కష్టనిష్టూరాలూ అవసరం లేకుండానే పత్రికా కార్యాలయాలకు సుదూరంగా ఉంటున్న నన్ను ఓ రచయిత్రిగా చెయ్యి పట్టి పాఠకుల మధ్యకి తీసుకెళ్ళి వదిలిందీ, నాకంటూ ఓ గుర్తింపు నిచ్చిందీ 'స్వాతి'.

రచయిత(త్రు)లలో దాగిన ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించగల విశిష్ట వ్యక్తులైన మీలాంటివారే ప్రతి పత్రికాధిపతీ, సంపాదకులూ అయితే అజ్ఞాతంలో ఉండిపోయిన ఎందరో సమర్థులు వెలికివస్తారు.

రచయిత్రిగా నాకంటూ ఓ స్థానాన్ని సంపాదించిపెట్టిన 'స్వాతి'కీ, 'స్వాతి' రథసారథులైన మీకు నా కృతజ్ఞతలు.

కుమారి వింజమూరి విజయశాంభవి ఆలూర్
26.11.2010



ఆయన జీవననాదం స్వాతి

'స్వాతి' తెలుగువారందరికీ ఆత్మీయమైన, అత్యంత దగ్గరైన పేరు. స్వాతిని ఒక పత్రికగాకాక తమ అనుంగు పుత్రికగా చూసుకుని గర్విస్తుంటారు ఆంధ్రులు.

ప్రతివారం లక్షలాది తెలుగు పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుని ముందుకు సాగుతున్న 'స్వాతి' విజయాల వెనుక ఒక 'వ్యక్తి' కాదు, 'శక్తి' నిరంతర శ్రమ ఉంది. కఠోర పరిశ్రమ ఉంది. స్వాతిలోనే మమేకమైపోయిన ఆయన జీవననాదం ఉంది. పటిష్ఠ ప్రణాళిక ఉంది. సామాన్య స్థితినుంచి ఆరంభమయిన ఆయన జీవితం మొత్తం స్వాతిలో ఇమిడి ఉంది.

ఆయన మరెవరో కాదు. మనందరికీ చిరపరిచితులైన బలరామ్ గారు. స్వాతి బలరామ్‌గా వాసికెక్కారు. వ్యక్తిగా ప్రారంభమై నేడు తెల ుగువారి మధ్య గణనీయమైన శక్తిగా మారారు.

1984 ఆగష్టునెలలో ప్రారంభమైన 'స్వాతి' సపరివార పత్రిక డిశంబర్ 1997నాటికి 3 లక్షల 25 వేల కాపీల సర్క్యులేషన్‌ను సాధించు కుని, సర్క్యులేషన్‌లో ఆల్ టైమ్ రికార్డుగా నిలబడిపోయిందనడంలో సందేహం లేదు. ఇదో కొత్త చరిత్ర. తెలుగు పత్రిక పుట్టిననాటినుండి ఇంతవరకు ఈ 171 సంవత్సరాల కాలంలో ఏ వారపత్రికా అధిరో హించని సువర్ణ శిఖరాన్ని అధిరోహించింది స్వాతి.

భారత ప్రధానమంత్రులు, రాష్ట్రపతులతో ప్రభుత్వ ఆహ్వానంపై 'స్వాతి' సపరివార పత్రికా సంపాదకునిగా విదేశీ పర్యటనలు చేసే అవకాశం శ్రీ వేమూరి బలరామ్‌కు పన్నెండుసార్లు లభించింది.

ఏ పత్రికా సంపాదకునికీ లభించనన్ని విదేశీ పర్యటనావకాశాలు ఆయనకు లభించటం ఒక విశిష్టత.

ఇంతటి ఘనవిజయాలకు కారణం ఆయన వేమూరి బలరామ్‌గా గాక 'స్వాతి' బలరామ్‌గా 'స్వాతి'కి అంకితం కావడమే.

విద్య 16-28 ఫిబ్రవరి, 1998
3.12.2010



వెలుగులు పంచే సూర్యుడు ఈ బలరాముడు

అవును బలరామ్‌గారూ. ఇంత సుదీర్ఘ సాహితీ వ్యవసాయం తర్వాత సిరులు పండే 'స్వాతి' క్షేత్రాన్ని లక్షల హృదయాలకు విస్తరించిన తర్వాత కూడా మీరు స్వచ్ఛంగా స్ఫటికంలా, అజాతశత్రువుగా మిగిలిపోవడం ఒక అరుదైన విశిష్టత. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు.

మీలో ఒక రహస్యం ఏమంటే- మీరు ఒక పక్కనుంచి అజాతశత్రువై కూడా మరొక పార్శ్వం నుంచి ఒక సింహబలుడు, ఒక మహా (జీవిత) పరాక్రమశాలి అయివున్నారు.

అనంత ప్రకృతిలో వానచినుకు ఒక సూక్ష్మకణంలా కనిపించినా దాని జీవశక్తి అపారం. అది పటాటోపం లేకుండా పారదర్శకంగా, సహజంగా, చిన్నదిగా వుందికదా అని దానిని బండరాళ్ళు పరిహాసమాడితే అప్పుడది ఇలా అన్నదట: "నా బలాన్ని నాలో ఏంచూస్తారు- నేలమీద నా స్పర్శతో ఏపుగా పెరిగిన పంటపొలాల్లో చూడండి!"

అలాగే-మీ నిజమైన బలాన్ని ఎవరైనా దర్శించాలనుకుంటే మీ వెనుక మీకు వెన్నుదన్నుగా శతసహస్రంగా బారులు తీరివున్న మీ అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులలో నిరభ్యంతరంగా చూడవచ్చు.

అభిమాన పాఠకులను 'పాఠకదేవుళ్ళు'గా సంబోధించిన తొలి పత్రిక 'స్వాతి'. ఏ క్షణాన మీరు పాఠకులను 'దేవుళ్ళు' అన్నారోగాని ఆ క్షణం నుంచి మీకు ముక్కోటిదేవతల బలం కూడా తోడైంది. ఇది నా కంటె బాగా చెప్పగలిగిన ప్రత్యక్ష సాక్షి - ఇప్పటికీ మీ ఇంట్లో మీరు పదిలంగా భద్రపరచుకున్న ఒకనాటి మీ సైకిల్!

ఆనాటి మీ స్వేదం ఈనాటి 'స్వాతి' వేదంగా నినదించడం వెనుక మీ కఠోర పరిశ్రమ, మీ సడలని దీక్ష, మీ ఏకోన్ముఖ కృషి, మీలోని కృషీవలుని భీమబలం ఎటువంటివో అలనాటి మీ సైకిల్‌ని అడగాలేగాని కథలు కథలుగా చెబుతుంది.

శ్రమఫలమే దైవత్వం అయితే మీలోని మహాదేవునికి నమోవాకాలు. అన్ని తరాలవారికీ- ఎన్ని తరాలకయినా మీరు ఒక తరగని ఆదర్శం.

శ్రమజీవనంతో సర్వదేవతలనీ ప్రసన్నంచేసుకున్న మీరు ఒక ఋషీ, ఒక మహామనీషీ కూడా.

మీకు ఆత్మీయులైన వారినందరినీ ఒకచోట చేర్చి మీ ఆస్తిపాస్తుల్ని ఒక వాటాగా, మిమ్మల్ని ఒక వాటాగా పెట్టి, ఏది కావాలో కోరుకొమ్మంటే నేనైతే ఖచ్చితంగా మిమ్మల్నే కోరుకుంటాను. ఒకవేళ ఏ ఒక్కరయినా మరొక రకంగా కోరుకుంటే అతడిని చూసి జాలిపడతాను. ఎందుకంటే- క్రమశిక్షణతో శ్రమిస్తే ఆస్తిని ఒకనాటికి సృష్టించుకోగలం. కాని తల కిందులుగా తపస్సుచేసినా మరొక మిమ్మల్ని సృష్టించుకోలేం!

బలరామ్‌గారూ, మీరు వెలుగులు పంచే సూర్యుడు. అందుకే- కన్నెత్తి మిమ్మల్ని సూటిగా కూడా ఎవ్వరూ చూడలేరు. సృష్టికర్త అయిన బ్రహ్మకు కూడా మనదేశంలో మూడంటే మూడు గుడులే (పుష్కర్ లేక్-అజ్మీర్ ఖోఖన్-కులూవ్యాలీ, ఖేదబ్రహ్మ-కేరళ) వున్నాయి.

తెలుగు మేగజైన్ రంగ విశ్వకర్మ అయిన మీకు మాత్రం అడుగడుగునా-ప్రతి హృదయంలోను - అనవరతం అభిమానపు దిగుబడుల నిచ్చే అసంఖ్యాక నారుమడులున్నాయి.

'స్వాతి'ని ఇంకా పెంచి పెద్దచేసుకోవడం తెలుగు జాతికి చారిత్రక అవసరం. మిమ్మల్ని గౌరవించుకోవడం తెలుగువారికి స్వీయగౌరవం.

మీ ఆశయాలకు, సాధనకు ఆలంబనగా మీ వెనుకే మేమంతా...

మేమంతా వున్నాం.

మాగంటి చెన్నై

10.12.2010



యువతరానికి ఓ ఆదర్శం

తెలుగు పత్రికల్లో గర్వించదగ్గ అగ్రగామి పత్రికలుగా ఆదరణ పొందుతున్నాయి 'స్వాతి' సచిత్ర మాసపత్రిక, 'స్వాతి' సపరివార పత్రికలు. 'స్వాతి' అనగానే స్ఫురణకొచ్చే వ్యక్తి శ్రీ వేమూరి బలరామ్.

'పత్రికా నిర్వహణను ఒక కాలక్షేపంగాకాక అదే జీవితంగా కొనసాగించాలంటే అంకితభావం ఉండాలి' అని భావించి, పూర్తిగా పత్రికా రంగానికే అంకితమైపోయారు శ్రీ వేమూరి బలరామ్.

"పాఠకుడిలో ఆలోచనని రేకెత్తించే ఉత్తమ సాహిత్యాన్ని అందించాలన్నదే మా ధ్యేయం. 'స్వాతి'లోని ప్రతి రచనా ఒక ఆణిముత్యం అనిపించే విధంగా దీనిని సార్థకనామధేయం చేసుకోవాలని మా సంకల్పం" అని మాసపత్రిక ప్రారంభంలో చెప్పారాయన. ఆ సంకల్పాన్నే నెరవేర్చుతూ పత్రికా నిర్వహణే పరమార్థంగా నాలుగు దశాబ్దాలుగా మాసపత్రికను ఉత్తమ సాహిత్య మాసపత్రికగా నడుపుతున్నారు.

"స్వాతి ఆరంభిస్తుంది. ఇతర పత్రికలు అనుసరిస్తాయి. అందుకే మాసపత్రికలకు మూసపత్రిక స్వాతి" అని మహాకవి శ్రీశ్రీ అభినందించారు. ఆ మహాకవి మాట అక్షరసత్యమై, ఇప్పటికీ స్వాతి వార, మాస పత్రికలు అదేవిధంగా నడుస్తున్నాయి.

పత్రికారంగంలో ఒక వినూత్న విభిన్న శకానికి శ్రీకారం చుడుతూ **1984** ఆగష్టు నెలలో 'స్వాతి' సపరివార పత్రిక ఆవిర్భవించింది. ఆరంభించిన అనతికాలంలోనే అశేష పాఠకాదరణ చూరగొంది. 'ది బెస్ట్ విక్లీ ఆఫ్ ది తెలుగు రీడర్స్'గా అగ్రస్థానంలో నిలిచింది.

సంఘాలు, సన్మానాలు, బిరుదులులాంటి వేటిమీదా దృష్టిపోనీయక కేవలం 'స్వాతి' తప్ప మరో ప్రపంచంవైపు, మరో ప్రసిద్ధివైపు కన్నెత్తి చూడకపోవడం శ్రీ వేమూరి బలరామ్‌గారిలోని విశిష్టత.

మట్టిని పిసికి, వరి పండించి, కష్టమే జీవనాధారంగా గడిపే పల్లె కుటుంబంలో పెరిగి, ఈ రోజు ఆంధ్రదేశం గర్వించదగ్గ విశిష్ట సంపాదకుడిగా ఎదిగిన శ్రీ వేమూరి బలరామ్ గారి ప్రగతి తన అవిరళకృషితో, ప్రతిభతో సాధించినది. యువతరానికి ఆయన ఓ ఆదర్శం.

మేలుకలయిక
17.12.2010

వేమూరి బలరామ్ సెల్ఫ్ పోర్ట్రెయిట్ 'స్వాతి'

చదవనేర్చిన ప్రతివ్యక్తి చేతిలోనూ స్వాతి సపరివార పత్రిక చక్కగా ఇమిడిపోతుంది.

తెలుగు ప్రజాజీవనంతో మమేకమైపోయింది స్వాతి.

స్వాతి పత్రిక నిర్వహణను ఒక తపస్సులా భావించి, విజయవంతంగా నడుపుతున్న అధినేత శ్రీ వేమూరి బలరామ్‌ని చూస్తుంటే- సునిశిత పరిశీలనాదృష్టి, ఎక్కడ ఏ మెరుపు కనిపించినా తక్షణమే దానిని గుర్తించి, కైవసం చేసుకోగల సూక్ష్మదృష్టి ఆయనలో కన్పిస్తుంది.

స్వాతి మాసపత్రిక ప్రచురిస్తున్న సమయంలో ప్రముఖ రచయితలందరి రచనలు ప్రచురించి, అనేక నూతన ఒరవడులను సృష్టించిన శ్రీ వేమూరి బలరామ్, స్వాతి సపరివార పత్రికను ప్రారంభించిన తరువాత సంపాదకుల దృష్టి నుండి పాఠకులను పరిశీలించే విధానానికి స్వస్తి చెప్పి, పాఠకుల దృష్టి నుండి తన పత్రికను, అందులోని రచనలను పరిశీలించడం ప్రారంభించారు.

